www.janashaktionline.com

# జనశక్తి

విప్లవ కమ్యూనిస్టుల పక్ష పత్రిక

సంపుటి : 45 | సంచిక : 9 | విజయవాడ | 5-9-2012 | పేజీలు : 16 | వెల : రు 5.00

లోపలి పేజీల్లో...

◈ రాష్ట్ర ఆర్థిక-రాజకీయ పరిస్థితి-మన కర్తవ్యాలు :
సిపిఐ(ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటి రాజకీయ తీర్మానం

◈ ఫీజు రీఎంబర్స్‌మెంట్ 'మాయాజాలం' :
ప్రజాధనాన్ని దోచిపెట్టే ప్రభుత్వ విధానాలు

◈ మణిపూర్‌లో ద్రవ్య పెట్టుబడి చొరబాటుకు ఖండన

# రైతాంగానికి ఉరివేసే కాంట్రాక్టు సేద్యం

**కాంట్రాక్టు** సేద్యానికి అనుమతిస్తూ రాష్ట్రప్రభుత్వం ఇటీవల ఒక జీఓను విడుదల చేసింది. వ్యవసాయ ఉత్పత్తుల్లో కాంట్రాక్టు సేద్యం ఇంతవరకూ లేదని కాదు. అది చిన్నస్థాయిలో అడపాదడపా సాగుతున్నదే. (చూడండి బాక్సు-1) ఐటిసి కంపెనీ ప్రొద్దుతిరుగుడు పంటను కర్నూలు జిల్లాలో ఒకే ధరకు తాను కొంటానన్న వాగ్దానంతో రైతాంగంతో వేయించింది. ప్రస్తుతం కాడ్‌బరీస్ కంపెనీ పశ్చిమగోదావరి జిల్లాలో కొబ్బరి తోటల్లో అంతరపంటగా కొకొను వేయిస్తున్నది. మామిడిపళ్ల గుజ్జుతో 'మాజా" అన్న పానీయ తయారీకి కొకాకోలా కంపెనీ చిత్తూరుజిల్లాలో రైతులనుండి మామిడిపళ్ల కొనుగోలుకు ఒప్పందాలు చేసుకున్నది. అయితే ఇవి పెద్దస్థాయిలో పెరగకపోవటానికి మార్కెట్టు చట్టం-1969లోని నిబంధనలు ఆటంకంగా వున్నాయి. రైతులనుండి నేరుగా ఉత్పత్తులను కంపెనీలు కొనుగోలు చేయటాన్ని ఈ చట్టం అనుమతించదు. స్థానిక చిన్న వ్యాపారి కూడా మార్కెట్టుశాఖ నుండి లైసెన్సు పొంది, మార్కెట్టు యార్డు పర్యవేక్షణలోనే కొనుగోలు చేయాలి.

కాంట్రాక్టు సేద్యాన్ని ప్రోత్సహించేందుకు కేంద్రంలోని యుపిఏ ప్రభుత్వం ఒక మోడలు చట్టాన్ని తయారుచేసి, దాని ప్రకారం రాష్ట్ర చట్టాలు మార్చమని చెప్పింది. 2004 ఎన్నికల సందర్భంగా అప్పుడు ప్రతిపక్ష నాయకుడిగా వున్న రాజశేఖరరెడ్డి కాంట్రాక్టు సేద్యాన్ని వ్యతిరేకించాడు. ముఖ్యమంత్రి అయిన తర్వాత కేంద్రం ఆదేశాల ప్రకారం కాంట్రాక్టు సేద్యాన్ని స్వాగతించాడు. అమలుకు పూనుకుని ప్రజలూ, ప్రతిపక్షాలనుండి తీవ్ర వ్యతిరేకత రావటంతో వెనక్కు తగ్గాడు. ఇప్పుడు కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వం కాంట్రాక్టు సేద్యాన్ని అనుమతించే జీఓను విడుదల చేసింది. కరువుసమస్య, విద్యుత్తు సమస్యలతో ప్రజలు సతమతమవుతుండగా, వాటిని పరిష్కరించేందుకు ప్రయత్నించకుండా, వాటికి కూడా తమ ప్రాంతీయ, ముఠాతగవుల రంగులను అద్దుతూ ప్రజల దృష్టిని వాటిపైకి మళ్లిస్తూ, సందట్లో సడేమియాలాగా ఈ రైతాంగ వ్యతిరేక చర్యను తీసుకుంది. అభ్యంతరాలూ, సూచనలుంటే వ్యవసాయ మార్కెట్టుశాఖ ముఖ్యకార్యదర్శికి తెలియజేయమంటూ 30రోజుల సమయమిచ్చింది. ఈ వ్యాసం రాస్తున్న సమయానికి ఆ గడుపు తీరిపోయింది. ఇక రేపో ఎల్లుండో గవర్నరు సంతకం చేయించి చట్టాన్ని సవరించటం జరుగుతుంది. దీనితోపాటు రేపంటే రేపంటూ ఊరిస్తున్న రిటైలు రంగంలోకి విదేశీ పెట్టుబడులకు అనుమతినివ్వటం జరిగితే కాంట్రాక్టు సేద్యం పెద్దఎత్తున అమలుకావటానికి ఎక్కువ సమయం పట్టదు. కనుకనే గతంనుండీ వివరిస్తున్న కాంట్రాక్టు సేద్యం దుష్ఫతాలను మరోసారి గుర్తుచేసుకోవాల్సిన అవసరముంది.

## ప్రభుత్వ వాదనలు

ప్రభుత్వం ప్రపంచవాణిజ్యసంస్థ ఆదేశాలకు అనుగుణంగానే కాంట్రాక్టు సేద్యానికి అనుమతిస్తూ చట్టాన్ని సవరిస్తున్నట్లు దాపరికం లేకుండా చెప్పుకుంది. (చూడండి బాక్సు-2) వ్యవసాయరంగ సంక్షోభాన్ని, రైతాంగం కష్టాలనూ పరిశీలించి, వాటిని పరిష్కరించేందుకు తీసుకున్న చర్యకాదిది. సామ్రాజ్యవాదుల కనుసన్నలో నడిచే డబ్ల్యుటివో ఆదేశాన్నే పరిష్కారంగా ప్రజలను నమ్మించ చూసే ప్రయత్నంలో భాగంగానే ప్రభుత్వ వాదనలున్నాయి.

తన పంటకు ఏ రేటు వస్తుందో ముందుగానే తెలుసు గనుక రైతులు తమ సాగు ఖర్చులను దానికి తగ్గట్లుగా తగ్గించుకుంటారనీ, నాణ్యమైన ఉత్పాదకాలు(విత్తనాలు, ఎరువులు మొ॥)అందుతాయి గనుక లబ్ధిపొందుతారనీ వాదిస్తున్నది. ఇది వితండవాదనే. 70శాతం రైతాంగం చిన్న, సన్నకారులు రైతులుగా వుండి పెట్టుబడులు లేక రుణగ్రస్తులవుతుండగా, వారు వృధా సాగుఖర్చుల వల్లనే నష్టపోతున్నారని వాస్తవాన్ని తల్లక్రిందులు చేస్తున్నది. ఉత్పాదకాల ధరలన్నీ పెంచివేసి, దానివల్ల సాగుతున్న రైతాంగ శ్రమ నిలువుదోపిడీ దాచిపెట్టి, నాణ్యతలేని ఉత్పాదకాలే నష్టాలకు కారణంగా చూపే వాదనిది. ఇంతకీ నాణ్యత కలిగిన ఉత్పాదకాలు సరఫరాచేసిన కంపెనీ నాణ్యత పేరిట ఎక్కువ ధర వేయకుండా జీవోలో ఎలాంటి నిబంధనా పెట్టలేదు. ఇది నిరాధార ఆరోపణ కాదు. ఇది యిప్పటికే సాగుతున్నది. వ్యవసాయ ఉత్పత్తుల వ్యాపారం సాగిస్తున్న వ్యాపారులు పంటను తమకమ్మే షరతుమీద రైతాంగానికి అప్పులిస్తున్నారు. తరచుగా యిది విత్తనాలు, ఎరువుల రూపంలో వుంటున్నది. మైక్రోసేవ్ అన్న స్వచ్ఛంద సంస్థ జరిపిన సర్వే ఆంధ్రప్రదేశ్‌లో ఈ వ్యాపారులు రైతాంగానికి 5 వేలునుండి 30వేల వరకూ అప్పు యిస్తున్నారనీ, దీనికి 4 నుండి 6 రూ॥వరకూ వడ్డీ వసూలు చేస్తున్నారనీ తెలిపింది. రైతాంగ నిస్సహాయతను ఆసరా చేసుకుని స్థానిక వ్యాపారులే ఇంత దోపిడీచేస్తుంటే, విదేశీ గుత్తసంస్థలు ఇంకెంత స్థాయిలో చేస్తాయో ఊహించుకోవచ్చు. స్థానిక వ్యాపారి లాభం, అప్పుతీసుకుంటున్న రైతుకు అర్థమౌతుంది. కంటనీరు కుక్కుకుంటూ, మరో దారిలేకే చేయి చాస్తాడు. బడాకంపెనీలు తెలివిమీరినవి. నాజూకైన పేర్లతో దోపిడీకి అందమైన ముసుగులేస్తాయి. ఇవి అనుసరించే మోసపూరిత పద్ధతులను చూస్తూ పాలకులుండిపోతారు తప్ప రైతాంగానికి ఎలాంటి రక్షణా కల్పించరు. చంద్రబాబునాయుడి ఆదర్శ కుప్పం ప్రయోగంలో ఇజ్రాయిలు కంపెనీ రైతులకు కౌలుకూడా చెల్లించకుండా వెళ్ళిపోయింది.

ప్రభుత్వ వాదన ప్రధానంగా ఇదే. అధికారులూ, ప్రభుత్వాన్ని సమర్ధించే నిపుణులూ, ప్రణాళికాసంఘం ఈ వాదననే అటుతిప్పీ ఇటు తిప్పీ వాదిస్తున్నాయి. బడాబూర్జువాల, బడా వ్యాపారుల బాకాలైన ఫిక్కి, అస్సోఛామ్,సిఐఐలే కాక రైతాంగ సంక్షేమం చూడవలసిన ప్రభుత్వరంగ సంస్థలు నాబార్డు, మార్క్‌ఫెడ్, బ్యాంకులూ కూడా ఈ వాదనకే వంత పాడుతున్నాయి. కొన్ని రైతు సమాఖ్యలు కూడా దీనినే పరిష్కారంగా చూపుతున్నాయి. ప్రభుత్వరంగ స్టేటుబ్యాంకు, బడాకంపెనీల తరఫున తానే కాంట్రాక్టు సేద్యానికి దిగింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు రైతాంగానికి రుణాలివ్వటంలో 20 ప్రభుత్వరంగ బ్యాంకులు విఫలమయ్యాయి. కానీ రైతాంగానికి మేలు చేస్తామంటూ కాంట్రాక్టు సాగుకు ఉత్సాహంతో ముందుకొస్తున్నాయంటే రైతాంగ దోపిడీలో తమకొచ్చే వాటాను చూసి ఆశలు పుట్టడమే.

## సమానత్వం మోసం

రైతాంగానికీ, కంపెనీకి మధ్య పరస్పర అంగీకారంతో సమాన అవకాశాలతో ఒప్పందం జరుగుతున్నందున రైతుకు నష్టం జరగదని మరో వాదన ముందుకు తెస్తున్నారు. బలవంతుడికీ బలహీనుడికీ మధ్యజరిగే ఒప్పందం ఎప్పుడూ బలవంతుడికే అనుకూలంగా సాగుతుంది. ఈ ఒప్పందంలో పైకి కన్పించే ఆ సమానత్వం కూడా లేదు. ఒప్పందంలో చెప్పిన నాణ్యతతో, పరిమాణంలో, సమయానికి పంటను సరఫరా చేయకపోతే కొనకుండా నిరాకరించే అధికారాన్ని కంపెనీకిచ్చిన ప్రభుత్వం, రైతుకు అన్యాయం జరగకుండా ఒక్క రక్షణనూ ఇవ్వలేదు. నాణ్యత సాకుచెప్పి కంపెనీ కొనటానికి నిరాకరిస్తే, ధర తగ్గించి దానికే అమ్ముకొమ్మంది ప్రభుత్వ సమానత్వం! (చూడండి బాక్సు నెం.3)

నాణ్యత పేరుచెప్పి రైతాంగాన్ని దోపిడీ చేయటం. ధరను దిగ్గోయటం వ్యాపారులందరూ చేసే పనే. కాంట్రాక్టు సేద్యంలోకొచ్చిన కంపెనీలు ఇంకా పెద్దస్థాయిలో ధరను దిగకోస్తాయి. ఇలా దిగ్గోయటంలో వాల్‌మార్టు ఎంత నేర్పరో ఏ అమెరికా, లాటిన్ అమెరికా దేశాల రైతునడిగినా చెబుతాడు. పంజాబులో బంగాళాదుంపలు పండించిన రైతాంగాన్ని పెప్సికంపెనీ ఇలాగే దోపిడీ చేసింది. సామాన్యుడైన వ్యాపారిలాగే ఈ కంపెనీలు తరచుగా నాణ్యత సమస్యను ➔

➔ ముందుకుతెచ్చి ధరను తగ్గించివేస్తున్నాయని గత అనుభవమంతా తెలుపుతున్నదని మిన్నెసోటా యూనివర్సిటీ వ్యవసాయ ఆర్థికవేత్త డిక్ లీవెన్సు అన్నారు.

ఒప్పందంలో చిక్కుకుని, ఉత్పాదకాలు, రుణాలు పొంది పంటను అమ్మకానికి తెస్తే నాణ్యత తగ్గిందనో, గడువుతీరిందనో, చెప్పినన్ని బస్తాల పంట తేలేదనో వంక చెపితే, తెగనమ్ముకోవటం తప్ప రైతుచెయ్యగలిగిందేముంది!? వారేవరికైనా అమ్ముకోవచ్చు అని అనటం సులువే కానీ తీసుకున్న అడ్వాన్సులు చెల్లించకుండా ఎలా సాధ్యమౌతుంది. మార్కెట్టు యార్డులో వివాద పరిష్కార యంత్రాంగమన్నా వుంది. దీనిలో రైతుకు ఆ సౌకర్యమూ లేదు. అన్యాయం జరిగిందనుకుంటే కోర్టుకు వెళ్లి ఎప్పుడు న్యాయం జరుగుతుందా అని ఎదురుతెన్నులు చూడాలి. కాంట్రాక్టుసాగు సమర్థకులు సమానత్వానికి కొత్తఅర్థమిచ్చారు. ధనికుడి కనుకూలంగా సాగటమే సమానత్వం.

## తీవ్ర పర్యవసానాలు

కాంట్రాక్టు సేద్యం తీవ్ర పర్యవసానాలకు దారితీస్తుంది. ఇవి తక్షణ, దీర్ఘకాలిక స్వభావాన్నీ; వ్యక్తులుగా, వర్గంగా రైతాంగాన్నీ, అలాగే దేశ ఆర్థిక వ్యవస్థనూ పరాధీనంచేసే స్వభావాన్నీ కలిగివుంటాయి. (తరువాయి 2వ పేజీలో)

సంపాదకీయం

# అస్సాంలో ఆరని చిచ్చు రగిలిస్తున్న పాలకులు

**అస్సాంలో** జాతి విద్వేషాల చిచ్చు రగులుతూనే వుంది. ఈ మాట అన్నందుకు అస్సాం ముఖ్యమంత్రి తరుణ్ గోగోయ్ పత్రికలవారిపై మండిపడ్డారు. అస్సాం ప్రశాంతంగా వుందన్నది ఆయన వైఖరి. బాధితులను పరామర్శించేందుకు కూడా ఆయన వెళ్లలేదు. భారత ప్రధాని తన పర్యటనలో ఇవి దురదృష్టకర ఘటనలని వ్యాఖ్యానించారు. సాధారణ పరిస్థితులు త్వరితంగా నెలకొంటున్నాయని సెలవిచ్చారు. రు. 300 కోట్ల ఆర్థిక సాయాన్ని ప్రకటించారు. దీనితో గోగోయి నోరూరింది. అస్సాం అగ్నిపర్వతంపై కూర్చొని వుంది అంటూ మాటమార్చాడు. లక్షలాది ప్రజలను తమ మాతృభూమిలోనే శరణార్థులుగా మార్చిన విధ్వంసకాండకు పాలకుల ప్రతిస్పందన ఇదీ!

స్వయం పాలిత బోడో ప్రాదేశిక మండలి పాలనలో వున్న అస్సాంలోని కొక్రాఝార్ జిల్లా, దాని పరిసర ప్రాంతాల్లో బోడోలకూ, బోడోలు కాని వారికీ మధ్య ఘర్షణలు జరిగాయి. జులై మొదటి వారంలో మొదలైన ఘర్షణలు ఆగస్టు మొదటివారం వరకూ సాగాయి. ముఖ్యమంత్రి, ప్రధానమంత్రుల సాధారణ పరిస్థితులున్నాయన్న అంచనా తర్వాత కూడా సాగాయి. పెద్ద దాడి జులై 19న జరిగింది. ఇంతవరకూ 70 మందికి పైగా మృతి చెందారు. దాదాపు నాలుగులక్షలమంది-వారిలో 3 లక్షల మంది ముస్లిములు, బోడో ప్రజలు 30 వేలు-శరణార్ధులుగా ఇళ్లు, గ్రామాలు వదలి పారిపోయి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 27 శిబిరాలలో తలదాచుకుంటున్నారు. తాము పుట్టిన గడ్డమీదే శరణార్ధులుగా మారిపోయారు.

ఈ విధ్వంసకాండ అక్కడితో ఆగిపోలేదు. దాని ప్రకంపనాలు ముంబయి, పూనాలకూ, బెంగుళూరుకూ విస్తరించాయి. మయన్మార్‌లో ముస్లింల అణచివేతకు నిరసన ప్రదర్శనగా ప్రారంభమై ఈశాన్యభారతీయులపై దాడులకు, చేరి, మహిళా కానిస్టేబుళ్లపై అత్యాచార ప్రయత్నాలతో సహా అరాచక చర్యలు సాగాయి. దీనితో వదంతులు వ్యాపించాయి. ఇంటర్‌నెట్‌లు, ఎస్‌ఎంఎస్‌లు వాటిని మెరపు వేగంతో దేశమంతటా వెదజల్లాయి. తమపై దాడులు జరుగుతాయన్న భయంతో ఏ జాతి వారైనా ఈశాన్య భారతీయులు స్వంత ప్రాంతాలకు తరలిపోవటం మొదలైంది. చదువుకోసం, ఉద్యోగాలు చేయటానికీ దక్షిణ రాష్ట్రాలకు వచ్చిన వారు ప్రాణభయంతో గౌహతికి పయనం కట్టారు. వీరికోసం ప్రభుత్వమే ప్రత్యేక రైళ్లు సాయుధ పోలీసుల రక్షణతో నడపాల్సివచ్చిందంటే పరిస్థితి ఎంత తీవ్రస్థాయికి చేరిందో తెలుస్తుంది. ఈ రైళ్లపై కూడా దాడులు సాగటంతో లక్నో, అలహాబాదు నగరాల్లో ప్రభుత్వం కర్ఫ్యూ విధించాల్సి వచ్చింది.

ఏమిటీ విపత్కర పరిస్థితి? అసలు కోక్రాఝార్‌లో ఏం జరిగింది? జూలై 6న నలుగురు బోడో యువకులు మోటారు సైకిళ్లపై వచ్చి ఇద్దరు ముస్లింలను కాల్చిచంపి పరారయ్యారు. దీనికి జిల్లా యంత్రాంగం స్పందించలేదు. తర్వాత గుర్తు తెలియని వ్యక్తులు నలుగురు మాజీ బోడో మిలిటెంట్లను చంపారు. వారు బంగ్లాదేశాయులంటూ ముస్లింలపై దాడులు మొదలై కొక్రాఝార్ మండిపోయింది. ఈ హత్యలెందుకు జరిగాయన్న విచారణకు అధికార యంత్రాంగం పూనుకోలేదు.

అస్సాంలో కాంగ్రెసుపార్టీ ఆధ్వర్యంలో సంకీర్ణ ప్రభుత్వం వుంది. వయసుమళ్లుతున్న తరుణ్ గోగోయ్‌ని తప్పించి, తాను పగ్గాలు చేపట్టాలని ఆరోగ్య మంత్రి హిమాంత బిశ్వశర్మ కోరుకుంటున్నాడు. వీరి ముఠా తగవులు తీవ్రమయ్యాయి. ఇటీవల గౌహతీలో ఒక బాలికపై లైంగిక దాడి చేసిన ముష్కరులు శర్మ అనుయాయులనీ, గోగోయిని అప్రదిష్టపాలు చేసేందుకే శర్మ చేయించారనీ, రాజకీయుల్లో చర్చగావుంది. "ముఖ్యమంత్రినీ ఆరోగ్యమంత్రిని ఒకగదిలో కూర్చుని విబేధాలు పరిష్కరించుకోనివ్వండి. వారి విబేధాలకు ప్రజలు మూల్యం చెల్లించాలా? ప్రస్తుత ఆందోళనకర ఘటనలకు దారితీసిన కారణాలలో ఇదొకటి" అని నిండు పార్లమెంటులో ఎంఐఎం ఎంపి అసదుద్దీన్ ఓవైసి కరాఖండిగా ప్రకటిస్తే, కాదనటానికి ఒక్క కాంగ్రెసు నాయకుడికీ నోరురాలేదు.

అస్సాంలో మానవ మారణకాండకు ఇదొక్కటే కారణం కాదు. దాడులకు కోక్రాఝార్ మొదలు కాదూ, చివరాకాబోదు. 1980లలో సాగిన (తరువాయి 4వ పేజీలో)

## రైతాంగానికి... (మొదటి పేజీ తరువాయి)

చట్టం ప్రకారం రైతుభూమిపై కాంట్రాక్టు సేద్య కంపెనీకి ఎలాంటి యాజమాన్య హక్కు ఏర్పడదు. కానీ పరోక్షంగా ఆచరణలో తానే భూస్వామిలా వ్యవహరిస్తుంది. ఏ పంట వేయాలో, భూమిని ఎలా దున్నాలో, ఎప్పుడు ఎంత నీరుపెట్టాలో, ఏ విత్తనాలు వాడాలో, ఏ ఎరువులూ, క్రిమిసంహారకాలూ వాడాలో, ఎవరి దగ్గర రుణం తీసుకోవాలో కంపెనీ నిర్ణయిస్తుంది. భూస్వామి ఈ నిర్ణయాలు చేసి పాలేర్లద్వారా కూలీలతో ఈ పనులన్నీ చేయిస్తాడు. కాంట్రాక్టు సేద్యాన్ని అంగీకరించిన రైతు ఆచరణలో పాలేరుగా పనిచేస్తాడు. అయితే ఒక తేడా వుంది. దిగుబడి భూస్వామికే చెందుతుంది. పాలేరు తన వేతనం పొందుతాడు. కాంట్రాక్టు సేద్యంలో కంపెనీ నాణ్యత సాకు చెప్పి కొనటానికి నిరాకరిస్తుంది. రైతు నష్టపోతాడు. పంజాబులో పెప్సికంపెనీ కాంట్రాక్టు సేద్య ఒప్పందంతో రైతాంగంతో బంగాళా దుంపలపంట వేయించింది. వాటినుండి చిప్స్ తయారుచేసి అమ్ముకుంటుంది. ఒక ఏడాది అనుకూల పరిస్థితులతో దిగుబడులు బాగా పెరిగాయి. ఎక్కువ సరుకు తనకవసరం లేదంటూ పెప్సి కంపెనీ నిరాకరించింది. అదేమంటే ఒప్పందం చేసుకొనని రైతులనుండి కూడా ఎలా కొనగలనంటూ తప్పుడు ప్రచారం చేసింది. కిలో పావలాకు కూడా కొనే దిక్కులేక రైతాంగం నష్టపోయారు. మరో ఏడాది వానలు తగ్గి దిగుబడులు తగ్గినప్పుడు, నాణ్యత సాకుచెప్పి ధర దిగ్గోసింది. దిగుబడులు పెరిగినా, తగ్గినా నష్టాలు రైతాంగానికే. లాభాలు పెప్సికంపెనీకే. కంపెనీ లాభార్జనా అవసరాలు తీర్చేందుకు పాలేరులా పనిచేసినా శ్రమ ఫలితంకూడా దక్కదు. రైతు, కంపెనీ దోపిడీ అవసరాలు తీర్చేందుకు తప్పనిసరిగా శ్రమించే బంధిత రైతుగా మారిపోతాడు.

రైతాంగమే, అంటే పేద, మధ్యతరగతిరైతాంగం-ఒక వర్గంగా బంధిత ఉత్పత్తిదారుస్థాయికి దిగజారుతుంది. కాంట్రాక్టు సేద్యరైతులు సంఘాలు పెట్టుకుని కంపెనీల దురాగతాలను ఎదుర్కోవచ్చునని చెబుతున్నారు. ప్రతిఘటనను సమీకరించబూనుకున్న రైతులను కంపెనీలు బ్లాక్‌లిస్టులో పెట్టి అనేక విధాలుగా వేధించి లొంగదీసుకుంటున్నాయని అమెరికాలో సాగుతున్న కాంట్రాక్టు సేద్యాన్ని అధ్యయనం చేసిన దక్కను డెవలప్‌సొసైటీ నివేదిక తెలిపింది. తక్కువలో తక్కువ 200 ఎకరాలుండే అమెరికా రైతునే కంపెనీలు వేధించగలుగుతుంటే ఎకరం రెండెకరాల మడిచెక్కలుగల 70శాతం భారత రైతాంగాన్ని కంపెనీలు ఎంతగా అణచివేతకు గురిచేస్తాయో అర్థంచేసుకోవటం సులభమే.

కంపెనీలు తమ పరిశ్రమల ఉత్పత్తి ప్రణాళికలకు అనుగుణంగా పంటలను వేయిస్తాయి. దేశ ప్రయోజనాలూ, ప్రజల అవసరాలూ వాటికి పట్టవు. క్రమంగా సాగు, బహుళజాతి కంపెనీల ఉత్పత్తి ప్రణాళికకు తోకగా మారుతుంది. ప్రధానంగా ఆహార పంటలు ప్రజలకు అందుబాటులో లేకుండాపోతాయి. పాల డయిరీల అనుభవమే ఇది స్పష్టంచేస్తుంది. ప్రతి రైతుకుటుంబం పాడికలిగి వుండేది. పాల డయిరీల ఏర్పాటు తర్వాత పాలదిగుబడులు పెరిగాయి. ఈ పాలను ఐస్‌క్రీములుగా, కోవాలుగామార్చి నగరాలలో ధనికులకు, ఇతర దేశాలకు అమ్ముకుంటున్నారు. ఇలా అధిక ధరగల పాల ఉత్పత్తుల కొరకు వాడుతున్న పాలను తీసివేస్తే, దేశంలో సగటు పాల లభ్యత తగ్గింది. ఆ మేరకు పౌష్టికాహారమైన పాలు ప్రజలకందుబాటులో లేకుండా పోయాయి. గ్రామసీమలంటే పాడిపంటలతో కళకళ లాడతాయన్న స్థితిమారి, మధ్యతరగతి రైతుకుటుంబాలలో కూడా మజ్జిగ చుక్క కన్పించకుండా పోయింది.

మరొకస్థాయిలో దేశ ఆర్థికవ్యవస్థ పరాధీనత పెరుగుతుంది. కాంట్రాక్టు సేద్యంద్వారా కంపెనీలు వాణిజ్య పంటలను పెంచుతాయి. 20వేల కోళ్లున్న ఫారంలో కోళ్ల మేతకు కనీసం 5 ఎకరాలలో మొక్కజొన్న పంటవేయాలి. ప్రజలకు బలవర్ధక మాంసాహారం అందుబాటులోకి వస్తుందంటూ కంపెనీలు పౌల్ట్రీలను పెంచితే వరి పండే భూమి తగ్గుతుంది. ప్రజలు తినే బియ్యం లభ్యత తగ్గుతుంది. బియ్యం దిగుమతి చేసుకోవాల్సివస్తుంది. 1960కు ముందు అమెరికానుండి వచ్చే పిఎల్ 480 గోధుమకోసం ఎదురుతెన్నులు చూసిన దుస్థితి ఏర్పడుతుంది. పౌల్ట్రీరంగంలో గుత్తవ్యాపారులకు వాటిల్లే నష్టమేదీ వుండదు. గ్రుడ్లనూ, కోడిమాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేసుకుంటాయి. ఈ మాంసాహారం కూడా ప్రజలకు అందదు. మన సాగు వనరులన్నీ విదేశీ ధనాఢ్యవర్గాల ఆహార అవసరాలను తీర్చేవిగానే వుంటాయి. భారత ప్రజలు ఆకలిబారిన పడతారు. కానీ పాలకులు వాణిజ్య పంటలు వేయమంటూ, దానికి కాంట్రాక్టు సేద్యమే మార్గమంటూ ప్రచారం సాగించి రైతాంగాన్ని కాంట్రాక్టు సేద్యం వైపు నెడుతున్నారు.

'కమ్యూనిస్టులకు మరేంపనిలేదు, ఏంచేసినా విమర్శల వర్షం కురిపిస్తారు, చిన్న లోపాన్ని కూడా భూతాన్ని చేసి చూపుతార'నే వారికి కనువిప్పుగా ఈ క్రింది ఉల్లేఖనలిస్తున్నాను.

**"వివిధ దేశాల ఆహార వ్యవస్థలు కాంట్రాక్టు సేద్యం ద్వారా బహుళజాతి కంపెనీల ఆధీనంలోకిపోతాయి. విత్తనాలనుండి పంట అమ్మకాలవరకూ అన్నీ వాటి అజమాయిషీలోనే ఉన్నందున, ఆయా దేశాలు పూర్తిగా పరాధీనత పాలవుతాయి. తమ వ్యవసాయ స్వతంత్రను కోల్పోతాయి"**

– డిక్‌లీవెన్స్, అమెరికాలోని మిన్నెసోటా విశ్వవిద్యాలయ వ్యవసాయ ఆర్థికవేత్త.

**"ప్రపంచంలోనూ, భారత్‌లోనూ కాంట్రాక్టు సాగు, రైతులకు లబ్ధి చేకూర్చబోదు. రాజకీయ ఆర్థికశాస్త్రం ప్రకారం, పెట్టుబడి సంచయంకోసం వ్యవసాయ కంపెనీలు రైతులను దోపిడీచేసేందుకు వ్యవసాయ రంగంలోకి చొరబడే రూపాలలో ఒకటే కాంట్రాక్టు సాగు".**

– సుఖపాల్‌సింగ్, వ్యవసాయ ఆర్థికవేత్త అహమ్మదాబాద్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్

## ప్రత్యామ్నాయం

కమ్యూనిస్టులను విమర్శించటమూ, ధ్వంసం చేయటమేతప్ప నిర్మాణాత్మక కృషి, సూచనలు వుండవన్న విమర్శ తరచుగా విన్పిస్తుంటుంది. పైన ఉల్లేఖించిన ఇరువురూ కమ్యూనిస్టులు కారు. ప్రస్తుత కాంట్రాక్టు సేద్య పద్ధతికి ప్రత్యామ్నాయంగా సహకార సంఘాలుగా ఏర్పడి కాంట్రాక్టు సాగు కంపెనీతో బేరసారాలాడగల తమ శక్తిని కాంట్రాక్టు సాగురైతులు పెంచుకోవాలని సూచించారు. వ్యవసాయరంగాన్ని దోపిడీ చేసుకునేందుకు వస్తున్న కంపెనీల నుండి ఇది కొన్ని చిన్న రాయితీలను సాధించగలదేమోగానీ దోపిడీని, అనేక దోపిడీ రూపాలలో అంతం చెయ్యలేదు. వ్యవసాయరంగం సృష్టించిన సంపదను రైతాంగానికి చెందకుండా చేసి పారిశ్రామిక రంగానికి తరలించటం పెట్టుబడిదారీ విధాన అనివార్య లక్షణం. ఈ దోపిడీ తీవ్రతను సంఘటిత పోరాటాలతో రైతాంగం కొన్ని సందర్భాలలో కొంతకాలం కొంతమేరకు తగ్గించగలదేమోగానీ దోపిడీని తొలగించలేదు.

వ్యవసాయానికీ, పరిశ్రమకు మధ్య పెట్టుబడిదారీ విధానంలో ఉండే వైరుధ్యాన్ని కమ్యూనిస్టులు పరిష్కరిస్తారు. దున్నేవానికే భూమి ప్రాతిపదికన భూమి పునఃపంపిణీ సాగిస్తారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను పరస్పర ఆధారిత సమన్వయంతో అభివృద్ధి చేస్తారు. వ్యవసాయంలో సృజించిన సంపద పారిశ్రామిక రంగాన్ని పెంచేందుకూ, పారిశ్రామిక రంగంలో పెరిగే సంపద తిరిగి వ్యవసాయరంగాన్ని అభివృద్ధి చేసేందుకు వినియోగిస్తారు. తగినంత ఉత్పత్తి సామర్థ్య పునాది ఏర్పడిన తర్వాత వ్యక్తిగత ఆస్థి హక్కును రద్దుచేసి సామాజిక ఆస్థిచేస్తారు. సమష్టి వ్యవసాయ క్షేత్రాలను, పారిశ్రామిక కమ్యూన్లనూ ఏర్పాటు చేస్తారు. ఆ విధంగా దోపిడీని అంతం చేస్తారు. అమెరికాలోని కాంట్రాక్టు సాగురైతులు సంఘాలుగా ఏర్పడినా వాల్‌మార్ట్ కంపెనీ దోపిడీ చర్యలకు వ్యతిరేకంగా ప్రతి ఏడూ నిరసన ప్రదర్శనలు జరపవలసివస్తున్న అనుభవం కూడా తెలుపుతున్నది.

ఇది పగటికలకాదు. 300 ఏళ్ల పెట్టుబడిదారీ విధానమూ, 100 ఏళ్ల సామ్రాజ్యవాదమూ సాధించిన ఉత్పాదక ప్రగతిని మూడుదశాబ్దాలలోపునే ఈ విధానాన్ని అనుసరించిన సోషలిస్టు రష్యా, చైనాలు సాధించాయి. పెట్టుబడిదారీ సమాజం పెంచుతున్న ఆకలి, నిరుద్యోగాన్ని లేకుండాచేసి తమ వ్యవస్థల ఉత్కృష్టతను చాటాయి. ఈ వర్గదోపిడీని అంతంచేసే దిశగా దృఢంగా పయనించినందునే స్టాలిన్, మావోలను ఈనాటికీ నరరూప రాక్షసులుగా చిత్రిస్తున్నాయి.

నేటి భారతదేశ నిర్దిష్ట పరిస్థితిలో దున్నేవానికే భూమి కేంద్ర నినాదంగా వ్యవసాయ విప్లవాన్ని సాగించాలి. వ్యవసాయరంగంపైనా, దేశ ఆర్థిక వ్యవస్థపైనా సామ్రాజ్యవాదుల, దళారీ బూర్జువాల దోపిడీ ఆధిపత్యాలను అంతంచేయాలి. అంతవరకూ దోపిడీ పీడనలనుండి రైతాంగానికి విముక్తి రాదు.

ఈ చారిత్రక సత్యాన్ని గుర్తించి రైతాంగాన్ని ప్రజాతంత్ర విప్లవానికి సన్నద్ధం చేయటానికి పూనుకోవాలి; రైతాంగ మెదుర్కొంటున్న తక్షణ సమస్యలపై వారిని సంఘటిత పోరాటాలలోకి సమీకరించాలి. ఈ పోరాట అనుభవాలనుండి రైతాంగంపై సాగుతున్న దోపిడీ అణచివేత వివిధ రూపాలనూ, మూలకారణాలను వారిచే గుర్తింపచేయాలి. ఆవిధంగా భూస్వామ్య, దళారీబూర్జువా, సామ్రాజ్యవాద దోపిడీని అంతంచేయాల్సిన ఆవశ్యకతను రైతాంగంచే గుర్తింపచేయగలము. ఇది నేడు కమ్యూనిస్టులందరి ముందూ వున్న కర్తవ్యం. సమైక్యంగా, అంకిత భావంతో ఈ కర్తవ్య నిర్వహణను దీక్షపూనుదాం. ✶

**బాక్సు నెం-1** **భారత్‌లో కాంట్రాక్టు సేద్యం కంపెనీలు**

| నెం | కంపెనీ | రాష్ట్రం | పంటలు |
|---|---|---|---|
| 1. | పెప్సికో✶ | పంజాబు, తమిళనాడు | టమాటో, మిర్చి, బంగాళాదుంప, వేరుశనగ, బాస్మతివరి |
| 2. | రాలీస్ ఇండియా ● | పంజాబు, ఉత్తరప్రదేశ్ మధ్యప్రదేశ్, మహారాష్ట్ర | పండ్లు, కూరగాయలు |
| 3. | సుగుణ పౌల్ట్రీ | ఆంధ్రప్రదేశ్, తమిళనాడు | బాస్మతివరి, గోధుమ |
| 4. | సూపర్ స్పిన్నింగ్ మిల్స్ | తమిళనాడు | ప్రత్తి |
| 5. | సిజి హెర్బల్స్ | ఛత్తీస్‌ఘడ్ | ఔషధచెట్లు, పచౌలి |
| 6. | సంజీవనీ ఆర్చడ్స్ | మధ్యప్రదేశ్ | దానిమ్మపండ్లు |
| 7. | హిందూస్తాన్ లీవర్✶ | మధ్యప్రదేశ్ | గోధుమ |
| 8. | ఐసిఐసిఐ బ్యాంక్ | మధ్యప్రదేశ్ | గోధుమ |
| 9. | స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా (మహీంద్ర శుభ్‌లాభ్‌తో కలిసి) | ఆంధ్రప్రదేశ్ | వరి, వేరుశనగ, ప్రొద్దు తిరుగుడు |
| 10. | అపాఛీకాటన్ కంపెనీ | తమిళనాడు | ప్రత్తి |
| 11. | ఉగార్ సుగర్ వర్క్స్ | కర్ణాటక | బార్లీ |
| 12. | కాటన్ కార్పోరేషన్ | ఆంధ్రప్రదేశ్ (గుంటూరు, ఆదిలాబాద్‌జిల్లా) మహారాష్ట్ర, హర్యానా | ప్రత్తి |
| 13. | ఫీల్డ్ ఫ్రెష్ ఫుడ్స్ ● (సునీల్ మిట్టల్) | పంజాబు, హర్యానా హిమాచల్, కాశ్మీర్ ఉత్తరాంచల్, యుపి | పండ్లు |
| 14. | రిలయన్సు ● | గుజరాత్ ఆంధ్రప్రదేశ్ | ఔషధ మొక్కలు అరటి |
| 15. | నాదెర్-ఇబ్రహీం✶ (బెహరీన్ కంపెనీ) | మహారాష్ట్ర | అరటిపండ్లు |
| 16. | కోకాకోలా✶ | ఆంధ్రప్రదేశ్(చిత్తూరు) | మామిడిపండ్లు |
| 17. | కాడ్‌బరీ ఇండియా✶ | తమిళనాడు, ఆంధ్రప్రదేశ్(ప.గో.జి) | కోకో |

**గమనిక :** 1. ఇవి కొన్ని కంపెనీలు మాత్రమే 2.✶ ఈ గుర్తుపెట్టినవి పూర్తి విదేశీ కంపెనీలు 3.● ఈ గుర్తుపెట్టినవి మిలాఖత్ ఒప్పందాలున్న కంపెనీలు 4. కంపెనీల తరపున ప్రభుత్వ, ప్రైవేటు బ్యాంకులు కూడా కాంట్రాక్టు సేద్యంలోకి దిగాయి. 5. తమ పారిశ్రామిక ఉత్పత్తులకు ముడిసరుకుగా వాడే పంటల సేద్యంలోకే కంపెనీలు వచ్చాయి.

**బాక్సు నెం-2**

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ జిఓ ఏమిటి?

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వపు వ్యవసాయ-సహకారశాఖ 2012 జూన్ 30న జిఓఎంఎస్ సంఖ్య 113ను విడుదల చేసింది. ఇది ఆంధ్రప్రదేశ్ (వ్యవసాయ, పశు ఉత్పత్తుల) మార్కెట్టు రూల్సు-1969 చట్టానికి సవరణ చేసింది. ఇది వ్యవసాయ ఉత్పత్తుల్లో ప్రైవేటు వాణిజ్యానికీ, కాంట్రాక్టు సేద్యానికీ అనుమతినిచ్చింది.

ప్రధాన సవరణ : పై చట్టంలోని రూలు73ఏ లో ఇలా చేర్చారు."కాంట్రాక్టు సేద్యంలో ఉత్పత్తిదారుకూ, కొనుగోలుదారుకూ కాంట్రాక్టు సేద్య ఒప్పందంలోని షరతులను, నియమాలను కలిసి పరస్పర నిర్ణయం చేసుకునేందుకు పూర్తి స్వేచ్ఛ వుంటుంది. ఇది పై చట్టంలోని అంశాలకు విరుద్ధంగా వుండరాదు. ఒప్పందాన్ని మార్కెటింగుకమిటీ లేదా అసిస్టెంటు డైరెక్టరుకు తెలుపాలి".

సవరణ లక్ష్యాన్ని జిఓలో ఇలా చెప్పారు:

"వ్యవసాయ సరుకుల వాణిజ్య రంగంలో మారిన పరిస్థితుల దృష్ట్యా, ప్రపంచ వాణిజ్య సంస్థ ఉనికిలోకి రావటంతో, భారత ప్రభుత్వం ఒక మోడలు మార్కెట్టు చట్టాన్ని రూపొందించి, దానినే అనుసరించమని రాష్ట్ర ప్రభుత్వాలను కోరింది. సరళీకరణలో భాగంగా ఏపిఎం రూల్సు 1969కి గతంలో కొన్ని సవరణలు జరిగాయి. ఇప్పుడు ప్రైవేటు వాణిజ్యానికి, కాంట్రాక్టు సేద్యానికి అవకాశమిచ్చే అంశాలను ఏపిఎం రూల్సు 1969లో చేర్చుతున్నాము".

**గమనిక:** వ్యవసాయ ఉత్పత్తులు వ్యవసాయ వాణిజ్య సరకులయ్యాయి. ఈ ఒప్పందం చేసుకున్నామని మార్కెట్టు కమిటీకి తెలపాలితప్ప, దానినుండి అనుమతి అవసరంలేదు. ఈ సవరణలు జూలై 30 తర్వాత అమలులోకి వస్తాయి. కేంద్రం చేసిన మోడలు మార్కెట్టు చట్టంలోని అంశాలన్నీ దీనికి వర్తిస్తాయి.

**బాక్సు నెం-3**

## మోడలు మార్కెట్టు చట్టం

మోడలు మార్కెటింగ్ చట్టంలోని ముఖ్యాంశాలు:

1. పంటను వేసి, పెంచి, దిగుబడిని కంపెనీకి సరఫరా చేసేందుకు రైతూ, ఒప్పందంలో పేర్కొన్న పరిమాణం, నాణ్యత, ధరకు రైతునుండి కొనుగోలు చేసేందుకు కంపెనీ ఈ ఒప్పందం ద్వారా అంగీకరిస్తున్నాయి.
2. అంగీకరించిన సమయానికే రైతు, సరుకును కంపెనీకి సరఫరా చేయాలి. సమయం దాటితే ఒప్పందం దానంతటదే రద్దు అవుతుంది.
3. ఒప్పందంలో పేర్కొన్న నాణ్యతగల సరుకును తగిన పరిమాణంలో సరఫరా చేయటానికి రైతు అంగీకరించాడు. ఆ నాణ్యత లేకపోతే దానిని కొనటానికి కంపెనీ నిరాకరించవచ్చు. అలాంటప్పుడు చర్చించుకుని రైతు తక్కువ ధరకే కంపెనీకి అమ్ముకోవచ్చు.
4. భూమిని తయారుచేయటం, నారు, ఎరువులు, సాగునీరు, కోతలు, నిర్వహణ, మరేయితర విషయాలలోనైనా కంపెనీ యిచ్చే ఆదేశాలు లేదా ఆచరణలను పాటిస్తానని రైతు అంగీకరించాడు.
5. సేద్యం, సేద్యానంతర సమయంలో కొన్ని సేవలందిస్తానని కంపెనీ అంగీకరించింది(ఒప్పందంలో వీటిని పేర్కొనాలి) వీటిలో విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారకాలు, యంత్రాలు, రుణాలు వుండవచ్చును. పంటల నిర్వహణకు సాంకేతిక సలహాలు యివ్వవచ్చు.
6. ఈ ఒప్పందంవల్ల రైతు భూమిపై, కంపెనీకి ఎలాంటి హక్కూ ఏర్పడదు.

**గమనిక:** ఒప్పందంలో చేర్చాల్సిన అంశాలన్నీ కంపెనీ ప్రయోజనాలకే రక్షణ కల్పించేవిగా వుంచారు. ఒప్పందాన్ని కంపెనీ ఉల్లంఘించినా, సరిగా వ్యవహరించకపోయినా రైతుకు ఎలాంటి రక్షణా యివ్వలేదు. ఉత్పత్తిరేటు ఒప్పందంలో పేర్కొనాలని చెప్పారు. కంపెనీ అందించే సేవలకు ఏ రేటు యివ్వాలో ఒప్పందంలో చేర్చాలని చెప్పలేదు. కంపెనీ చెప్పిన రేటే ఆ "సేవ"లకు చెల్లించాలి. ఇది రైతాంగానికి రక్షణనివ్వని కంపెనీలకనుకూలమైన ఆదర్శ (మోడల్) చట్టం!

# ఫీజు రీ ఎంబర్స్‌మెంట్ 'మాయాజాలం'

## ప్రైవేటు ఇంజనీరింగ్, తదితర వృత్తి విద్యాసంస్థల యాజమాన్యాలకు ప్రజాధనాన్ని దోచిపెడ్తున్న ప్రభుత్వ విధానాలు

**రాష్ట్ర** విద్యార్థి లోకంలో–ముఖ్యంగా, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో చేరబోయే విద్యార్థులలోనూ–వారి తల్లిదండ్రులలోనూ; పాలకరాజకీయ పక్షాలు–విద్యార్థి సంఘాలు - విద్యావేత్తలు - ప్రజాతంత్ర మేధావులందరిలోనూ ప్రచార మాధ్యమాలలోనూ గత కొంతకాలంగా ప్రైవేటు వృత్తి విద్యా సంస్థలలో ఫీజుల నిర్ణాయక విధానంపైనా, అర్హులైన విద్యార్థులకు ప్రభుత్వం కల్పించే రీఎంబర్స్‌మెంట్ తదితర రాయితీలపైనా, ఈ అంశాలలో న్యాయస్థానాల జోక్యంపైనా తీవ్ర చర్చోప చర్చలు సాగుతున్నాయి. విద్యార్థుల చదువులను గందరగోళంలోకి నెట్టివేస్తున్న ప్రభుత్వ విధానాలపై విమర్శలూ వెల్లువెత్తుతున్నాయి. 2012 మార్చిలో ఇంటర్ మీడియట్ పరీక్షలో ఉత్తీర్ణులై, ఆ పిదప 'ఎమ్‌సెట్' ద్వారా అర్హత పొంది, ఇంజనీరింగ్ తదితర ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలల్లో చేరేందుకు సిద్ధంగానున్న లక్షలాదిమంది విద్యార్థుల భవిష్యత్తును అగమ్యగోచరంగా మార్చిన ప్రభుత్వ విధానాలే ఈ తీవ్రచర్చలకు, విమర్శలకు కారణం కాగా, ఫీజుల రీ ఎంబర్స్‌మెంట్ గురించిన ఈ చర్చల మధ్యగుండానే, వేల కోట్ల రూపాయల ప్రజాధనాన్ని ప్రైవేటు ఇంజనీరింగ్, మెడిసిన్, ఎంబిఏ, ఎంసిఏ, ఫార్మసీ తదితర వృత్తి విద్యాసంస్థలకు ప్రభుత్వం దోచిపెడ్తున్న వైనం మరుగున పడుతున్నది.

2004లో, రాజశేఖరరెడ్డి నాయకత్వంలో కాంగ్రెసు పార్టీ రాష్ట్రంలో అధికారపగ్గాలు చేపట్టినాక, సర్వవ్యాపిత ప్రైవేటీకరణ విధానాలను వేగవంతం చేశాడు. అప్పటికే అధిక సంఖ్యలో వెలసిన ప్రైవేటు కళాశాలలకు తోడు, తామరతంపరగా ఇంజనీరింగ్, ఎంబిఏ, ఎంసిఏ, బి.ఫార్మశి, తదితర ప్రైవేటు వృత్తి విద్యా సంస్థల స్థాపనకు కాంగ్రెసు ప్రభుత్వం విధానపరంగా ఆమోదం తెలిపింది. ఈ క్రమంలో అఖిలభారత స్థాయిలో 'స్వతంత్రప్రతిపత్తి' గల ఏఐసిటిఈ వంటి సంస్థలు, కళాశాలలస్థాపనకై తన వద్దకు వచ్చిన దరఖాస్తులన్నింటిపై క్షుణ్ణంగా విచారణ జరిపి, తాము సూచించిన నిబంధనలన్నింటినీ సంతృప్తి పరిస్తేనే, ఆ కళాశాలల స్థాపనకు ఆమోదం తెలపాలన్న తమ బాధ్యతను తుంగలో తొక్కాయి. ప్రైవేటు విద్యాసంస్థల యాజమాన్యాలతో కుమ్మక్కై ప్రభుత్వ కనుసన్నలలో 'అడగనివాడిది పాపమ'న్నట్లుగా ఒక్క మన రాష్ట్రంలోనే వందలాది కళాశాలలకు అనుమతిలిచ్చి పారేశాయి. నేటికి, మన రాష్ట్రంలో ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల సంఖ్య 688కి, ప్రైవేటు ఎంబిఏ కళాశాలల సంఖ్య 926కు, ప్రైవేటు ఫార్మసీ కళాశాలల సంఖ్య 290కి, ప్రైవేటు ఎంసిఏ కళాశాలల సంఖ్య 664కూ చేరుకుంది.

ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, కళాశాలల స్థాపనకైతే అనుమతిపొందాయిగానీ, తమ కళాశాలలలో చేరి, ఫీజులు చెల్లించే విద్యార్థులు కరవై, కళాశాలల నిర్వహణ కష్టసాధ్యమౌతున్నదంటూ, మార్గాంతరానికై ప్రభుత్వాన్ని ఆశ్రయించాయి.

ముఖ్యమంత్రిగా రాజశేఖరరెడ్డి, తన తొలివిడత పాలన చివరి సంవత్సరాలలో, 2009లో జరగనున్న ఎన్నికలలో లబ్ధిపొందేందుకు సంక్షేమ కార్యక్రమాల పేరిట ప్రజాకర్షక పథకాలను కుమ్మరిస్తున్న సమయమది. 'ఆర్థిక ఇబ్బందుల కారణంగా ఏ విద్యార్థి చదువూ ఆగిపోకూడదంటూ'; 'ప్రతి విద్యార్థినీ ఉన్నత విద్యా వంతుడిని చేయటమే తన లక్ష్యమంటూ' ఇదే అదనుగా, గంభీరమైన మాటలతో, ఇంజనీరింగ్, మెడిసిన్, తదితర ప్రైవేటు వృత్తి విద్యా కళాశాలల్లో చేరే 'అర్హులైన' విద్యార్థులందరి ఫీజులనూ ప్రభుత్వమే చెల్లించే 'రీఎంబర్స్‌మెంట్' పథకాన్ని ప్రారంభిస్తున్నట్లుగా రాజశేఖరరెడ్డి ప్రకటించాడు. ప్రైవేటు కళాశాలల యాజమాన్యాల ఆర్థిక ప్రయోజనాన్ని ఈడేర్చటంతో పాటుగా, తమ ఎన్నికల ప్రయోజనాలని కలగలిపి 'ఒకేదెబ్బకు రెండుపిట్టల్లాగా' ఈ పథకాన్ని ముందుకు తెచ్చాడు.

వాస్తవంగా, 2008-09 నాటికే, అంటే రాజశేఖరరెడ్డి ఈ పథకాన్ని ప్రకటించేనాటికే, కేంద్ర ప్రభుత్వ నిధులతో యస్.సి., యస్.టి. విద్యార్థులకు ఫీజురీఎంబర్స్‌మెంటు అమలవుతూవుంది. కాగా, ఓబిసి విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వ నిధులతో ఈ పథకాన్ని రాజశేఖరరెడ్డి వర్తింపజేశాడు. 2009-10 నుండి 'ఆర్థికంగా వెనకబడిన' ఈబీసీ, మైనారిటీ విద్యార్థులకూ ఈ పథకాన్ని విస్తరించారు.

ఈ పథకం అమలుకావటంతో అప్పటివరకూ విద్యార్థులులేక వెలవెలబోయిన ప్రైవేటు ఇంజనీరింగ్, తదితర వృత్తి విద్యాకళాశాలలన్నీ విద్యార్థులతో కళకళలాడిపోయాయి. విద్యార్థులూ, వారి తల్లిదండ్రులూ వ్యక్తిగత స్థాయిలో ఇంజనీరింగ్, తదితర వృత్తివిద్యా కోర్సులు చదువుకోగలిగినందుకు చాలా సంతోషించారు కూడా. 'రాజీవ్ ఆరోగ్యశ్రీ'లాగా ఈ పథకమూ 2009 ఎన్నికలలో రాజశేఖరరెడ్డికి లబ్ధి చేకూర్చింది.

### కన్వీనర్ కోటా–మేనేజ్‌మెంట్ కోటా

'ఎంసెట్'లో పొందిన ర్యాంకుల ప్రాధాన్యతా క్రమానికనుగుణంగా విద్యార్థులు తాము చేరాలనుకున్న కళాశాలను, అందులోనూ చదవాలనుకునే బ్రాంచీనీ ఎంపిక చేసుకునే విధానం కొనసాగుతూవస్తున్నది. మొత్తం ప్రైవేటు ఇంజనీరింగ్ తదితర వృత్తివిద్యా కళాశాలల్లోని సీట్లలో 70 శాతం కన్వీనర్ కోటాగానూ; మిగిలిన 30 శాతాన్ని ఆయా ప్రైవేటు యాజమాన్యాల కోటాగానూ పరిగణిస్తున్నారు. కన్వీనర్‌కోటాలో సీటు పొందిన వారిలో అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసి, ఇబిసి, మైనారిటీలకు చెందిన విద్యార్థులకు ప్రభుత్వమే పూర్తి ఫీజును (గత సం॥వరకు 31,700 రూ.) ఇంజనీరింగ్ కళాశాలలకు నేరుగా చెల్లిస్తూవస్తున్నది. ఇక 25 శాతం విద్యార్థులు ప్రభుత్వం నిర్ణయించిన నిర్దిష్ట ఫీజును (గత సం॥వరకూ 50,200 రు.) చెల్లించి మేనేజ్‌మెంట్ కోటాలో సీట్లను పొందగా, మిగిలిన 5 శాతం సీట్లను ఎన్ఆర్ఐలకు కేటాయించి, ఆయా ప్రైవేటు కళాశాలల యాజమాన్యం తమ కాలేజీ 'డిమాండ్'నుబట్టి ఎంతైనా వసూలు చేసుకునే అవకాశం కల్పించారు.

### ఇంజనీరింగ్ పట్టభద్రుల ప్రవాహం–పెరుగుతున్న నిరుద్యోగ సంక్షోభం

మనదేశ అవసరాలకు అనుగుణమైన ఉన్నత, వృత్తి, సాంకేతిక నిపుణుల సంఖ్యను అంచనావేసుకొని, తదనుగుణంగా ప్రభుత్వమే ఆయా విద్యాసంస్థలను నెలకొల్పి నిర్వహించాలనే చర్చ మరుగునపడిపోయింది. లెక్కకు మించి పెరిగిపోయిన ఇంజనీరింగ్ విద్యాసంస్థల నుండే లక్షలాదిమంది పట్టభద్రులు ప్రతి ఏటా బయటకు వస్తున్నారు. వీరిలో విదేశాలకు వెళ్ళే అతికొద్దిమందినీ మన దేశంలో పరిశ్రమలు ఇముడ్చుకునే వారినీ కలిపినా 5 నుండి 10 శాతం మించిలేరు. మిగిలినవారంతా పొట్టచేత బట్టుకుని నిరుద్యోగ సైన్యంలో కలుస్తున్నారు. తాము చదివిన విద్యతో సంబంధంలేని అరాకొరా ఉపాధితో కొందరు బ్రతుకులీడుస్తుంటే, ఆశోపహతులై మరికొందరు బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. ఉపాధికోసం మేథో 'కూలీల' నడుమ పోటీని ఆసరా చేసుకున్న బడా పెట్టుబడిదారీ వ్యాపార, వాణిజ్య, వుత్పత్తి సంస్థలు, వీరి మేధోశ్రమను కారుచౌకగా కొల్లగొడుతున్నాయి.

ఇది ఒక పరిస్థితికాగా, ప్రైవేటు విద్యాసంస్థల నిర్వహణా తీరు తెన్నులను ఎప్పటికప్పుడు పరిశీలించి, విద్యాబోధన తగిన నాణ్యతా ప్రమాణాలు కలిగివుండే విధంగా చర్యలు తీసుకోవలసిన ఏఐసిటిఇ, ఎంసిఐ వంటి పర్యవేక్షణా సంస్థలూ మరియూ ప్రభుత్వమూ ఆ బాధ్యతను ఉద్దేశపూరితంగా నిర్లక్ష్యం చేశాయి. దీనితో అత్యధిక ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు–ఆయా కళాశాలల్లో పాటించవలసిన నిబంధనలకనుగుణంగా నిపుణులైన బోధనాసిబ్బందిని, భవనాలను తదితర వసతి సౌకర్యాలనేమీ కల్పించకుండా, కోర్సు పూర్తయిందనిపించి విద్యార్థులను బయటకు తరుముతున్నారు.

### రాజశేఖరరెడ్డి హఠాన్మరణం–ఫీజు రీఎంబర్స్‌మెంట్ 'పీటముడి'

కాంగ్రెసుపార్టీ రాష్ట్రంలో మళ్ళీ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే రాజశేఖరరెడ్డి హఠాన్మరణం; ముఖ్యమంత్రి పీఠం కోసం కాంగ్రెసులో అంతర్గత కుమ్ములాటలు–రాజశేఖరరెడ్డి రాజకీయాలకు, పథకాలకు వారసుడిగా జగన్ ముందుకురావటం– కాంగ్రెసును వీడి వేరే పార్టీని ఏర్పరచటం, రాజశేఖరరెడ్డి మానస పుత్రికలైన 'ప్రజాసంక్షేమ పథకాలను' (రాజీవ్ ఆరోగ్యశ్రీ, ఫీజు రీఎంబర్స్‌మెంటు తదితర) కాంగ్రెసు ప్రభుత్వం క్రమంగా రద్దు చేయబోతున్నదంటూ పెద్దఎత్తున జగన్‌పార్టీ ప్రచారం– సిబిఐ విచారణల నేపథ్యంలో జగన్ అరెస్టు–జైలు– ఉపఎన్నికలలో వైయస్సార్ కాంగ్రెసుపార్టీ గెలుపు–కాంగ్రెసులో తీవ్రమైన ముఠాకుమ్ములాటలు– మంత్రి అరెస్టు - మరోమంత్రిపై అభియోగాలు - అతని రాజీనామా సమర్పణవంటి వారి తీవ్ర అంతర్గత పరిణామాల నేపథ్యంలో 'ఫీజు రీఎంబర్స్‌మెంటు పథకమూ' చిక్కుకు పోయింది. 'పెడతామంటే ఆశ, కొడతామంటే భయం' అన్న చందంగా ఫీజుల పెంపుపై, ఫీజు రీఎంబర్సుమెంటుపై స్పష్టతనీయకుండా నెలల తరబడి కాలయాపనచేసి లక్షలాదిమంది విద్యార్థుల, వారి తల్లిదండ్రుల తీవ్ర మానసిక వేదనకు ప్రభుత్వం కారణమైంది.

### అర్హతపొందిన విద్యార్థుల సంఖ్య కన్న సీట్లు అధికం!

మరో చోద్యమైన విషయమేమంటే, అవకాశాలు (సీట్లు) తక్కువగా వుండి, పోటీ అధికంగా వున్నదంటూ 'వడపోత'కోసం నిర్వహించబడుతున్న ప్రవేశ పరీక్షలు హాస్యాస్పదంగా మారిపోయాయి. ఇంటర్మీడియట్ తదనంతరం నిర్వహించే 'ఎమ్‌సెట్' ద్వారా అర్హులయిన విద్యార్థుల సంఖ్య కంటే, రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్ల సంఖ్య ఎక్కువగావుంది. గత కొన్ని సం॥లుగా ఈ విధంగా ఇంజనీరింగ్ కళాశాలల్లో సీట్లు అధికంగా వుండి, అవి భర్తీకాకుండా ఖాళీలుగా మిగిలిపోతున్నా తిరిగి ప్రవేశ పరీక్షల ప్రహసనాన్ని కొనసాగించటం, కార్పొరేటు కోచింగ్ సెంటర్ల ప్రయోజనాల కోసమేననేది నిర్వివాదం. ఈ ఏడాది గణాంకాలు పరిశీలిస్తే కూడా, మనరాష్ట్రంలో మొత్తం కళాశాలల్లో ఇంజనీరింగ్ సీట్లు 3,42,376 వుండగా, ఎంసెట్ ద్వారా అర్హులైన అభ్యర్థులు 2,07,473 మందిగా వున్నారు. వాస్తవానికి ప్రవేశ పరీక్షతో నిమిత్తం లేకుండా, ఇంటర్మీడియట్ అర్హత ఆధారంగా ఇంజనీరింగ్ బోధన జరపకుండా వుండటానికి ఏ విధమైన శాస్త్రీయ ప్రాతిపదికాలేదు.

### ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలకు న్యాయస్థానాల 'ఇతోధిక సహాయం'

రాష్ట్రంలోని కొన్ని ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల యాజమాన్యాలు, తాము ఏఐసిటిఇ నిర్వచించిన ప్రమాణాల ప్రకారం కళాశాలలను నిర్వహిస్తున్నామని; కన్వీనర్ కోటాలో ఒక్కో సీటుకూ వసూలయ్యే 31,700 రూ॥లు. మేనేజ్‌మెంట్ కోటాలో ఒక్కో సీటుకూ వసూలయ్యే 50,800 రూ॥లు తమ కళాశాలల నిర్వహణకు ఏ మాత్రం సరిపోవటం లేదనీ, కనుక, ఈ ఫీజుల మొత్తాన్ని పెంపు చేయాలని కోరుతూ సుప్రీంకోర్టునాశ్రయించాయి. దీనిపై విచారణను చేపట్టిన సుప్రీంకోర్టు, ఒకే కాలేజీలోని ఒకే కోర్సు నభ్యసించటానికి రెండు రకాల ఫీజుల విధానం పట్ల బోలెండంత 'హాశ్చర్యం' వ్యక్తం చేసింది! ఎక్కువ ఫీజు చెల్లించే వారి డబ్బుతో కళాశాలలను నిర్వహించటంలోని 'ఔచిత్యాన్ని' ప్రశ్నించింది. ఇది సరైన విధానంకాదని తేల్చిచెప్పింది. ఏకీకృత ఫీజు (కామన్‌ఫీజు) విధానం ఉండాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని, ఏఎఫ్ఆర్‌సీని ఆదేశించింది. అంటే దీనిఅర్థం–కన్వీనర్ కోటా క్రింద చెల్లించబడుతున్న కనీస ఫీజునే కామన్ ఫీజుగా విద్యార్థులందరికీ వర్తింపజేయమని చెప్పటం కాదు. విద్యార్థులపై ఫీజుల భారాన్ని తగ్గించమని చెప్పటం ఎంతమాత్రమూ కాదు! కాగా, సుప్రీంకోర్టు ఇచ్చిన ఈ ఆదేశాలు ప్రైవేటు యాజమాన్యాలకు మరింత బలాన్నిచేకూర్చాయి.

### 'ఏఎఫ్ఆర్‌సి' కసరత్తులు

రాష్ట్రంలో ఇంజనీరింగ్ తదితర వృత్తి కళాశాలల్లో, ఇతర కళాశాలల్లో ప్రవేశాలను, ఫీజులను పరిశీలించి, నిర్ణీత ఫీజు మొత్తాలను రాష్ట్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసే విభాగమే ఏఎఫ్ఆర్‌సి. 2005 వరకూ రాష్ట్రంలో ప్రైవేటు వృత్తి విద్యా సంస్థల యాజమాన్యాలు తమ డిమాండ్ కనుగుణంగా, తమ ఇష్టానుసారం ఫీజులను వసూలు చేసేవి. దీనిపై సుప్రీంకోర్టు కలగజేసుకొని, ఈ కళాశాలల్లో ప్రవేశాలు, ఫీజుల నిర్ణయానికిగానూ హైకోర్టు రిటైర్డు జడ్జి నేతృత్వంలో ఒక స్వతంత్ర విభాగాన్ని ఏర్పరచాలని ఆదేశించింది. తదనుగుణంగా 2006 నుండి ఏఎఫ్ఆర్‌సి వునికిలోకి వచ్చి, రాష్ట్రంలోని కళాశాలల్లో ప్రతి మూడేళ్ళకూ ఒకసారి ఫీజులమొత్తాల్లో మార్పులు చేసి (పెంచి) ప్రభుత్వ విద్యాశాఖకూ, ఉన్నత విద్యామండలికీ ఈ సిఫార్సులను అందజేస్తున్నది.

సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం ఈ సంవత్సరం ప్రైవేటు ఇంజనీరింగ్ తదితర వృత్తివిద్యాసంస్థల విద్యార్థుల ఫీజులను పెంచాలని ఆయా యాజమాన్యాలు ఏఎఫ్ఆర్‌సిని కోరుతూవచ్చాయి. తదనుగుణంగా ఇంజనీరింగ్ కళాశాలలన్నింటిలోనూ కామన్ ఫీజును రు. 50,200గా నిర్ణయించి, ఏఎఫ్ఆర్‌సి ప్రభుత్వానికి మొదట సిఫార్సు చేసింది. దీనితో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. విద్యార్థుల ఫీజులు పెంచటంలో, విద్యార్థులపై అదనపు భారం మోపటంలో ప్రభుత్వానికి భిన్నాభిప్రాయం ఏమీ లేకపోగా, నూటికి నూరుపాళ్ళూ ఆమోదమే. అయితే, గత సం॥వరకు కన్వీనర్ కోటాలో సీట్లు పొందినవారిలో అర్హులకు 31,700 రూ॥లు చొప్పున రీఎంబర్స్ చేస్తూవస్తున్న ప్రభుత్వం, ఏఎఫ్ఆర్‌సి సిఫార్సుల ప్రకారం 50,200 రూ॥లు చెల్లించవలసిరావటమనే ఏకైక కారణంతో, ఆ సిఫార్సులను ఆమోదించకుండా పునఃపరిశీలనకు తిప్పిపంపింది. ఫీజు రీ ఎంబర్స్‌మెంటు 'భారాన్ని' దించుకోజూస్తున్న ప్రభుత్వం, పెరగబోయేఫీజుల ప్రకారం రీఎంబర్స్ చేయకుండా వుండే మార్గాలకోసం 'నిపుణుల'తో, మంత్రివర్గ ఉపసంఘంతో ఎన్నోఫీట్లు, మరెన్నో కసరత్తులను గత నెలరోజులుగా సాగిస్తోంది.

ఏఐసిటిఇ ఛైర్మన్ చెప్పిన వివరాల ప్రకారం ఈ ఏడాది కళాశాలలు మూసివేస్తామంటూ దేశవ్యాపితంగా 133 దరఖాస్తులురాగా, అందులో 65 ఆంధ్రప్రదేశ్ నుండే వచ్చాయి. వీటిలో 100 కాలేజీలు మూసివేయగా 42 మనరాష్ట్రానివే. ఇవన్నీ ఎంబిఏ కళాశాలలే. ఫీజు రీఎంబర్సుమెంటు పథకంతో విద్యార్థులు ఇంజనీరింగు కాలేజీల్లో చేరుతున్నారు. టాప్ కాలేజీల్లో ఎంబిఏ చేస్తేనే మంచి ఉద్యోగాలొస్తాయని అర్థం కావటంతో ఎంబిఏలో చేరటంలేదు. మరో రకంగా చెప్పాలంటే చాలా ఇంజనీరింగు కాలేజీలు ఇప్పటికే మూతపడి వుండేవి. అలా మూతపడకుండా యాజమాన్యాలను ఆదుకున్నదీ పథకం. ఇక వారి పెట్టుబడులు లాభాలతో సహా తిరిగి వచ్చాయి గనుక 'పథకం ఎత్తివేస్తాను మీదారి మీరు చూసుకోండని' ప్రభుత్వం చెబుతున్నది. దీనినే ఏఐసిటిఇ ఛైర్మన్ 'ఈ రంగంలో సంఘటితమయ్యే క్రమం (కన్సాలిడేషన్ ప్రాసెస్) సాగుతున్నది' అన్నాడు. అంటే పోటీని తట్టుకునేవే వుంటాయి. మిగిలినవి మూతపడతాయని అర్థం. ఈ పథకం ఎత్తివేస్తే రాజశేఖరరెడ్డి ప్రతిష్టపెరిగి, జగన్‌పార్టీకి ఎన్నికల్లో బలం చేకూరుతుందేమోనన్న భయంతోనే ప్రభుత్వం ఇరకాటంలో పడి దశలవారీ ఎత్తివేతకు పూనుకుంది.

### నిబంధనల బిగింపు పేరిట ప్రభుత్వం విద్యార్థులపై వేధింపులు

సెల్ఫ్‌ఫైనాన్స్ కోర్సులలో రీఎంబర్స్‌మెంటును 20 వేలకే పరిమితం చేయటం; విద్యార్థులకు హాజరు 75 శాతం ఉంటేనే మరుసటి సం॥కు రీఎంబర్స్‌మెంటు అర్హులని ప్రకటించటం; అఫిడవిట్, బ్యాంక్ ఎకౌంట్లను తప్పనిసరిచేయటం; ఇబిసి నిబంధనలను కఠినతరం చేయటం; గరిష్ట వయోపరిమితిని కుదించటం; పారామెడికల్, ఏడాది కోర్సులను రీఎంబర్స్ నుండి మినహాయించటం; స్టైఫండ్ కారణంతో పి.హెచ్.డీల వంటివాటిని ఈ పరిధి నుండి తొలగించటం–వంటి కుదింపు చర్యలతో ప్రభుత్వం విద్యార్థులను నిరంతరం మానసిక క్షోభకు గురిచేస్తూవస్తోంది. మరోవైపు ప్రభుత్వం ప్రైవేటు కళాశాలలకు చెల్లించవలసిన రీఎంబర్స్‌మెంటు బకాయిలను సకాలంలో చెల్లించకపోవటంతో, ఆయా కళాశాలల యాజమాన్యాల వేధింపులకు, మానసికక్షోభకు విద్యార్థులు నిరంతరం గురౌతూ చదువులు కొనసాగిస్తున్నారు.

### ప్రభుత్వ నిధులతో కడుపునిండిన ప్రైవేటు యాజమాన్యాలు

గత నాలుగు సంవత్సరాల కాలంలో ప్రభుత్వం నుండి రీఎంబర్స్‌మెంటు రూపంలో పొందిన కోట్లాది రూపాయల ఫీజులతో ఆయా ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, తమ ఆస్థులను (భూమి, భవనాలు మొ॥వి) స్థిరపరచుకున్నాయి. ఈ రీఎంబర్స్‌మెంట్ పథకమేలేకుంటే–విద్యార్థులకు ఇంజనీరింగ్ విద్య అబ్బటం గురించి దేవుడెరుగు–ఈ యాజమాన్యాలకు అప్పనంగా ఇంతటి 'రియల్‌ఎస్టేట్' ఒనగూడేదికాదు. కనుక ఇప్పుడు ఆ కాలేజీలకు టాస్క్‌ఫోర్స్ తనిఖీల వంటి వాటి భయాలేమీ లేకపోగా, ప్రభుత్వంపైనే ఎదురుదాడి చేసి, బ్లాక్‌మెయిల్ చేసి, ఫీజుల పెంపును సాధించుకో గలుగుతున్నాయి. విద్యార్థుల పట్ల, నిరాటంకంగా వారి చదువులు సాగటంపట్ల–ప్రభుత్వానికీ, యాజమాన్యాలకీ ఏ విధమైన బాధ్యతాలేదనేది నిస్సందేహం.

### 'ప్రమాణాలులేని ప్రైవేటు కాలేజీల'ంటూ మంత్రుల ప్రకటనలు

తామరతంపరగా ప్రైవేటు ఇంజనీరింగ్, తదితర వృత్తి విద్యాకళాశాలల స్థాపనకు అనుమతిలిచ్చిన ప్రభుత్వమే; ఆయాకళాశాలల్లో బోధన, బోధనేతర సిబ్బంది, భవనాలు, ఇతర సదుపాయాలు సక్రమంగా వున్నాయోలేదో (తరువాయి 4వ పేజీలో)

# మణిపూర్‌లో ప్రజాస్వామ్యంపై దాడిని ఖండించండి! మణిపూర్‌లో ద్రవ్య పెట్టుబడి చొరబాటును ఖండించండి!

**2012** ఆగస్టు 17న మణిపూర్ కాలుష్య నియంత్రణ మండలి మణిపూర్‌లో చమురు త్వవ్వకాలు-పర్యావరణం కల్గించే ప్రభావంపై ప్రజాభిప్రాయ సేకరణకు సభ జరిపింది. మణిపూర్‌లో చమురు తవ్వకాలకే నిరసన తెలుపుతూ, స్థానిక ప్రజలు ప్రదర్శన చేయగా మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వం పోలీసులతో ప్రజలపై కేసులు పెట్టింది. స్థానిక ప్రజల హక్కులను ఉల్లంఘిస్తూ, 'సైనిక పద్ధతులలో అభివృద్ధి' అన్న దానిని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలూ, జుబిలియంట్ ఆయిల్ కంపెనీలు రుద్దటానికి పూనుకున్నాయని ఈ కేసుల బనాయింపు తెలుపుతున్నది. మణిపూర్ సహజ వనరుల పరిరక్షణ కమిటి(సిపిఎన్ఆర్) ఈ కేసుల బనాయింపును తీవ్రంగా ఖండిస్తున్నది.

మణిపూర్ చమురు అన్వేషణకు వ్యతిరేకంగా ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తంచేస్తున్నారు. తమెంగ్‌లాంగ్, చురాచాంద్‌పూర్, జిలిబామ్, మణిపూర్ ఇతర ప్రాంతాలలో స్థానిక తెగలకు చెందిన ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండానే 2010లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చమురు కంపెనీతో చమురు పంపకం ఒప్పందంలో జూబిలియంట్ ఆయిలు కంపెనీకి లైసెన్సు నిచ్చాయి. అసలు విషయాన్ని చెప్పకుండా, ఆల్ఫాజియో కంపెనీ భూప్రకంపనలను అధ్యయనం చేస్తుందంటూ మోసపూరితంగా ప్రజలనుండి నిరభ్యంతర పత్రాలపై సంతకాలు పెట్టించుకున్నారు.

నుంగ్‌బాలో ప్రజాభిప్రాయసేకరణ సందర్భంగా అల్లర్లు జరగలేదు. ప్రదర్శకులు ఎలాంటి హింసాచర్యలకూ పాల్పడలేదు. తమ భూమినీ, భవితవ్యాన్నీ పరిరక్షించుకునేందుకు న్యాయమైన తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. దీనితో కాలుష్య నియంత్రణ మండలి అధికారులు సభను వాయిదా వేసినట్లు ప్రకటించటంతో, తమను మోసం చేస్తున్నారని ప్రజలకు కోపం వచ్చింది.

ప్రజలు తామెలాంగ్ డిప్యూటి కమీషనర్‌నూ, కాలుష్య మండలి అధికారాలను, ఆయిలు కంపెనీ ప్రతినిధులను బెదరించారన్నదే లేదు. ప్రజాభిప్రాయ సేకరణ సభను వాయిదా వేసినట్లుగా లిఖిత పూర్వకంగా తమ కందజేయమని మాత్రమే వారు డిమాండు చేశారు. గతంలో 2008 మార్చి 26న తిపైముఖ్ డ్యాము నిర్మాణంపై కైమై గ్రామంలో ప్రజాభిప్రాయసేకరణ సభను ప్రజల నిరసనతో జరపకుండా వెళ్లిపోయిన అధికారులు, ఆ సభ ఆమోదించినట్లు రిపోర్టు తయారుచేసిన అనుభవాన్ని గుర్తుచేశారు.

- మణిపూర్‌లోని తమేంలాంగ్, చురాచాంద్‌పూర్, జిరిబామ్‌లలో చమురు, గ్యాసు అన్వేషణ తవ్వకాలను ఆపివేయాలనీ,
- సాయుధ దళాల ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దుచేయాలనీ, మణిపూర్ సహజ వనరుల పరిరక్షణ కమిటీ డిమాండు చేస్తున్నది.

**2012 ఆగస్టు 24**
**ఇంఫాల్**

**పామై తింగెన్‌లుంగ్**
**కన్వీనర్, సిపిఎన్ఆర్**

**అస్సాంలో...** (మొదటి పేజీ తరువాయి)

అస్సాం విద్యార్థుల ఉద్యమం అక్కడ సాగుతున్న వివక్ష, దోపిడీ, అణచివేతలకు తీవ్ర ప్రతిస్పందనగా వచ్చింది. అస్సాంలోని వివిధ జాతుల ప్రజల ప్రజాస్వామిక ఆకాంక్షలను వెలిబుచ్చింది. దోపిడీ పాలక వర్గాలు దీనికి అస్థిత్వ రాజకీయాలద్ది బలహీన పరిచారు. నెల్లి ఊచకోత దీనిలో భాగంగా సాగిందే. అక్కడ బెంగాలీ మాట్లాడే ముస్లింలకూ, లాలుంగ్ జాతికీ మధ్య ఘర్షణలు జరిగాయి. వీటిలో 3వేల మంది ముస్లింలు మృతి చెందారు. వారికి బంగ్లా దేశీయులని ముద్రవేశారు. ఈనాటికీ దీనిపై ఎలాంటి విచారణా జరపలేదు. 2008లోనూ ముస్లింలకూ బోడోలకు మధ్య ఘర్షణలు జరిగాయి. 55 మంది మృతి చెందారు. బంగ్లాదేశ చొరబాటు దారులన్న ఆరోపణే తప్ప, ఘర్షణల పుర్వాపరాలను పరిశీలించే పనికి పాలకులు పూనుకోలేదు.

ఘర్షణలకు దారితీసిన కారణాలేమైనా, శాంతినెలకొల్పేందుకూ, గాయపడ్డ ప్రజల మనోభావాలకు ఓదార్పు నిచ్చేందుకూ వెన్వెంటనే పూనుకోవటంతో పాటు, వైమనస్యాలు పెంచే శక్తులను నిరోధించి, సామరస్యం నెలకోల్పేందుకు రాజకీయ నాయకత్వం పూనుకోవాలి. తద్వ్యతిరేకంగా సంకుచిత ప్రయోజనాలతో రాజకీయ చెలగాటం మొదలైంది. అధికారంలోవున్న కాంగ్రెసు, పరిస్థితి తీవ్రతను తగ్గించి చూపేందుకూ, తిరిగి సాధారణ పరిస్థితులు నెలకొన్నట్లు చిత్రించి సమస్యమూలాల జోలికి పోకుండా మళ్లీ రగిల్చే అవకాశాలను అట్టిపెట్టింది.

సంఘపరివార్ శక్తులు హిందూ మతోన్మాదాన్ని రెచ్చగొట్టే పనిలో పడ్డారు. కొక్రార్ఝూర్ విధ్వంసకాండకు బంగ్లాదేశీ ముస్లిం చొరబాటుదారులే కారణమని వెన్వెంటనే తొగాడియా ప్రకటించగా, అద్వానీ పార్లమెంటులోనూ అదే పాట పాడాడు. బంగ్లాదేశ్ తన పొరుగునే వుండి చొరబాటు సమస్యతో సతమతమై పోతున్నట్లు, గుజరాత్ ముఖ్యమంత్రి మోడీ నిద్రలోనూ ఇదే కలవరింత! అవాస్తవాలను 'బ్రాహ్మణుడు-నల్లమేక' కథలా ప్రజలతో నమ్మించే గోబెల్సు ప్రచారానికి పూనుకున్నారు.

రెండు దశాబ్దాల క్రితం అస్సాం ఒప్పందం జరిగింది. అప్పుడు విచారణ జరిపి బెంగాలీ మాట్లాడే ముస్లింలను భారత పౌరులుగా ప్రకటించారు. దీని ప్రకారం 1971 నాటికి అస్సాంలో వున్న ముస్లింలు భారతీయులే. బ్రిటీషు పాలనాకాలం లోనే 1930లకు ముందే బెంగాలు నుండి బ్రతుకు తెరువుకోసం వీరిక్కడకి వచ్చారు. 1971 నుండీ జనాభాలెక్కలను పరిశీలించితే వాస్తవాలు తెలుస్తాయి. 1971 నుండి కోక్రార్ఝూర్ లోని ముస్లిం జనాభా పెరుగుదలరేటు దేశంలో ముస్లిం జనాభా పెరుగుదల రేటుకన్నా తక్కువగావుంది. బంగ్లాదేశ్ సరిహద్దునానుకుని వున్న మిగిలిన జిల్లాల్లో కూడా, ముస్లింలేకాక మొత్తం జనాభా పెరుగుదల రేటు, దేశ సగటుకంటే తక్కువగా వుండటమే కాక, దేశంలో జనాభా పెరుగుదల రేటు అతి తక్కువవున్న అరుణాచల్ ప్రదేశ్ కంటే, కొద్దిగా మాత్రమే ఎక్కువుంది. బంగ్లాదేశ్ నుండి పెద్ద ఎత్తున ముస్లింలు చొరబడివుంటే, (తొగాడియా ఆరోపిస్తున్నట్లు చొరబాటుతో ముస్లింలు మెజారిటీ కాదలుచుకుంటే) ఇక్కడ ముస్లిం జనాభా విపరీతంగా పెరిగివుండేది. జనాభా గణాంకాలు అస్సాంలోని బెంగాలీ మాట్లాడే ముస్లింలందరూ 1971 నుండి వుంటున్న భారత పౌరులే తప్ప బంగ్లాదేశీ చొరబాటు దారులు కాదని స్పష్టం చేస్తున్నాయి. అడపాదడపా జరిగే సరిహద్దుల్లో చొరబాట్లనాపటం సాధ్యమే. ఇప్పటికే బంగ్లాదేశ్ సరిహద్దుల్లో ముళ్లతీగల కంచె వేశారు.

అస్సాంలో జరిగిన విధ్వంసకాండలో దాడికి గురయింది ముస్లిములయినా, అది బోడో-ముస్లింల మధ్య సమస్య మాత్రమేకాదు. శాంతి భద్రతల సమస్య అసలేకాదు. అదిరాజకీయ సమస్య.

ప్రజల మధ్య వైషమ్యాలను రగిల్చి వారిని కులాలు, మతాలు, ప్రాంతాలూ, జాతులుగా చీల్చివేసి తమ దోపిడీ పాలనను నల్లేరుపై బండిలా సాగించుకునేందుకు భారత పాలక వర్గాలు అనుసరిస్తున్న కుటిల రాజనీతి నుండి పుట్టిన సమస్యయిది. ఆకలి, నిరుద్యోగం వంటి సమస్యలు, భారత ప్రజలందరిలాగే ఈశాన్య భారత ప్రజలు ఎదుర్కొంటున్నారు. దీనికితోడు మిగిలిన దేశంలో సాగుతున్న కొద్దిపాటి అభివృద్ధికి కూడా వారు నోచుకోలేదు. స్వాతంత్ర్యం వచ్చిన రెండు దశాబ్దాల తర్వాతే వారికొక విశ్వవిద్యాలయం ఏర్పడింది. ఒక మెడికల్ కాలేజీ ఏర్పడింది 1980లో. ఈనాడు కూడా ఈశాన్య రాష్ట్రాల యువకులు బిఏ, బిఎస్సీ డిగ్రీ చదువులకు విజయవాడ కాలేజీలకు వస్తున్నారంటే ఈశాన్య భారతంలో కనీస విద్యాసౌకర్యాల కల్పనపట్ల ఎంత వుదాసీనతను పాలకులు చూపారో అర్ధమౌతుంది. సైనిక పాలనతో సాగుతున్న ఉద్రిక్తత పరిస్థితిలో సామాన్య చదువుకు కూడా ఇంత దూరాలు వస్తున్నారు. ఈ సమస్యల పరిష్కారం కోరుతూ వారు ఉద్యమిస్తే పాశవిక నిర్బంధంతో అణచివేయటం, తిరుగుబాటు దారులంటూ సైనికపాలనలో వుంచటం తప్ప, పాలకులు అసలైన పరిష్కారాలను చూపబూనుకోలేదు. ఒక జాతి-తెగ ప్రజలను మరో జాతి/తెగకు ప్రజలకు వ్యతిరేకంగా రెచ్చగొట్టి, కేంద్రప్రభుత్వమూ రాష్ట్ర ప్రభుత్వాలూ తమ పబ్బం గడుపుకుంటున్నాయి. ఈశాన్య భారతంలో ప్రత్యేకించి అస్సాంలో, జాతుల మధ్య వైరం చెలరేగి ఘర్షణలు సాగటానికి దోపిడీ పాలక వర్గాల రాజకీయ విధానాలే మూల కారణం.

సాధారణ పరిస్థితి నెలకొల్పాలనీ, పరిస్థితిని చక్కదిద్దాలనీ కోరుకుంటూ అనేక సూచనలను ప్రజాస్వామిక వాదులు చేస్తున్నారు. వారి సూచనలు సరైనవే. తక్షణమే అమలుకు పూనుకోవలసినవే. అయినా పాలకవర్గాలు తమ కుటిల రాజనీతిని వదులుకోకుండా, ప్రజా వత్తిడకి లొంగి ఇలాంటి చర్యలు చేపట్టినా, ఉపశమన చర్యలుగానే మిగిలిపోతాయి. తమకుటిల రాజనీతిని వదిలి వేయమని, పాలకులపై వత్తిడి తేచ్చేందుకు ప్రజాందోళనను నిర్మించేందుకు పూనుకోవాలి. అది మాత్రమే పాలకులుకు అడ్డుకట్ట వేయగలుగుతుంది ✡

**ఫీజు రీఎంబర్స్‌మెంట్ ...** (3వ పేజీ తరువాయి)

ఎప్పటికప్పుడు కనిపెట్టి, తదనుగుణంగా వాటిపై చర్యలు తీసుకోవలసిన ప్రభుత్వంలోని సంబంధితశాఖల మంత్రులే; గత నాలుగు సం॥లుగా విద్యార్థులను ఆయా కళాశాలలలోకి ప్రవేశం కల్పించి, వారి ఫీజు తాలూకూ రీఎంబర్స్‌మెంట్ రూపంలో కోట్ల రూ॥ల నిధులను ముద్దనముడుపుగా ఆయా యాజమాన్యాలకు అందిస్తోన్న పాలకులే, ప్రైవేట్ ఇంజనీరింగ్ కాలేజీలలో 10-20 కాలేజీలు మినహా (689 కాలేజీల్లో) మిగతా కాలేజీలేవీ సరైన ప్రమాణాలు పాటించటం లేదనీ, వాటి ప్రమాణాలు చాలా నాసిగావున్నాయనీ ప్రకటించటం-విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుకోవటం కాదా?!

## సుప్రీంకోర్టుకు 'కనువిప్పు'?!

ప్రైవేటు కళాశాలల యాజమాన్యాలు, తమకు ప్రభుత్వంనుండి రావలసిన రీఎంబర్స్‌మెంట్ బకాయిలను చెల్లించమనే వ్యాజ్యంలోనూ, మరి అనేక సందర్భాల లోనూ జోక్యం చేసుకుంటూ వున్న సుప్రీంకోర్టు న్యాయమూర్తులకు హఠాత్తుగా జ్ఞానోదయమైంది. 'ఇన్ని వేల కోట్ల రూపాయలను ప్రైవేటు యాజమాన్యాలకు చెల్లించేబదులు, ప్రభుత్వమే స్వయంగా కాలేజీలను నిర్మించి, నిర్వహించవచ్చుగదా!' అని అమాయకంగా పోజుపెట్టి ప్రశ్నించారు.

గతంలో ఫీజులు నిర్ణయించేటప్పుడు కన్వీనర్ కోటాకు తక్కువ ఫీజు, యాజమాన్య కోటాకు ఎక్కువ ఫీజు-రెండూ కలిపితే ప్రైవేటు కాలేజీకి మొత్తం ఖర్చులు వచ్చే విధంగా ఫీజును నిర్ణయించేవారు. అంటే ఇద్దరు కన్వీనర్ కోటా విద్యార్థుల ఖర్చు, ఒక యాజమాన్య కోటా విద్యార్ధి నుండి వసూలయ్యేది. దీనిని ఆనాడు ఉన్నత న్యాయస్థానాలూ ఆమోదించాయి. ఆనాటి ప్రభుత్వ విధానానికి తమ తీర్పుతో వత్తాసు పలికిన న్యాయస్థానాలు, ఇప్పటి ప్రభుత్వ విధానమైన రీఎంబర్సుమెంటును తగ్గించటానికి వీలుగా అందరికీ ఒకే ఫీజు అన్న 'సమానత్వ సూత్రాన్ని' ముందుకు తెచ్చాయి. స్వతంత్రంగా వ్యవహరిస్తున్నాయని చెప్పుకుంటున్న న్యాయస్థానాలు కూడా ప్రభుత్వ కనుసన్నల్లోనే నడుస్తున్నాయనటానికి ఇది మరో ఉదాహరణ. దీని నడ్డం పెట్టుకుని ప్రభుత్వం ఫీజులు పెంచివేయటమేగాక, పెంచిన ఫీజు అంతా చెల్లించననీ, 35 వేలు మాత్రమే కడతాననీ ప్రకటించింది. దీనిపై తీవ్ర వ్యతిరేకత రావటంతో 10 వేలలోపు ర్యాంకు వచ్చిన వారిలో అర్హులైన వారికే పూర్తి ఫీజు చెల్లిస్తానని సవరించింది. ఇది కంటి తుడుపుచర్యే.

ఫీజు రీఎంబర్స్‌మెంటు పథకాన్ని రాజశేఖరరెడ్డి ప్రభుత్వం ప్రవేశపెట్టిన నాటి నుండి, దీనికి వెచ్చించే నిధులు ఏ విధంగా పెరుగుతూపోనున్నాయో, వేల కోట్ల రూపాయలు ప్రైవేటు యాజమాన్యాల బొక్కసాలకు ఏ విధంగా తరలిపోతాయో గణాంకాలతో సహా 'జనశక్తి' వివరించి, ప్రైవేటు యాజమాన్యాలకు ప్రజాధనాన్ని అప్పనంగా కట్టబెట్టేందుకు ఉద్దేశించబడినదే ఈ పథకమని పదే, పదే పునరుద్ఘాటిస్తూవస్తున్నది. అనేకమంది ప్రజానుకూల మేధావులు, విద్యావేత్తలు, ప్రజాతంత్రవాదులు కూడా ఇదే అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా, పాలకులూ, న్యాయస్థానాలూ నిమ్మకు నీరెత్తినట్లుగా దాటవేసుకుంటూవచ్చి, ఈ రోజు ఈ విధంగా ఇప్పుడే కళ్ళు తెరిచినట్లుగా ప్రశ్నించటం, ప్రజలను దగా చేయటమే! రీఎంబర్స్‌మెంటు పేరున ప్రైవేటు యాజమాన్యాలకు ఇప్పటివరకూ సమకూరిన నిధులు ఇలా వున్నాయి.

| సం॥ | చెల్లించబడింది (కోట్లరూ॥లలో) |
|---|---|
| 2008-09 | 1,462 |
| 2009-10 | 2,083 |
| 2010-11 | 2,287 |
| 2011-12 | 2,913 |
| 2012-13 | 3,600 |
| మొత్తం | 12,345 |

**ఆధారం : వివిధ పత్రికలలో వచ్చిన వివరాలు**

ఇంకా ప్రభుత్వం 350 కోట్ల బకాయిలు చెల్లించవలసివుంది.

అంటే, 2008 విద్యా సం॥ నుండి ఈ 4-5 ఏళ్ళలో రీఎంబర్స్‌మెంట్ రూపంలో ప్రైవేటు యాజమాన్యాలకు చెల్లించిన 12,695 కోట్లను (చెల్లించవలసిన దానితో కలిపి) ప్రభుత్వమే ఖర్చుపెట్టినట్లయితే, తన నిర్వహణలో ఎన్ని కాలేజీలు నిర్మించి, నిర్వహించవచ్చో ఊహించవచ్చు. పెరిగిన ఖర్చుల ప్రకారం ఎక్కువలో ఎక్కువగా కాలేజీకి 30 కోట్ల రూ॥ చొప్పున కేటాయించినా 400 కాలేజీలు పైగా ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఏర్పాటై, మిగిలిన నిధులు భవిష్య నిర్వహణకు సరిపోయేవి. విద్యార్థులందరికీ విద్య ఉచితంగా అందేది.

## ఈ విద్యాసం॥నికి ఏఎఫ్ఆర్‌సి 'రాజీప్రతిపాదనలు'

50,200రూ॥లను కామన్ ఫీజుగా ప్రభుత్వం ముందుంచిన తన ప్రతిపాదనను ఏఎఫ్ఆర్‌సి వెనక్కు తీసుకుని ప్రభుత్వ సలహామేరకు కామన్ ఫీజును 35,000 రూ॥లు.గా సవరించింది. ఈ ఫీజు 578 కాలేజీలలో అమలవుతుంది.

కాగా, తమ వేతన, వ్యయాలు అధికంగా వున్నాయని నివేదికలు సమర్పించిన మరో 67 ప్రైవేటు ఇంజనీరింగ్ కాలేజీల్లో కామన్ ఫీజును 51,800 రు. నుండి ఆయా కాలేజీలను బట్టి 1,05,000 రు. వరకూ నిర్ణయించారు. ➔

➔ ఇక, 35,000 రు. కామన్ ఫీజుకు అంగీకరించకుండా, వేతన వ్యయ నివేదికలు ఇవ్వకుండావున్న మరో 44 కళాశాలల యాజమాన్యాలు హైకోర్టుకు వెళ్ళగా, ఆయా కాలేజీల్లో కామన్ ఫీజు 50,200 రు.లుగా హైకోర్టు తీర్పునిచ్చింది.

ఇదిలా వుంటే, ప్రభుత్వం నిర్ణయించిన 35,000రు.ల కామన్ ఫీజుకు అంగీకరించి తాము మోసపోయామనీ, కోర్టుకు వెళ్ళిన కళాశాలలు 52,000 రు. కామన్ ఫీజు 'కొట్టేశాయ'నీ, కనుక తామూ కోర్టుకు వెళతామనీ, మరి కొన్ని కళాశాలల యాజమాన్యాలు యాగీచేస్తున్నాయి. పైగా, తమ కళాశాలల తనిఖీకి టాస్క్‌ఫోర్స్‌ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జారీచేసిన జీవో 54ను రద్దు చేయాలని కూడా ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు అదరగండంగా డిమాండ్ చేస్తున్నాయి.

ఏమైనా, ప్రభుత్వం 35,000 రు. మించి రీఎంబర్స్ చేయబోనంటూ తెగేసి చెప్పింది. దీనితో ఇప్పటికే ఇంజనీరింగ్‌పై ఆశలు పెట్టుకున్న అనేకమంది విద్యార్థులు తీవ్ర అభద్రతకు గురౌతున్నారు. అంతేగాక, చదువుకొనసాగిస్తున్న ఇంజనీరింగ్ విద్యార్థుల భవిష్యత్తూ ప్రశ్నార్ధకమౌతున్నది.

## ప్రభుత్వమే కళాశాలలు స్థాపించి అందరికీ విద్యనందించాలని డిమాండ్ చేయాలి

ప్రజాకర్షక పథకాలను ముందుకు తెచ్చి, విడివిడివిగా వ్యక్తులకు కొందరికి మేలుచేసే పథకాలను చూపెట్టి పాలకులు తమ ఎన్నికల పబ్బం గడుపుకుంటూ, మరోవైపున ప్రజాధనాన్ని ప్రైవేటు, బడా సంపన్నవర్గాలకు దోచిపెట్టటాన్ని కొనసాగనివ్వరాదు. 'ప్రభుత్వం ఫీజులెంత పెంచినా మాకు సంబంధంలేదు. రీఎంబర్స్‌చేస్తేచాలు' అనే ధోరణి తీవ్ర నష్టదాయకమైంది. ప్రజలందరికీ హక్కుగా విద్యనందించాల్సిన బాధ్యత ప్రభుత్వాలదేనని నినదించాలి. ఈ ప్రజాకర్షక పథకాలమాటున ప్రభుత్వరంగం నుండి విద్య, వైద్యం వంటివన్నీ పూర్తిగా కనుమరుగౌతూ, నానాటికీ తీసికట్టుగా మారిపోతుండటాన్ని కొనసాగనివ్వరాదు . వేలకోట్ల రూపాయల్ని గత 4-5 సం॥లలోనే ప్రైవేటు యాజమాన్యాలకు దోచిపెట్టిన ప్రత్యక్ష సాక్ష్యం మనకళ్ళెదురుగా వున్న తర్వాత కూడా, ఎంతో కాలం మరెన్నో వేలకోట్ల రూపాయలను వీరికి దోచిపెట్టడాన్ని అంగీకరించరాదు. ఉన్నత విద్యతో సహా అందరికీ విద్య సాధనకై సంఘటితంగా ఉద్యమించటమే మనముందున్న కర్తవ్యం. ✡

# రాష్ట్ర ఆర్థిక - రాజకీయ పరిస్థితి - మనకర్తవ్యాలు

## సిపిఐ (ఎం-ఎల్) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటి రాజకీయ తీర్మానం

### అంతర్జాతీయ పరిస్థితి

**ప్రపంచ** పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభం కొనసాగుతున్నది. ఇది ద్రవ్య రంగాన్నేకాకుండా, పారిశ్రామిక, వ్యవసాయరంగాలను కూడా చుట్టుముట్టింది. ఇది రుణ, ద్రవ్య రంగాలనే కాకుండా ఉత్పత్తి, వాణిజ్య రంగాలను కూడా చుట్టుముట్టింది. ఇప్పుడీ సంక్షోభపు తీవ్ర రూపం యూరపు దేశాలను అతలాకుతలం చేస్తున్నది. దీని ఫలితంగా సామ్రాజ్యవాద వ్యవస్థలోని వైరుధ్యాలన్నీ పదునెక్కుతున్నాయి.

అమెరికా సామ్రాజ్యవాదపు నాయకత్వాన సామ్రాజ్యవాద శిబిరం ఆర్థిక సంక్షోభ భారాన్ని ప్రపంచ ప్రజలపై మోపేందుకు పూనుకుంది. సామ్రాజ్యవాద దేశాలలో పరిశ్రమలు మూతవేసి లక్షలాది కార్మికులను నిరుద్యోగులను చేస్తున్నారు. "వాల్‌స్ట్రీటును ఆక్రమించండి" అన్న నినాదంతో వచ్చిన పాలపొంగు వంటి ఉద్యమం, సామ్రాజ్యవాద విధానాలపై కార్మికుల న్యాయమైన ఆగ్రహానికి ప్రతీక. ఈ దేశాలలో కార్మికవర్గం సాగిస్తున్న ఆందోళనలు, పెట్టుబడికీ-శ్రమకూ మధ్యనున్న వైరుధ్యం పదునెక్కటాన్ని సూచిస్తున్నాయి. ద్రవ్య పెట్టుబడి ఎగుమతితో మూడవ ప్రపంచ దేశాల పరిశ్రమలను కబళించి సాగిస్తున్న శ్రమదోపిడీకి వ్యతిరేకంగా ఆయా దేశాలలో కార్మికులు సాగిస్తున్న ఆందోళనలు కూడా ఈ వైరుధ్యం పదునెక్కడాన్ని సూచిస్తున్నాయి. ట్యునిసియాలో మొదలై ఈజిప్టుకు విస్తరించిన అమెరికా సామ్రాజ్యవాదుల తైనాతీల నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా సాగిన ప్రజాఉద్యమాలు కార్మికవర్గ పోరాటాల నుండే ప్రారంభమవటం ఈ వైరుధ్య తీవ్రతను తెలుపుతున్నది.

సంక్షోభ భారాన్ని ప్రపంచ ప్రజలపై మోపేందుకు ఆసియా, ఆఫ్రికా, లాటిన్ అమెరికా దేశాల ఆర్థిక వనరులపైనా, సహజవనరులపైనా, మానవ వనరులపైనా సామ్రాజ్యవాదులు తమ ఆధిపత్యాన్ని నెలకొల్పుకునే ప్రయత్నాలను తీవ్రం చేస్తున్నారు. గత దశాబ్ద కాలంగా మూడవ ప్రపంచ దేశాలలోని సారవంతమైన భూములను కబళించి వేయటం ఒక ప్రధాన ధోరణిగా ముందుకు వచ్చింది. ఆహార ధాన్యాలను పండించే భూములను జీవ ఇంధన, వాణిజ్య పంటలకు మరల్చి ఆహార ధాన్యాలపై గుత్తాధిపత్య స్థాపన దిశగా సాగుతున్నది. సహజ వనరులపై గుత్తాధిపత్యం కొరకు మూడవ ప్రపంచ దేశాలపై రాజకీయ పెత్తనాన్ని స్థాపించేందుకు ప్రభుత్వాలను కూలద్రోయటం, దురాక్రమణ యుద్ధాలు సాగించటం చేస్తున్నది. ఇది సామ్రాజ్యవాదానికీ- వివిధ దేశాలూ, జాతులమధ్య నున్న వైరుధ్యాన్ని నానాటికీ పదునెక్కిస్తున్నది. ఈ ఆధిపత్య విధానాలకు వ్యతిరేకంగా వివిధ దేశాలలో సాగుతున్న ప్రజానిరసనలూ, ఆందోళనలూ, ప్రతిఘటనలూ ఈ వైరుధ్య తీవ్రతను తెలుపుతున్నాయి.

యూరపు ఎదుర్కొన్న సంక్షోభానికి అమెరికా సూచిస్తున్న పరిష్కారాలకు ఫ్రాన్సు, జర్మనీల వ్యతిరేకతా, మధ్య ప్రాచ్యంలో అమెరికా సైనిక దురాక్రమణ చర్యలకు (సిరియా, ఇరాన్) రష్యా వ్యతిరేకతా, గ్రీసు, పోర్చుగల్లు వంటి యూరపు దేశాలపై రుద్దుతున్న పొదుపు చర్యలకు ప్రజల నుండేకాక పాలక వర్గాలనుండే వ్యక్తమౌతున్న వ్యతిరేకతా సామ్రాజ్యవాద దేశాలమధ్య వైరుధ్యాలు మరింత పదునెక్కడాన్ని సూచిస్తున్నాయి.

సామ్రాజ్యవాదుల దోపిడీ, ఆధిపత్య విధానాలకు స్వదేశాలలోనూ, మూడవ ప్రపంచ దేశాలలోనూ ప్రజల నుండి వ్యతిరేకత, ప్రతిఘటనలు తరతమ స్థాయిల్లో ఎదురౌతున్నాయి. వీటిని అణచివేసేందుకు సామ్రాజ్యవాదం ప్రజాస్వామిక హక్కులన్నింటిపైనా దాడులు సాగిస్తున్నది. ప్రజల న్యాయమైన పోరాటాలను అణచివేసేందుకు నిర్బంధ యంత్రాంగాన్ని బలీయం చేస్తున్నాయి. ముస్లిం ప్రజలపట్ల వ్యతిరేకతను రెచ్చగొట్టి, ప్రజలను చీల్చి, దానిమాటున పౌర జీవనాన్ని అదుపుచేసే నిర్బంధ చట్టాలను అమలులోకి తెస్తున్నారు.

కమ్యూనిజంపైనా, సోషలిస్టు భావాలపైన సామ్రాజ్యవాదులు సైద్ధాంతిక, రాజకీయ దాడిని తీవ్రం చేశారు. పెట్టుబడిదారీ విధానం తప్ప మరో ప్రత్యామ్నాయం మానవాళికి లేదన్న, సామ్రాజ్యవాదుల సహాయ సహకారాలు లేకుండా వెనుకబడిన దేశాలలో "ప్రజాస్వామ్యం" పరిఢవిల్లదన్న భావనను వ్యాప్తి చేస్తున్నారు. గత ఏడాది అరబ్బు దేశాలలో వచ్చిన ప్రజావెల్లువ ఈ వాదనను తుత్తినియలు చేసింది.

### దేశీయ పరిస్థితి

రెండవ విడత అధికారంలోకి వచ్చిన యుపిఏ ప్రభుత్వం సామ్రాజ్యవాదం, బడాబూర్జువా, భూస్వామ్య వర్గాల ప్రయోజనాలకు సేవచేసే విధానాలను తెగబడి అమలుచేస్తున్నది. ఆర్థిక సంస్కరణల కార్యక్రమం అమలు సాధించిన విజయాలను సంఘటిత పరుచుకోవటం గురించీ, ప్రపంచ శక్తిగా భారత ఆవిష్కరణకు వాటిని కొనసాగించవలసిన ఆవశ్యకత గురించీ మాట్లాడుతున్నది. అయితే ఎంత చెప్పినా ఆర్థిక సంస్కరణల విషఫలితాలనది కప్పిపుచ్చలేక పోతున్నది అని మన కేంద్రకమిటీ రాజకీయ తీర్మానాలు పేర్కొన్నాయి (20-2-2010, 10-8-2011). ఈ సంక్షోభక్షుభిత రూపాలు నేడు ప్రజలందరికీ కనిపిస్తున్నాయి.

ప్రపంచీకరణ పేరిట భారత ఆర్థిక వ్యవస్థను సామ్రాజ్యవాద రథచక్రాలకు కట్టివేయటంతో వారి సంక్షోభాలు, దేశప్రజల జీవనాన్ని సంక్షుభితం చేస్తున్నాయి. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభ ప్రభావం మనపై పడకుండా వుండటానికి మన బ్యాకింగు వ్యవస్థ పటిష్టత కారణమంటూ 2008 నుండీ బుకాయిస్తూ వచ్చిన కేంద్రప్రభుత్వం ఇప్పుడు తప్పనిసరి పరిస్థితిలో వాస్తవాన్ని అంగీకరించింది. మన పరిధిలో లేని అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితి కారణంగా ఈ ఆర్థిక మాంద్య దుస్థితి ఏర్పడిందని మన్మోహన్‌సింగ్ అంగీకరించారు. ఇది రోగ లక్షణాన్ని ఏకరవు పెట్టడమే తప్ప, రోగకారణాన్ని గుర్తించేదిగా లేదు.

ఆర్థిక వృద్ధిరేటు క్షీణత అన్నిరంగాలలోనూ- వస్తూత్పత్తి, వ్యవసాయం, సేవారంగాలన్నింటిలోనూ- కన్పిస్తున్నది. స్థూల దేశీయోత్పత్తి రేటు 5 శాతానికి పడిపోయింది. ద్రవ్యోల్బణం అదుపు తప్పింది. రూపాయి మారకం విలువ రికార్డు స్థాయిలో 56కు చేరింది. వ్యవసాయంలో వృద్ధిరేటు 2 శాతానికి లోపుగా వుండగా, వస్తూత్పత్తి రంగంలో 2.5 శాతానికి పడిపోయింది. 1990 నాటి సంక్షోభపు పరిస్థితులు పునరావృతం కాబోతున్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

ఇక్కడొక విచిత్రమైన పరిస్థితి నెలకొని వుంది. పారిశ్రామిక రంగంలో స్థూల స్థిర పెట్టుబడి సంచయం (జిఎఫ్‌సిఎఫ్) 35 శాతంగా వుంది. ఇది 9 శాతం పారిశ్రామిక వృద్ధిరేటుకు దారితీయాలి. కానీ అది 2.5 శాతానికి పడిపోయింది. విదేశీ మారకద్రవ్య నిల్వలు ఏడు మాసాల దిగుమతులకు సరిపడా వున్నాయి. గత ఏడాది ఎగుమతులు డాలర్లలో 21శాతం పెరగ్గా, చమురు, బంగారం, వెండి తప్ప మిగిలిన దిగుమతులు 23శాతం పెరిగాయి. అయినా రూపాయి మారకం విలువ రికార్డు స్థాయికి పడిపోయింది. పారిశ్రామిక, సేవారంగాల వృద్ధిరేటు కుదేలైనప్పుడు ఎగుమతులు పెంచిన సరుకుల ఉత్పత్తి ఎలా సాగింది?

చిన్న పరిశ్రమలే ఎగుమతులను పెంచుతున్నాయి. పారిశ్రామికీకరణ కొరకు విదేశీ పెట్టుబడులను ఆహ్వానించటమన్న విధానం, పారిశ్రామిక ప్రగతికి కీలకమైన రంగాల్లో కొత్త పరిశ్రమల స్థాపనకు దారితీయలేదు. ఇప్పటికే వున్న పరిశ్రమలను వశపరుచుకునేందుకే తోడ్పడింది. ధనాఢ్యవర్గాల విలాసాలను తీర్చే పరిశ్రమలే ఏర్పడ్డాయి. ఉదా॥ కార్ల పరిశ్రమ. ఈ మార్కెట్టుకూడా ఇముడ్చుకోలేని స్థాయికి చేరటంతో కార్ల ఎగుమతులవైపు మళ్లుతున్నాయి. మిగిలిన విదేశీ పెట్టుబడి అంతా నీళ్లు, కూలుడ్రింకులు, పిజ్జాలు అమ్మకాలలోకి వచ్చి లాభాలను తరలించుకు పోతున్నాయి. ఎగుమతి ఆధారిత అభివృద్ధి వ్యూహం వల్ల విదేశాలలో ఆర్థిక మాంద్యత మన ఆర్థిక వ్యవస్థను క్రుంగదీస్తున్నది. సేవారంగ వృద్ధిరేటు క్షీణతకు ఇదే కారణం. మరోవైపున వ్యవసాయ రంగాన్ని సామ్రాజ్యవాదుల పరం చేసేందుకు కునారిల్లజేశారు. ఫలితంగా వ్యవసాయాధారిత 60శాతం జనాభా కొనుగోలుశక్తి హీనస్థాయికి పడిపోయింది. గత ఐదేళ్లలో 123 ప్రత్తి, నూలుమిల్లులు మూతపడి వేలాది కార్మికులు నిరుద్యోగులవటానికి కారణమిదే. ఇటీవల సిఏసిపి వ్యవసాయ ఉత్పత్తుల కనీస మద్దతు ధరలను పెంచుతూ చేసిన సూచనలపై అన్ని వైపులనుండీ దాడిచేయటమూ, అదే సమయంలో బడాబూర్జువా వర్గానికి వడ్డీరేట్లు తగ్గించమని అడగటమూ కూడా ప్రజల కొనుగోలు శక్తిని పెంచేందుకు పాలకవర్గాల వ్యతిరేకతనే తెలుపుతున్నాయి.

ఎగుమతి ఆధారిత అభివృద్ధి వ్యూహంలోని వైరుధ్యమిది. దేశాభివృద్ధి, దేశీయ మార్కెట్టును నెలకొల్పుకోవటంపైనే ప్రధానంగా ఆధారపడి వుంటుంది. దేశంలో సాగుతున్న ఉత్పత్తులను దేశంలోనే అమ్మకాలు చేయగలగటం అని అర్థం. దీనికి దేశప్రజల కొనుగోలుశక్తి దేశీయ ఉత్పత్తులను కొనగల స్థాయిలో వుండాలి. భూసంస్కరణలను అమలుజరిపి, వ్యవసాయ ఆధారిత జనాభా కొనుగోలు శక్తిని పెంచినపుడే దేశీయ మార్కెట్టు స్థిరపడుతుంది. దీనికి విరుద్ధంగా, భూసంస్కరణలను నినాదప్రాయం చేయటమే కాకుండా, సాగుగిట్టుబాటు కాకుండా చేసే విధానాలు అమలుచేసి రైతాంగాన్ని భూమి హీనులను చేయటంతో పేదరికం పెరిగింది. ఫలితంగా ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలన్నీ కునారిల్లుతుండగా, విలాస సరుకుల పరిశ్రమలు పెరుగుతున్నాయి. భారత్ ప్రకాశిస్తున్నదన్న ప్రచారం సాగింది, ఈ పరిశ్రమలను చూపెట్టే. ప్రపంచ ఆర్థిక సంక్షోభం తీవ్రమవటంతో ఈ పరిశ్రమలు కుంటుపడుతున్నాయి. సంక్షోభానికి కారణమిదికాగా, దీనికి మూలమైన విధానాలనే మరింత పకడ్బందీగా అమలు జరపకపోవటమే కారణంగా చూపుతున్నారు. విదేశీ పెట్టుబడులకు మరింతగా గేట్లు బార్లాతెరవటాన్ని, పెట్టుబడిదారులకు వడ్డీరేట్లు తగ్గించటాన్ని, ద్రవ్య చెలామణిని పెంచటాన్ని (ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకొంటూ), ఏకీకృత పన్నుల విధానాన్నీ పరిష్కారాలుగా చెబుతున్నారు. వీటిని అమలుచేయటానికే ప్రభుత్వం సిద్ధపడుతున్నది. దోపిడీవర్గాల ప్రయోజనాలకు సేవచేసే విధానాల అమలుకు యుపిఏ తెగబడుతున్నదన్న కేంద్రకమిటీ రాజకీయ తీర్మానం అంచనా సరైనదని పరిణామాలు తెలుపుతున్నాయి.

ఈ సంక్షుభిత పరిస్థితి ప్రజల జీవనాన్ని కల్లోల భరితం చేస్తున్నది. వ్యవసాయం రంగమెదుర్కొంటున్న చిక్కుసమస్యలతో పట్టణాలకూ, నగరాలకూ గ్రామీణ పేదల వలసలు పెరిగిపోతున్నాయి. మూసివేతలూ, ఖాయిలాలు, పొరుగు సేవలతో కార్మికులను పనినుండి తొలగించటం, నిజవేతనాలను దిగకోయటం, ఉద్యోగ రక్షణ లేకుండా చేయటం సాగుతున్నది. పారిశ్రామిక "ప్రమాదాల"లో కార్మికుల మరణాలు రోజువారీ వార్తలయ్యాయి. మధ్యతరగతులూ, పెట్టీబూర్జువా వర్గాలూ ద్రవ్యోల్బణంతో సతమతమవుతున్నారు. చిన్న వ్యాపారులూ, చిన్న పరిశ్రమదారులూ వినాశనానికి గురౌతున్నారు. అసమాన ఆర్థికాభివృద్ధి మూలంగా ప్రాంతీయ, జాతీయ అసమానతలు పెరుగుతున్నాయి. దళితులు, మహిళలపై దోపిడీ, దౌర్జన్యాలు, వివక్షలూ పెరుగుతున్నాయి.

జీవన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అన్నివర్గాల ప్రజలూ పోరాట పథాన్ని చేపడుతున్నారు. మారుతీ-సుజుకీ కంపెనీలో సాగిన కార్మిక సమ్మె, ప్రస్తుతం అరవింద్ మిల్లులో సాగుతున్న సమ్మె దీనినే తెలుపుతున్నాయి. రైతాంగం నీటికొరకూ, ఎరువుల కొరకూ, విత్తనాల కొరకూ, తమ పంటలకు న్యాయమైన ధరకొరకూ పోరాటాలు ఆందోళనలూ సాగిస్తున్నారు. ఉద్యోగులూ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పోరాటాలలోకి దూకుతున్నారు. అగ్రకులాల భూస్వాముల దాడులకు దళితులనుండి ప్రతిఘటన పెరుగుతున్నది. మహిళా సమస్యపట్ల చైతన్యం పెరుగుతున్నది. ప్రజల జాతీయ, ప్రజాస్వామిక ఆకాంక్షలు వివిధ స్థాయిల్లో వ్యక్తమౌతున్నాయి. తమ ప్రాంతం వ్యవసాయకంగా, పారిశ్రామికంగా అభివృద్ధిచెందాలనీ, విద్యా, ఉపాధి సౌకర్యాలు మెరుగుపడాలనీ, మాతృభాషలు అభివృద్ధి చెందాలనీ కోరుతూ వివిధ సెక్షన్ల ప్రజలు ఆందోళనలు సాగిస్తున్నారు.

ప్రజలనుండి వేరుపడిపోయిన పాలక వర్గాలూ, వారి రాజకీయ ప్రతినిధులూ ప్రజలు సంఘటిత పడకుండా చేయటానికి పాశవిక నిర్బంధకాండకు పూనుకుంటున్నారు. తప్పుడు నినాదాలతో ప్రజల ఆకాంక్షలను పెడమార్గం పట్టిస్తున్నారు. ప్రజాకర్షక పథకాలతో ఉపశమన చర్యలతో ప్రజల అశాంతిని జోకొట్టచూస్తున్నారు. కుల, మత, ప్రాంతీయ విద్వేషాలను రగిల్చి ప్రజలను చీల్చి వేస్తున్నారు. నిర్బంధ చట్టాల కోరలకు పదునుపెట్టడం ఎన్‌ఆర్‌ఇజిఏ వంటి పథకాలు, విద్యాహక్కుచట్టం వంటి చర్యలు, అవినీతిపై పోరాటమంటూ సాగుతున్న హడావుడి, తెలంగాణా రాష్ట్రఏర్పాటు పేరిట పాలకవర్గాలు ఆడుతున్న నాటకాలు దీనినే తెలుపుతున్నాయి.

సరైన డిమాండ్ల ప్రాతిపదికగా, సరైన నాయకత్వాన్ని అందిస్తే ప్రజలను పోరాటాలలోకి సమీకరించేందుకు అపరిమిత అవకాశాలున్నాయని పరిస్థితీ, మన నిర్మాణ అనుభవాలూ తెలుపుతున్నాయి. వీటిని వినియోగించుకుని ప్రజలను ఆర్థిక, రాజకీయ పోరాటాలలోకి సమీకరించి, వాటిని విప్లవోద్యమంలో భాగం చేయాలి.

*పాశవిక నిర్బంధం, విభజించి-పాలించటం, ప్రజాకర్షక పథకాలు, క్షీణ సంస్కృతి వ్యాప్తి అనే జమిలి వ్యూహంతోనే పాలకులు ప్రజలను అణచి వుంచు తున్నారు.. అయినా వివిధ వర్గాల సెక్షన్ల ప్రజలు ఆందోళనలు, పోరాటాలలోకి వస్తున్నారు. సంఘటితం గానూ, అసంఘటితం గానూ సాగుతున్నారు. సరైన దిశలో తమను నడిపించే నాయకత్వం కొరకు వెతుకుతున్నారు. అలాంటి నాయకత్వం అందినచోట అడ్డంకులనధిగమించి కృతనిశ్చయంతో పోరాడుతున్నారు.*

### ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి

శాసనసభ సభ్యత్వానికి రాజీనామా చేస్తూ కామ్రేడ్ తరిమెల నాగిరెడ్డి "ప్రపంచ బ్యాంకునుండి వచ్చిన వారి యిష్టాయిష్టాలను బట్టి బడ్జెట్టు తయారు చేస్తున్నాము తప్ప, మన యిష్టాయిష్టాల ప్రకారం చేస్తున్నామంటే ప్రజలను మభ్యపరచటమే.....ఇక్కడ కూర్చుని బ్రహ్మానంద రెడ్డిగారు మనకు కేంద్రప్రభుత్వం ఎంత డబ్బు యిస్తుందా అని మీనమేషాలు లెక్కబెడితే, అక్కడ ప్రపంచబ్యాంకు ఎంత యిస్తుందా అని లెక్క పెడుతున్నారు. ఈ ప్రభుత్వంలో వ్యవహారమంతా స్వతంత్రంగానే చేస్తున్నామని అనుకోవటమంటే మనల్ని మనం మోసగించుకోవటం, ప్రజల్ని మోసగించటం" అన్నారు.

ఈ పరిస్థితే మరింత తీవ్రమైంది. ప్రపంచబ్యాంకు నిపుణుల స్వీయ పర్యవేక్షణలో రాష్ట్ర బడ్జెట్టు రూపొందుతున్నది. ఇది రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి ఎలా దించిందో, తత్పర్యవసానంగా రాష్ట్ర ఆర్థిక, ద్రవ్య, సహజ వనరులెలా ప్రవాహంలా తరలిపోతున్నాయో గత తీర్మానం వివరించింది.

దీనితో వ్యయాన్ని తగ్గించే చర్యలు చేపట్టి, తాను నిర్వహించవలసిన సంక్షేమ బాధ్యతలన్నింటినీ వదలివేసింది. దీని విపరిణామాలను గత నివేదిక వివరంగా చర్చించింది. తాను ప్రజల కందించవలసిన ప్రతి సేవా, డబ్బు చెల్లించి కొనుక్కోవలసిన సరుకుగా మార్చివేసింది.

ఇక ఆదాయాన్ని పెంచుకునే చర్యల పేరిట సారా అమ్మకాలు, అమ్మకం రిజిస్ట్రేషన్లు, అమ్మకం పన్ను పెంపుదల ద్వారా అనేక రెట్ల భారాన్ని ప్రజలపై మోపుతున్నారు. ప్రజలపై మోపిన భారానికి రెండు రెట్లుకు పైగా రాజకీయ నేతలూ, అధికార గణాలూ ప్రజలనుండి పిండుకుంటున్నాయని ఇటీవల ముతా తగవులతో బయటపడిన సారా, ఇసుక భాగోతాలు తెలిపాయి. ఉప ఎన్నికల సందడి ముగియగానే మళ్లీ భూముల విలువలను పెంచి, రిజిస్ట్రేషను ఛార్జీల పెంపుకు ప్రభుత్వం పూనుకుంది.

ఆర్థిక వ్యవస్థ నిర్వహణలో మార్కెట్టు శక్తులకు పూర్తిస్వేచ్ఛ నివ్వాలన్న సిద్ధాంతాన్ని పాలకవర్గాలు ఆమోదించాయి. మార్కెట్టు శక్తులు పోటీపడి సప్లయి-డిమాండు ఆధారంగా సరసమైన ధరలకు సరుకులు వినియోగదారులకు లభ్యమౌతాయన్న వాదనతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మార్కెట్టుపై నియంత్రణను కనీస స్థాయికి తగ్గించుకుంటున్నాయి. పారిశ్రామిక సరుకుల ఉత్పత్తిపై గుత్తాధిపత్యం ఇప్పటికే వున్న భారత, విదేశీ బడాబూర్జువాలు పోటీ లేకుండా చేసుకుని ధరలను పెంచివేస్తున్నారు. సిమెంటు, ఇనుము, ఉక్కు, బొగ్గు, సహజవాయువు, చమురువంటి మౌలిక ఉత్పత్తుల ధరల నియంత్రణను మానివేయటం, వీటి ధరలు పెరిగి, వీటిని ఉపయోగించే సరుకుల ధరలన్నీ పెరిగిపోయాయి. అయినా తృప్తిపడని బూర్జువావర్గం ఈ సరుకు విదేశాలనుండి దిగుమతి చేసుకుంటే నిర్ణయమయ్యే ధరనే యివ్వాలని కోరటమేకాక ఇప్పటికే అమలుచేస్తున్నాయి. ఎరువులు, ఔషధాల ధరలు ఇలాగే పెంచివేసుకుంటూ పోతుండటంతో ధరలు పెరిగి ప్రజలకు పెనుభారమౌతున్నాయి.

మౌలిక సరుకుల ధరలు పెరుగుతుండటంతో నిత్యావసర సరుకుల ధరలు కూడా రోజురోజుకూ పెరిగిపోయి

**(మిగతా 6 నుండి 13 పేజీల్లో)**

## రాజకీయ తీర్మానం... (5వ పేజీ తరువాయి)

ప్రజలకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. బడా వాణిజ్యవర్గాలు మార్కెట్టుపై గుత్తాధిపత్యంతో ధరలను అనూహ్యస్థాయికి పెంచి వేస్తున్నాయి. వ్యవసాయ ఉత్పత్తుల ధరల విషయంలో ఇది కొట్టవచ్చినట్లు కన్పిస్తుంది. వంటనూనెల వ్యాపారంపై గుత్తాధిపత్యంగల రెండు మూడు కంపెనీలు రైతాంగాన్ని నష్టపరిచి వంటనూనెల ధరలను విపరీతంగా పెంచి వేసాయి. ఆహార ధాన్యాలకు కనీస మద్దతుధర కూడా దక్కకుండా పోతుండగా బియ్యం గోధుమ ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇక కూరగాయల రైతాంగం తిరిగి తీసుకువెళ్లే ఖర్చుకూడా రాక అక్కడే పారబోసే దుస్థితిలో వుంటే, పదిరెట్ల ధరకు వ్యాపారులు అమ్ముకుంటున్నారు. వ్యవసాయంపై ఆధారపడ్డ జనాభా 65 శాతానికీ ఆదాయాలు తగ్గిపోయి, వారి కొనుగోలుశక్తి క్షీణించి పోతున్నది. ఆహార సబ్సిడీలు తగ్గించి ప్రభుత్వమే ధరలు పెంచివేస్తున్నది.

దీనికితోడు నానాటికీ పెరుగుతున్న భవిష్యవాణిజ్యం అన్ని నిత్యావసర సరుకుల ధరలనూ పెంచివేస్తున్నది. 2010 సంవత్సరంలో వ్యవసాయ ఉత్పత్తుల్లో భవిష్య వాణిజ్యం రూ॥45.127 కోట్లు వుండగా, 2011లో రూ॥90,896 కోట్లకు పెరిగింది. ఒక్క ఏడాదిలో 85శాతం పెరుగుదల. ఆహార ధాన్యాలలో భవిష్య వాణిజ్యాన్ని అనుమతించలేదని చెప్పుకున్నప్పటికీ, కార్గిల్, సింజెంటా తదితర విదేశీ కంపెనీలు లక్షల టన్నుల బియ్యం, గోధుమలు కొని నిల్వ వుంచుతున్నాయి. దీనితో ధరలు పెంచుతున్నాయి.

దీనికితోడు రూపాయి విలువ పడిపోయి, ద్రవ్యోల్బణం పెరిగే విధానాలను అమలుచేస్తున్నాయి. ఒకవైపున ధనాఢ్యవర్గాల విలాస సరుకుల అమ్మకాలను (ఉదా॥కార్లు) పెంచేందుకు రుణాలిస్తూ ద్రవ్యచెలామణిని పెంచుతున్నారు. రెండవవైపున ప్రభుత్వం చేపట్టిన నిర్మాణాలలో 40 రూ॥విలువగల ఆస్థి ఏర్పడటానికి 100 రూ॥వ్యయంచేస్తూ అవినీతితో 60రూ॥లు దిగమింగిన ఫలితంగా ద్రవ్య చెలామణి పెరిగి, రూపాయి విలువ పడిపోతున్నది. దీనితో రూపాయలలోనే ఆదాయం తగ్గుతున్న ప్రజల నిజఆదాయం తరిగి నిత్యావసరాలను కూడా కొనుగోలు చేయలేక అర్ధాకలితో అర్ధనగ్నంగా బ్రతుకులీడుస్తున్నారు. తీవ్ర ఎండవేడిమికి ఈ ఏడాది వందలాది పేదలు పిట్టల్లా రాలిపోవటం అధిక ధరల ఫలితమే.

అధిక ధరల సమస్య మధ్యతరగతి ప్రజల జీవనాన్ని దుర్భరం చేస్తున్నది. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో అసలే అందుబాటులో లేని ధరలతో కడుపు కట్టుకుని నిల్వచేసుకున్న ఆదాయాన్ని ప్రైవేటు బడులకూ, ఆస్పత్రులకూ ధారపోస్తున్నారు. అధిక ధరలతో ఏర్పడిన దుర్భరపరిస్థితిని ప్రజాందోళనను నిర్మించే, వాటిని రాజకీయ పోరాటాలుగా మలిచేందుకు కృషిని తీవ్రం చేయాలి.

ఈ నిలువు దోపిడీ నుండి ప్రజలలో పెరుగుతున్న అశాంతిని చల్లార్చేందుకు పథకాలను కూడా ప్రపంచ బ్యాంకే రూపొందించి ఇస్తున్నది. వాటి అమలుకూ గ్రాంటు లిస్తున్నది. నగదు బదలీ పథకం, ఆధార్ కార్డులు ఇలాంటివే. ఇక పాలకవర్గ ముఠాలకు మిగిలిన పనల్లా పథకాలు మావంటే మావని మాటల బాణాలు విసురుకోవటమే. ఇటీవలి ఉప ఎన్నికల్లో సోనియాగాంధీ యిచ్చిన పథకాలను రాజశేఖరరెడ్డి తనవిగా చెప్పుకున్నాడంటూ కాంగ్రెసు నాయకులు చేసిన విమర్శ రాజకీయనేతల పతనావస్థనే తెలుపుతున్నది.

### 1. వ్యవసాయరంగం-గ్రామీణ ప్రజల జీవనం

రైతు సంక్షేమంకోసమే తమ పార్టీ నిలుస్తుందంటూ అధికారంలోకి వచ్చిన కాంగ్రెసుపార్టీ కమీషన్లనూ, కమిటీలను వేసి మొసలికన్నీరు కార్చింది తప్ప వాటి సూచనలను కూడా అమలు జరపలేదు. వ్యవసాయ రంగంలో అప్పటికే నెలకొని వున్న సంకట స్థితినీ, వ్యవస్థాగత కారణాలనూ, వాటిని తొలగించకపోగా మరింత తీవ్రంచేసే విధానాలనూ ప్రభుత్వమెలా అనుసరించిందో గత తీర్మానం వివరించింది.

రైతాంగానికి సాగు నష్టదాయకంచేసి వారిని ఆర్థిక మీటల ద్వారా భూమినుండి తరిమివేసే విధానాలనే కేంద్రప్రభుత్వం మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వం అమలు జరుపుతూ వచ్చింది. ఫలితంగా రైతాంగంపై రుణ భారంలో దేశంలోనే రాష్ట్రంలో మొదటిస్థానంలో నిలిచింది. 82 శాతం మంది రైతులపై రుణభారం మోయలేనిదిగా వుందని ప్రభుత్వ సర్వేలే తెలుపుతున్నాయి. కనుకనే రైతాంగపు ప్రతిష్టా ఆత్మహత్యలు కొనసాగుతున్నాయి. కుటుంబ పెద్దగా వున్న రైతును కోల్పోయి రైతు కుటుంబాలు అన్నవిధాల చితికి పోతున్నాయి.

*ఈ దుర్భర పరిస్థితి ప్రజలలో చైతన్యాన్ని రగుల్చు తున్నది. కార్యాచరణకు పురికొల్పుతున్నది. భూమికోసం, ఇంటికి చారెడు నేల కోసం వారు ఆందోళనలు సాగిస్తున్నారు. పాలకుల దోపిడీ విధానాలకు, నిరసనలు తెలుపుతున్నారు. మెరుగైన వేతనాల కొరకు, పనిభద్రత కొరకూ పోరాటాలు సాగిస్తున్నారు. తమ జీవన విధానం, జీవనోపాధి, సంప్రదాయక హక్కుల కొరకు ఆదివాసీలు ఉద్యమిస్తున్నారు. ఆత్మగౌరవం కోసం, కులవివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా దళితులు ప్రతిఘటనలోకి వస్తున్నారు. ఉపాధి అవకాశాల కొరకు, మెరుగైన వేతనాలకూ, పని ప్రదేశాల్లో రక్షణకూ, తమపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితపడుతున్నారు. ఇవి దోపిడీ పాలకవర్గాల పాలనకు సవాలుగా నిలుస్తున్నాయి.*

ఫలితంగా వ్యవసాయాన్ని వదలి వేస్తున్న రైతాంగం సంఖ్య నానాటికీ పెరుగుతున్నది. భూమిని అమ్మివేసి అప్పులుతీర్చి ఆర్థికంగా దివాళా తీస్తున్నారు.

### అ. భూమినుండి దూరం చేయబడుతున్న రైతాంగం

రైతాంగ పోరాటాల ఫలితంగా భూసంస్కరణల చట్టాలనూ, వాటికి సవరణల చట్టాలనూ, అడవిపై గిరిజన హక్కుల రక్షణ చట్టాలనూ చేసిన ప్రభుత్వం వాటిని అమలు చేయకపోగా, వ్యూహాత్మకంగా భూమినుండి రైతాంగాన్ని దూరంచేసే ప్రక్రియను అమలుజరుపుతూ వుంది. ఇప్పటి వరకూ రైతాంగాన్ని రుణగ్రస్తుల్నిచేసి, భూమిని అమ్ముకునే విధానాలను అమలుజరుపుతూ వుంది. రైతాంగాన్ని అప్పుల ఊబిలోకి నెట్టే ఈ విధానాలను కొనసాగించటమే కాకుండా, మరింత విస్తృత పరుస్తున్నది.

2004లో అధికారంలోకి రాగానే గ్రామీణ పేదలలో భ్రమలు కల్పించేందుకు ఒక తంతుగా భూపంపక కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ ప్రచార హోరులోనే అసైన్డు భూముల చట్టాన్ని సవరించింది. భూసేకరణ చట్టంతో, అసైన్డు భూముల చట్టాన్ని కలిపి సెజ్‌ల పేరిట, వాన్‌పిక్, కోస్టల్ కారిడార్ పేరిట భూములు లాగుకుని రైతాంగాన్ని గెంటివేసింది. వేలాది ఎకరాలను ఆశ్రిత వర్గాలకు కట్టబెట్టింది.

కోనేరు రంగారావు కమిటీ చేసిన సూచనలు వేటినీ అమలుజరపబూనుకొనని ప్రభుత్వం, తానెంత రాజకీయ సంక్షోభంలోవున్నా ఒక సూచనను మాత్రం అమలు చేసింది. ప్రపంచబ్యాంకు ఆజ్ఞాపించి నిధులిచ్చిన ఈ సూచన, భూమి రికార్డులను కంప్యూటీకరణ చేయటం. ఎప్పటికప్పుడు భూమి రికార్డులు సరిగా నిర్వహించ నందున భూముల అమ్మకం, కొనుగోళ్లు చిక్కుల మయంగా వుండి విపరీత జాప్యం జరుగుతున్నందున భూమి రికార్డులను అప్‌డేట్ చేసి కంప్యూటర్లలో నిక్షిప్తం చేస్తామని ప్రకటించింది. రైతాంగాన్ని భూమి నుండి గెంటివేసే చర్యల మూలంగా భూమి చేతులు మారటాన్ని సరళతరం చేయాలని చెబుతూ చేపట్టిన ఈ విధాన లక్ష్యం, అంతిమంగా మార్కెట్టులో అమ్మకం సరుకుగా భూమి మార్కెట్టును స్థిరీకరించటమే. దీనితో భూముల అమ్మకాలలోకి చట్టా వ్యాపారం ప్రవేశించటం సులభమౌతుంది. భూమి ధరలు ఆకాశాన్నంటుతాయి. ధనాఢ్యవర్గాలూ, సామ్రాజ్యవాదుల చేతిలో భూమి కేంద్రీకరణ పెరుగుతుంది. ప్రభుత్వానికి రిజిస్ట్రేషన్ల నుండి ఆదాయం పెరుగుతుంది. బక్కరైతు భూమిని కోల్పోవడం తప్ప సెంటు భూమికూడా కొనుగోలు చేయలేని స్థితి ఏర్పడుతుంది. భూమి లేక ప్రత్యామ్నాయ ఉపాధి లేక రైతాంగం దారిద్ర్యంలో కూరుకుపోతున్నారు.

ఇటీవల రాష్ట్రప్రభుత్వం కాంట్రాక్టు సాగును అనుమతించే జి.ఓ.లను జారీచేసింది. వీటితో పట్టణాలూ, నగరాలలోవున్న షాపింగ్ మాల్సు కూరగాయలు, పండ్లు, పూలు, వరి తదితర పంటలు పండించే రైతులతో పంటను తమకు సరఫరా (అమ్మకం) చేసేవిధంగా, ఫలానా పంటవేస్తే ఫలానా రేటుకు తీసుకుంటాననే విధంగా ముందస్తు ఒప్పందాలు చేసుకునేందుకు వీలు కలిగింది. రైతాంగానికి సాగు గిట్టుబాటు కాకుండాచేసి వారిని పెద్ద కంపెనీలకు బంధిత ఉత్పత్తిదారులుగా మార్చేందుకు పాలకవర్గాలు పూనుకున్నాయని మన నిర్మాణం చెబుతూ వస్తున్న విషయపు ఆచరణయొక్క ఒక స్థాయిలోని రూపమే యిది.

చిక్కులమయమైన సాగుతో రైతు విసిగి వేసారేలా చేసి కాంట్రాక్టు సేద్యమే మేలనుకొనే మానసికస్థితి ఏర్పడే విధంగా ఇప్పుడు జిఓలను విడుదల చేసింది. ఒక పద్ధతి ప్రకారం ఉద్దేశ్యపూరితంగా రైతాంగ వ్యతిరేక విధానాలను అమలుజరిపింది. వాల్‌మార్ట్ వంటి కంపెనీలు కాంట్రాక్టు సాగుపేరిట అటు రైతాంగాన్ని ఇటు వినియోగదారులను నిలువుదోపిడీ చేస్తున్న వివరాలను మనం ప్రచారం చేస్తున్నాము. అలాగే కాంట్రాక్టు సాగు ఇప్పటికే అమలులోవున్న పంజాబువంటి రాష్ట్రాల అనుభవాలను కూడా రైతాంగానికి వివరించడానికి కృషిచేయాలి. ఆవిధంగా రైతాంగంలో రాజకీయ చైతన్యాన్ని పెంచాలి.

పాలకవర్గాల ముఠాతగవులతో భూసేకరణ పేరిట సాగిన అక్రమాలు బయటపడ్డాయి. రైతాంగాన్ని ఎంత నిరంకుశంగా భూముల నుండి గెంటివేశారో తేటతెల్లమైంది. దీనిలో చురుకుగా పాత్ర పోషించిన నేతలే నేడు ఈ భూములు రైతాంగానికే చెందాలంటూ దొంగ నినాదాలిస్తున్నారు. కొన్ని సెజ్‌లనూ, కొన్ని భూ కేటాయింపులనూ ఎందుకు రద్దుచేయరాదంటూ నోటీసులు జారీచేసి ప్రత్యర్థులను దెబ్బతీయ చూస్తున్నారు.

2010-11లో 80.29 లక్షల హెక్టార్లలో 2.03 కోట్ల టన్నుల ఆహార ధాన్యాలు రాష్ట్రంలో పండగా, 2011-12లో 70.6 లక్షల హెక్టార్లకూ, 1.73 కోట్ల టన్నులకు దిగజారింది. సాగునుండి రైతాంగం తప్పుకుంటున్నారనీ యిది తెలుపుతున్నది.

ఇన్ని విధానాలుగా రైతాంగాన్ని భూమినుండి దూరంచేస్తున్నారు. దోపిడీ వర్గాలకు భూమిని కట్టబెడుతున్నారు. ఈ పరిణామం వ్యవసాయరంగంలో అభివృద్ధి తీసుకురావటం లేదు సరికదా, నానాటికీ ఉపాధి కల్పన క్షీణిస్తూ నిరుద్యోగిత పెరిగిపోతూ వుంది.

### ఆ. వ్యవసాయ కూలీలు

వ్యవసాయరంగంలోని సంక్షోభం వ్యవసాయ కూలీల జీవనాన్ని దుర్భరం చేస్తున్నది. చేతివృత్తుల నాశనం తీవ్రమవటంతో వీరు కూడా వ్యవసాయ కూలీలుగా దిగజారుతున్నారు. దినసరి కూలీల సంఖ్య పెరుగుతున్నది. పనిదినాల సంఖ్య తగ్గుతున్నది. పనులు వెతుక్కుంటూ పట్టణాలకూ, నగరాలకూ వలసలు ప్రవాహంలా సాగుతున్నాయి. రాష్ట్రంలోని అన్నిజిల్లాల నుండేకాక ఒరిస్సా, ఛత్తీస్‌ఘడ్, బీహార్, బెంగాలు, మధ్యప్రదేశ్‌లనుండి కూడా హైద్రాబాదు నగరానికి వలసలు వస్తున్నారు. గత రెండేళ్లలో హైదరాబాదు నగరానికి 5 లక్షలమంది వలసవచ్చినట్లు అంచనా. మరొక నగరమైన విశాఖలో జనాభా 15 లక్షలుండగా వీరిలో 3 లక్షలమంది గత రెండేళ్లలోనే వలసవచ్చారు. విజయవాడ నగరానికి 2 లక్షలమంది వలస వచ్చారు. జిల్లా కేంద్రాలుగా వున్న గుంటూరు, రాజమండ్రి, తిరుపతి, కాకినాడ, నెల్లూరు, వరంగల్లు, నిజామాబాదు, ఏలూరువంటి పట్టణాలకు 50వేల నుండి లక్షవరకూ వలసలు వచ్చినట్లు తెలుస్తున్నది. భీమవరం, పాలకొల్లు, నర్సాపురం, ఒంగోలు వంటి రెండవశ్రేణి పట్టణాలు కూడా వలసలతో కిటకిటలాడుతున్నాయి. 876 మండలాల్లో తీవ్రకరవు పరిస్థితులేర్పడటంతో ఈ ఏడాది వలసలు మరింత పెరుగుతాయి. ప్రధానంగా భవన నిర్మాణ రంగంలో పనిచేసే కూలీలుగా ఎక్కడ చీకటిపడితే అక్కడ నిద్రపోవటం, ఫుట్‌పాత్‌లపై జీవనం సాగిస్తున్నారు.

గ్రామీణ ఉపాధి హామీపథకం లక్ష్యాలలో సగం రోజులు 30శాతం మందికి సగం వేతనాన్ని కూడా చెల్లించకుండా సాగుతున్నది. కాగా ఈ పథకం వల్లనే కూలీల కొరత, వేతనాలు పెరిగాయంటూ సంక్షోభ ఫలితంగా రైతాంగంలో చెలరేగుతున్న అశాంతిని కూలీలవైపు మరల్చే ప్రయత్నం చేస్తూ, దీనికి పరిష్కారంగా వ్యవసాయంలో యాంత్రికీకరణను పెంచే చర్యలు ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రస్తుతం ఈ యాంత్రికీకరణ అత్యంత నెమ్మదిగా సాగుతున్నప్పటికీ, పని దినాలు తగ్గి కూలీల వలసలు మరింత పెరగడానికి, పెట్టుబడి మదుపు పెరిగి పేద రైతాంగం భూమిని కోల్పోవటానికి దారి తీస్తుంది. ప్రభుత్వం కోరుకుంటున్నదిదే.

ఇది ఊహాజనితంకాదు. 1990లోనే ఈ క్రమం ముందుగా ప్రారంభమైన పంజాబు రాష్ట్ర అనుభవాలు దీనినే తెలుపుతున్నాయి. 1,28,000 చిన్న కమతాలు (4 ఎకరాలలోపు) గల రైతులు తమ భూమిని పెద్ద రైతులకు కౌలుకిచ్చారు. మరో 72వేల మంది భూమిని అమ్మివేశారు. మొత్తం ఈ రెండు లక్షలమందిలో మూడవవంతు మంది వ్యవసాయ కూలీలుగా మారారు. వీరి స్థితి గతంకంటే హీనంగా వుంది. కౌలుకిచ్చిన వారిలో అత్యధికులు, తర్వాత అమ్మివేశారు. ఇలా అమ్మిన వారిలో మూడోవంతు మంది పరిస్థితి మరింత దిగజారింది. (సుఖపాల్‌సింగ్ 2012). ఫలితంగా చిన్న కమతాల సంఖ్య 2 లక్షలు తగ్గింది. 30శాతంగా వున్న చిన్న కమతాలలో 8 శాతం భూమే వుంది. దేశంలో ప్రభుత్వ గణాంకాల ప్రకారమే పెద్దకమతాల సంఖ్య పెరుగుతున్న రాష్ట్రంగా పంజాబు వుంది. అంటే భూమి కేంద్రీకరణ పెరుగుతున్నది.

*హిందూ మతోన్మాదాన్నీ, మైనారిటీ మతస్తులపై వ్యతిరేకతనూ నగ్నంగానూ, నాజూకుగానూ పెంచి పోషిస్తున్నారు. దేశంలో ఎక్కడ "టెర్రరిస్టు"ను అరెస్టు చేసినా దాని ముస్లిం మూలాలు హైద్రాబాద్‌కు ముడిపెట్టడం ద్వారా ముస్లింలను నిరంతరం అభద్రతా భావంలోనే ఉంచటంలో కాంగ్రెసు పాత్ర తక్కువగా లేదు. ఇవన్నీ ప్రజలను చీల్చి వారి ఐక్యతను నాశనం చేసి తమ పాలనను సాగించుకునే కుటిలయత్నాలే.*

సామ్రాజ్యవాదుల సంక్షోభం కమ్ముకురావటం, నగరాలలో సేవారంగంలో ఉపాధి కల్పన తగ్గుముఖం పట్టడంతో, రాగల రోజులలో వీరికి ఉపాధి అవకాశాలు మరింతగా కుదించుకుపోతాయి. ఈ పరిస్థితినుండి బయటపడే మార్గ మెంచుకునే దిశగా వ్యవసాయ కూలీలు సంఘటిత పడకుండా తాత్కాలిక ఉపశమనంవైపు ఎదురు చూసే నిస్సహాయులుగా వారినుంచే పథకాలను అమలుచేస్తున్నారు.

### ఇ. కౌలు రైతాంగం

భూమికి దూరంకావటం, వ్యవసాయ-వ్యవసాయేతర ఉపాధిలేమి కలిసి కౌలు సేద్యాన్ని పెంచుతున్నాయి. గ్రామీణ పేదలు కౌలుకు తీసుకోవటం పెరుగుతున్నది. భూదాహం పెరగటంతో కౌలురేట్లు పెరుగుతున్నాయి. ధనికవర్గాలు కౌలుకు తీసుకోవటమూ, వాణిజ్య పంటల సాగుకు ఇతర ప్రాంతాలకు వెళ్లి మధ్యతరగతి రైతులు కౌలుకు తీసుకోవటమూ సాగుతున్నది. అయితే ఇది మార్కెట్టు ఒడిదుడుకులకు లోబడి అస్థిరంగా వుంది.

గ్రామీణ పేదలు కౌలుకు తీసుకుని ఎలాంటి రక్షణలూ లేకుండా తీవ్రంగా నష్టపోతున్నారు. ఆ ప్రాంతంలో లేని వ్యాపారులకు, ఉద్యోగులకు చెందిన భూమిని కౌలురైతాంగం చేస్తున్నారు. వ్యవసాయకంగా ముందున్న జిల్లాల్లో 50 శాతం భూమి కౌలుక్రింద వుందని అధికారిక అంచనాలే తెలుపుతున్నాయంటే కౌలుదారుల సమస్య ప్రాముఖ్యత అర్థమౌతుంది.

రైతాంగ పోరాటాల మూలంగా కౌలుదారీ రక్షణ చట్టాన్ని పాలకులు తప్పని సరై చేశారు. ఏనుగులు దూరే కంతలున్న ఈ పాటి చట్టాన్ని కూడా అమలుజరిపే ప్రయత్నం కనీసంగా కూడా చేయలేదు. దీనితో మూజువాణీ కౌళ్ళు పెరిగిపోయి, ప్రభుత్వమందించే కొద్దిపాటి మద్దతూ కూడా అందక, బ్యాంకు రుణాలు అందక కౌలురైతాంగం అప్పులలో కూరుకుపోతున్నారు. ఆత్మహత్యలు చేసుకున్న రైతాంగంలో కౌలు రైతుల సంఖ్య గణనీయంగా వుండటం సమస్య తీవ్రతను తెలుపుతున్నది.

ఫలితంగా కౌలురైతులలో పెరుగుతున్న అశాంతిని చల్లార్చేందుకు ప్రభుత్వం కౌలురైతులకు గుర్తింపు కార్డులిచ్చి వారికి రుణపరపతి, ఇన్‌పుట్ సబ్సిడీల సౌకర్యం కల్పిస్తానంటూ ముందుకొచ్చింది. కానీ కౌలుదారీ చట్టాన్ని సవరించి దానిని కౌలుదారులకు రక్షణ కల్పించేదిగా రూపొందించేందుకు పూనుకోలేదు. దేవాదాయశాఖ చట్టబద్ధంగా పెట్టిన వేలంపాటలో భూమిని కౌలుకు పొంది, కౌలు చెల్లించి రసీదులు పొందినా, దేవాలయ భూముల కౌలుదారులకు గుర్తింపు కార్డులు జారీ చేయటానికి ప్రభుత్వం నిరాకరించింది. తాను కౌలుకిచ్చిన కౌలుదారులకు గుర్తింపు కార్డులివ్వని ప్రభుత్వం, భూయజమాని కౌలుకిచ్చినట్లు అంగీకరిస్తేనే గుర్తింపు కార్డులిస్తానని నిబంధనపెట్టి కౌలుదారులకు ప్రయోజనం లేకుండా చేసింది. చివరికి కౌలురైతులు స్వయం సహాయక బృందాలుగా ఏర్పడితే బ్యాంకులు రుణాలంద జేస్తాయంటూ పథకాన్ని సూక్ష్మరుణాల స్థాయికి దిగజార్చారు. ఇది కూడా నామమాత్రంగానే అమలు జరిగింది. కౌలురైతుల గుర్తింపుకు మొదటి ఏడాది చేసిన సభల హడావుడి ఈ ఏడు జూన్ నెలవచ్చినా కలికానికి కూడా కన్పించలేదు. ఈ ఏడాది రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల సమావేశంలో కౌలురైతుల రుణాల అందజేతకు కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. రైతు కౌలుకిచ్చిన భూమిపై రుణం తీసుకొని వుండకపోతే, గుర్తింపుకార్డు ఆధారంగా కౌలురైతుకు లక్ష రూ॥ల వరకు రుణమివ్వాలని నిర్ణయించాయి. వ్యక్తిగత రుణంగా, స్వయం సహాయక బృందం రుణంగా యిస్తారు. వడ్డీ 14 శాతం వసూలు చేస్తారు. ప్రభుత్వ మిచ్చే పావలా వడ్డీ పథకం వర్తించదు. పంటల భీమా కూడా వర్తించదు. రైతాంగం సంస్థాగత రుణాలను కోరుతున్నది వడ్డీ తక్కువ వుంటుందని. కాగా వ్యక్తిగత రుణంగా అధిక వడ్డీ విధింపుకు పూనుకుని అసలు లక్ష్యానికి గండిపెట్టింది. కౌలు రైతులపట్ల అది చూపిన శ్రద్ధ బూటకం. వారసత్వంగా భూమిని వేరుచేసుకున్న ఒక కుటుంబానికి చెందినవారే స్వయం సహాయ బృందాలుగా ఏర్పడి బ్యాంకు రుణంపొంది తిరిగి వడ్డీలకు త్రిప్పుతున్నారన్న ఆరోపణలు చెదురుమదురుగా నైనా విన్పిస్తున్నాయి.

ఏమైనా కౌలు అన్న పదంపట్ల సాగిన వివాదం లైసెన్సు రైతుగానూ, అనుమతిపొందిన సాగుదారుగానూ మారి, చివరకు కౌలుదారులను చట్టపరిధినుండి తప్పించేదిగా రూపొందింది. కౌలుదారులను మరింత నిస్సహాయులుగా చేసింది. ఈ సందర్భంగానే కౌలు రేట్లు పరిశ్రమల స్థాయిలో నిర్ణీతమవ్వాలన్న డిమాండును రైతు

సంఘాలుగా చెలామణి అవుతున్న వారు ముందుకు తేవటం కౌలురైతాంగం మరింత దుర్భర పరిస్థితి నెదుర్కొనబోతున్నారని తెలుపుతున్నారు.

## ఈ. ప్రైవేటు ఆస్థిగా మారుతున్న సాగునీరు

వ్యవసాయాభివృద్ధికి భూమి తర్వాత కీలకాంశం సాగునీరు. పంట భూములకు సాగునీరందించకుండా విశాల భూభాగాలను వర్షాధారితంగా, కరువు పీడిత ప్రాంతాలుగా ఉంచే విధానాన్నే పాలక వర్గాలు అనుసరిస్తున్నాయి. ప్రాజెక్టుల ద్వారా నీరందించిన భూములకంటే, రైతాంగం స్వయంకృషితో ఏర్పాటు చేసుకున్న నీటి పారుదలే అధికంగా వుంది. దీనివల్ల కాలువల సేద్యానికీ, గొట్టపు బావుల సేద్యానికీ వ్యయంలో ఏర్పడిన వ్యత్యాసంతో రైతాంగానికి న్యాయమైన ధర దక్కటంలేదు. దీనికి పరిష్కారంగా ప్రభుత్వం ఉచిత కరెంటు పథకాన్ని ప్రవేశపెట్టింది. భూగర్భ జల వినియోగం పెరిగి; వాటిని తిరిగి నింపేందుకు ప్రభుత్వం ఎలాంటి చర్యలూ తీసుకోకపోవటంతో భూగర్భ జలాలు తరిగిపోతున్నాయి. బోరుబావులు ఎండిపోతున్నాయి. ధనిక వర్గాలు గొట్టపు బావులను లోతు చేసుకుని నీటిని తోడుకుంటున్నాయి. 600–700 అడుగుల లోతువరకూ వేస్తున్నారు. ఒక్క లోతైన గొట్టపు బావితో దాని చుట్టూ వున్న వంద లోతుతక్కువ గొట్టపు బావులు ఎండిపోతాయి. లోతు చేసుకోవటానికి తగిన ద్రవ్య వనరులులేని పేద మధ్యతరగతి రైతాంగం సాగునీటిని కోల్పోతున్నారు. సేద్యం నుండి తప్పుకోవాల్సిన స్థితి ఏర్పడింది. సాగునీరు కూడా పరోక్షంగా ధనాఢ్యవర్గాల ఆధీనంలోకి వెళ్లింది.

దీనికి తోడు సాగునీటిని సూటిగానే ప్రైవేటు ఆస్థిగా మార్చే చర్యలను ప్రభుత్వం త్వరితం చేస్తున్నదని గత తీర్మానం పేర్కొంది. కృష్ణా, గోదావరి డెల్టాల కాలువల వ్యవస్థ ఆధునీకరణ పేరుతో ప్రపంచబ్యాంకు రుణంతో చేపట్టిన నిర్మాణ కార్యక్రమంలో నీటి మీటర్ల బిగింపు అంతర్భాగంగా వుంది. ఈ నిర్మాణాలు పూర్తయితే నీటి వినియోగ సంఘాల ఏర్పాటుకు శాసనపర ఏర్పాట్లు జరిగాయి కనుక సాగునీటి అమ్మకాలు మొదలుపెడతారు. ఇది సాగునీటిపై గ్రామీణ పెత్తందారీ వర్గాలకు గుత్తాధిపత్యాన్నిస్తుంది.

నీటి ప్రైవేటీకరణను చట్టబద్ధం చేసే లక్ష్యంతో కేంద్రప్రభుత్వం జాతీయ జలవిధాన ముసాయిదాను విడుదల చేసింది. ప్రపంచబ్యాంకు ఆదేశాల మేరకు రూపొందిన ఈ విధానం "నీటినుండి గరిష్ట విలువను రాబట్టడాన్ని" తద్వారా "నీటి సమర్ధవంత వినియోగాన్ని సాధించటం" లక్ష్యంగా ప్రకటించింది. గరిష్ట విలువ అంటే అమ్మకపు సరుకుగా ధర నిర్ణయించటమే; సమర్ధవంత వినియోగమంటే ఆ ధర చెల్లించగల వారికే నీరు అందుబాటులో వుండటం. దీని ఫలితం స్పష్టమే. నీటి ప్రైవేటీకరణ, నీటిని ప్రైవేటు ఆస్థిగా మార్చుతుంది. సమాజమంతటికీ చెందవలసిన ప్రకృతి వనరును కొందరికే దఖలుపరుస్తుంది. ఇది గ్రామసీమలలో వర్గ వ్యత్యాసాలను తీవ్రంచేస్తుంది.

ప్రతి ఒక్క ఎకరానికీ సాగునీరందిస్తామంటూ కాంగ్రెసు ప్రభుత్వం ప్రారంభించిన జలయజ్ఞం, పాలకుల ధనస్వాహయజ్ఞంగా ఎలా సాగిందో బాగానే ప్రచారం జరిగింది. వేలకోట్ల రూపాయలు వ్యయమయినా చుక్కనీరు కూడా పొలాలకు చేరలేదు. దీనిక్రింద చేపట్టిన ఏ ప్రాజెక్టూ పూర్తయ్యే సూచనలు కన్పించటంలేదు. దశాబ్దాల తరబడి అనుమతులను ఇవ్వకుండా సాచివేత, అంతరాష్ట్ర వివాదాలు వంటి సాకులతో ఆలస్యం చేస్తున్నారు. ఆలస్యమైనకొద్దీ నిర్మాణ వ్యయం పెరిగి మోయలేని భారమౌతాయి. ఆచరణలో వినియోగంలోకి రాకుండా చేయటంద్వారా, భారత శ్రామిక జనుల శ్రమశక్తిని కారుచౌకగా వుండే స్థితిని కొనసాగిస్తున్నారు. ద్రవ్య వనరులను దుర్వినియోగపరచి ఆశ్రిత వర్గాలకు పంచిపెడుతున్నారు. ఈ దుర్వినియోగ ధనంలో పదోవంతు ఖర్చుపెట్టినా చిన్న నీటి వనరులూ, (చెరువులు) పునర్వినియోగంలోకి వచ్చి వుండేవి. వాటర్‌షెడ్ కార్యక్రమాలు పూర్తయి భూగర్భ జలాలు నిండేవి. వీటిపేరిట ప్రపంచబ్యాంకు నుండి రుణం తెచ్చి, మళ్లీ ఆశ్రిత వర్గాలకు కట్టబెడుతున్నారు.

అంతగా వెలుగులోకి రాని అంశమేమంటే సాగునీటి కోసమంటూ ప్రారంభించిన కొన్ని మధ్యతరహా ప్రాజెక్టులు పూర్తి అయ్యాయి. అవినీతితో పుచ్చిపోయి ఈ నిర్మాణాల భద్రత ప్రశ్నార్థకంగా వుండటంలో నిర్దేశిత లక్ష్యంలో సగం కూడా నీరు నిల్వచేయలేని స్థితి ఏర్పడింది. ఆ నీటిని కూడా ఇతర అవసరాలకు కేటాయించారు. ఉదా॥ గుండ్లకమ్మ నీరు వాన్‌పిక్‌కు. అలాగే ఇంతకు ముందున్న ప్రాజెక్టుల నీటిని కూడా రైతాంగానికి మొండి చెయ్యి చూపి పరిశ్రమలకు కేటాయించారు. ఉదా॥ సోమశిల.

## ఉ. పాలకులు సృష్టించిన కరవు

ప్రతినాలుగేళ్ళలో ఒక ఏడాది అతివృష్టి, ఒక ఏడాది అనావృష్టి, రెండేళ్లు సాధారణ వర్షపాతమూ వుంటాయని

> ***అధిక ధరలు చెల్లించక తప్పదన్న భావనను కలింగించటానికే విద్యుత్తు సంక్షోభాన్ని సృష్టించారు. తాటిచెట్టెక్కెందుకెక్కావంటే దూడ మేత కోసమన్న చందంగా కేజీ బేసిన్ గ్యాసు రాకపోవటమన్న వితండ వాదన చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ప్లాంటులకు గ్యాసు సరఫరా గత ఏడాది జరగలేదన్న నిజాన్ని కప్పిపుచ్చారు. అదివచ్చివుంటే లోటు పూడేదనటమే ప్రభుత్వ మోసకారి తనాన్ని తెలుపుతున్నది.***

కృష్ణా, గోదావరులపై ఆనకట్టలు నిర్మించిన నాటి నుండీ వున్న రికార్డుల బట్టి తెలుస్తున్న విషయమే. ఈ ఏడాది అనావృష్టి చక్రభ్రమణంలో వచ్చినదే. గత 11 ఏళ్లలో ఇది నాల్గవది. అయినా తగిన ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవటంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది.

రుతుపవనాలు ఆలశ్యమయ్యే అవకాశాలను గమనించి, రైతాంగానికి సకాలంలో నీరందించేందుకు తగిన నీటి నిల్వలను నాగార్జునసాగర్ – శ్రీశైలంలలో ఉంచాలి. అలా కాకుండా విద్యుదుత్పత్తికి వాడుతూ మొత్తం కాలువలసేద్యం క్రింద రైతాంగానికి నీరులేకుండా చేశారు. వున్న నీటిని కూడా సరఫరా చేయకుండా కోర్టు వివాదంలో పడవేశారు. సాగర్ నుండి నీటి విడుదలపై హైకోర్టు యిచ్చిన స్టే ఆర్డరును తొలగింపచేసేందుకు కౌంటరు అఫిడవిట్టు దాఖలు చేస్తానన్న రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా ఏ చర్యా తీసుకోలేదు. ప్రభుత్వ పథకం ప్రకారమే రైతాంగానికి సాగునీరు లేకుండా చేస్తున్నది.

దీనికి తోడు బచావత్ అవార్డు సందర్భంలోనే ముందుచూపు లేకుండా ఆనాటి ప్రభుత్వం వ్యవహరించింది. వానలు పడిన వెంటనే జలాశయాలకు చేరిన నీటిని దామాషా పద్ధతిలో రాష్ట్రాలు పంపకం చేసుకోవాలన్న సూచనను తిరస్కరించి, పైనున్న జలాశయాలు నిండిన తర్వాతే విడుదల చేసే సూచనను ఆమోదించింది. అనావృష్టి ఏర్పడిన ఏడాదిలో దిగువ రాష్ట్రాలకు నీటి కొరత ఎదురౌతుంది. ఆలమట్టి డ్యాము ఎత్తుగురించి నానాయాగీ చేసిన పాలకులకు బ్రిజేష్ ట్రిబ్యునల్ ముందు దీనిని సరిచేసుకునే ఆలోచనకూడా చెయ్యలేదు. దీనితో కర్ణాటకలోని అనావృష్టితో జలాశయాలు నిండటం ఆలశ్యమై ఈనాటికీ నీరు దిగువకు వదలలేదు. ఇది ఒక్క డెల్టా రైతాంగానికే కాక, సాగర్, శ్రీశైలం ఆయకట్టు రైతాంగానికి కూడా నీటి కొరతను సృష్టించింది.

అలాగే కృష్ణాబ్యారేజీలో ఈనీటి కొరతలోకూడా 10 అడుగుల నీరు నిలబెట్టి వుంచటం విటిపిఎస్ కోసమే. ఇలాంటి సంకట స్థితిలో నీటిని తోడుకునేందుకు పంపులు పెట్టుకొనేందుకు ప్రభుత్వం రు. 120 కోట్లు ఇచ్చింది. వాటి నిర్మాణం పూర్తయింది కూడా. అయినా వాటిని వాడకుండా కూలింగ్ కెనాలులో నీరెక్కాలంటూ రైతాంగానికి నీరు లేకుండా చేస్తున్నారు. విటిపిఎస్ ఈ పంపులతో నీరు తోడుకుని వుంటే, కనీసం బ్యారేజీ పరీవాహక ప్రాంతంలో కురిసిన వర్షాల నీరన్నా వృధాగా క్రిందికి పోకుండా డెల్టా రైతాంగానికి అందివుండేది. విటిపిఎస్‌కు పంపులున్నాయన్న సంగతే తెలియనట్లు పాలకులు వ్యవహరించారు.

ఈ కారణాలరీత్యా రైతాంగానికి సాగునీరందకుండా చేసి, వరిపంట మాని వాణిజ్య పంటలు వేయించాలన్న, నీటి తీరువా ఛార్జీలు విపరీతంగా పెంచివేయాలన్న తన విధానాన్ని అంగీకరింపజేయటానికి రైతాంగంపై వత్తిడి పెంచేందుకే ఒక పథకం ప్రకారం ప్రభుత్వం అనావృష్టిని కరవు స్థాయికి పెంచింది. ఫలితంగా నాల్గవ వంతు పంట భూమిలో నాట్లే పడని, పడిన నాట్లుకూడా ఎండిపోతున్న స్థితి ఏర్పడింది. రాష్ట్రంలో నెలకొన్న రాజకీయ కల్లోలంతో ఎవరికివారు పదవికాపాడుకునే ఆత్రంలో, సమస్యను పట్టించుకునే నాధుడు లేకపోయాడన్న వాదనను పూర్తిగా కొట్టివేయలేము. కానీ పాలకులు ఉద్దేశ్యపూరితంగానే వ్యవహరించిన పాత్ర ప్రధానమైనది.

జలాశయాలకు సాగునీటి సరఫరా మొదట ప్రాధాన్యతగా నిర్ణయించాలి; వరదల నివారణ, తాగునీటి సరఫరా రెండవ ప్రాధాన్యతగా నిర్ణయించాలి; ఇవి రెండూ తీరగా మిగిలిన జలాలతోనే విద్యుదుత్పత్తి చేయాలి. అంతర్రాష్ట్ర జలవివాదాలను ప్రాంతీయ విద్వేషాలుగా రెచ్చగొట్టే కుటిలనీతిని మానివేయాలి. ఈ ఏడాది అనుభవంనుంచైనా కళ్లు తెరిచి, నదీజలాలను దామాషా పద్ధతిలో కేటాయించాలని ట్రిబ్యునల్ ముందుకు వెళ్లాలి. ఈడిమాండ్లతో రైతాంగాన్ని సమాయత్త పరిచి సంఘటిత పోరాటాలకు సంసిద్ధపరిచే కృషి చేయాలి.

## ఊ. రైతాంగానికి రుణపరపతి

వ్యవసాయరంగానికందజేస్తున్న రుణాలలో పంట రుణాలకు లక్ష్యాలను ఆర్భాటంగా ప్రకటించే ప్రభుత్వం ఆచరణలో వాటిలో 10శాతం కూడా అందజేయని తీరును గత తీర్మానంలో వివరించాము. పరోక్ష రుణాల పేరిట సాగుకు సంబంధంలేని రంగాలకు యిచ్చిన రుణాలను కూడా వ్యవసాయ రుణాలుగా చూపెట్టి రైతాంగానికి రుణపరపతిని పెంచినట్లుగా చెప్పుకుంటున్న తీరును కూడా ఆ తీర్మానం వివరించింది. నేటికీ ఇదే పరిస్థితి కొనసాగుతున్నది.

అయితే ఈ అక్రమాలనే అనుసరణీయ మార్గాలుగా రూపొందించేందుకు ప్రభుత్వం పూనుకుంది. 2011–12 రుణపరపతి విధానాన్ని ప్రకటిస్తూ కేంద్రప్రభుత్వం నాయర్ కమిటీని నియమించింది. ఈ కమిటీ సూచనలు దీనికనుగుణంగానే వున్నాయి. వ్యవసాయరంగానికిచ్చే సంస్థాగత రుణాలలో ప్రత్యక్ష, పరోక్ష రుణాలనీ విభజించి ఒకటిగానే పరిగణించాలని కమిటీ సూచించింది. ప్రత్యక్ష రుణాలు పంట రుణాలు కాగా, పరోక్ష రుణాలలో పరికరాలు, ట్రాక్టర్లు, బిందుసేద్యం, బావులు, తేనెటీగల పెంపకం తదితరాలు వుండేవి. ప్రభుత్వం క్రమంగా ముడి వ్యవసాయ ఉత్పత్తుల ప్రాసెసింగు, నిల్వలు, మార్కెటింగు, అమ్మకాలు, శీతల గోదాములకిస్తున్న రుణాలను పరోక్ష వ్యవసాయ రుణాలలో చేర్చింది. తర్వాత వీటిని 50 శాతం మించకుండా ప్రత్యక్ష రుణాలుగా చూపెట్టుకో వచ్చునని బ్యాంకులకు చెప్పింది. ఫలితంగా నగరాలలోని బ్యాంకు శాఖల్లో ప్రత్యక్ష వ్యవసాయ రుణాలు పెరగటమూ, బ్యాంకులలో రైతు ఖాతాలలో పేదరైతుల ఖాతాలు తగ్గిపోవటమూ ఇప్పటికే సాగుతున్నది. శంఖంలో పోసి తీర్థమన్నట్లు, నాయరు కమిటీ దీనిని సమర్ధించే సూచననే చేసింది. ప్రత్యక్ష, పరోక్ష రుణాల విభజన వుండగానే, పరోక్ష రుణాలను పెంచి వాటినే ప్రత్యక్ష రుణాలుగా చూపిన బ్యాంకులూ, దానిని ప్రోత్సహించిన ప్రభుత్వమూ ఇప్పుడు నాయర్ కమిటీ పేరుచెప్పి వ్యవసాయ రుణాలను కూడా బడా వాణిజ్య వర్గాలకు కట్టబెడతాయి.

వ్యవసాయరంగాన్ని బడాబూర్జువాల, బడా వ్యాపారుల పరం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పరంపర కొనసాగింపే వ్యవసాయ రుణాల తరలింపు. రైతాంగానికి సంస్థాగత రుణసౌకర్యం అందుబాటులో లేకుండాచేసి దానిని బడా వర్గాలకు తరలించటం, రైతాంగాన్ని భూమినుండి తొలగించే చర్యల్లో భాగమే.

ఈ పరిణామాన్ని ప్రతిఘటించేందుకు రైతాంగాన్ని సంసిద్ధం చేయవలసిన కర్తవ్యం మన ముందున్నది. ప్రభుత్వ మోసకారీ విధానాన్ని రైతాంగానికి అర్థమయ్యేట్లు వివరించాలి. సాగు అవసరాలకూ, సాగు మెరుగుదలకూ యిచ్చే రుణాలనే వ్యవసాయ రుణాలుగా ప్రకటించి, వాటిని ప్రాధాన్యతా రంగ రుణాలుగా గుర్తించి, బ్యాంకుల అడ్వాన్సులలో 30శాతం ప్రాధాన్యతా రంగానికి కేటాయించాలి. వ్యవసాయ రుణాలకు 4 శాతం బారువడ్డీ మాత్రమే విధించాలనీ, తిరిగి చెల్లించిన కిస్తీలను మొదట అసలులో చెల్లింపు వేయాలనీ, రుణాల తిరిగి వసూళ్లకు రైతాంగపు ఉత్పాదక స్థిర, చరాస్తులు జప్తు చేయరాదనీ, తిరిగి చెల్లింపు కాలవ్యవధిని భూఉత్పాదకత ప్రమాణంగా పెంచాలన్న డిమాండ్లతో రైతాంగాన్ని ఆర్గనైజ్ చెయ్యాలి. మాయమాటలతో చెట్టుపేరు చెప్పి కాయలమ్ముకునే రీతిలో రైతాంగం సంక్షేమమంటూ దోపిడీ వర్గాలకు అనుకూల ప్రభుత్వ విధానాలను ఎండగట్టాలి. రైతాంగానికి అనుకూలంగా సమగ్ర సంస్థాగత రుణసౌకర్య విధానాన్ని ప్రకటించాలని డిమాండు చేయాలి.

## ఎ. రైతాంగ నిలువు దోపిడీ–మార్కెట్టు మాయాజాలం

దేశ వ్యవసాయరంగాన్ని సామ్రాజ్యవాద ఆర్థిక వ్యవస్థకు తోకగా మార్చేందుకు పంటల ధరల నిర్ణయాన్ని కీలకాంశంగా ప్రభుత్వం చేసుకుంది. పంటలకు న్యాయమైన ధరను నిరాకరిస్తూ వస్తున్నది. రాష్ట్రంలో 70శాతం రైతాంగం 3 ఎకరాలలోపు భూమి కలిగి వున్నారని చెబుతున్న ప్రభుత్వమే, వారందరూ కళ్లాలలోనే పంటను తెగనమ్ముకునే ఒత్తిడిలో వుంటారని తెలిసి కూడా పంటల కొనుగోలు మార్కెట్టు నుండి ప్రభుత్వరంగ సంస్థలను తొలగించింది. మార్కెట్టును బడా వ్యాపారుల యిష్టారాజ్యం చేసింది. దీనితో కనీస మద్దతు ధర కాస్తా గరిష్ట అమ్మకం ధర అయింది.

రైతాంగంపై సాగుతున్న నిలువు దోపిడీ అంతా సాగుక్రమంలో సాగుతున్నది. ఆ దోపిడీ చివరకు తక్కువధర రూపంలో వ్యక్తమౌతున్నది. నీటితీరువా రేట్లు, డీజిలురేట్లు పెంచి సాగునీటిని ఖరీదు చేశారు. ఎరువులు, పురుగుమందులపై నియంత్రణను ఎత్తివేసి వాటి ధరలకు రెక్కలు తొడిగారు. ఆదాయం పెరగాలంటే దిగుబడులు పెరగాలంటూ దానికి బిటి విత్తనాలే శరణ్యమంటూ విత్తనాల ధరలతో దోపిడీ చేస్తున్నారు. దీనితో సాగుకు పెట్టుబడుల మదుపు పెరిగితే, రైతాంగానికి అవసరమైన రుణాలను అందుబాటులో లేకుండా ఎలా చేస్తున్నారో యింతకు ముందు వివరించాము.

అప్పులుచేసి ఆరుగాలం శ్రమించి పంటను అమ్మేందుకు వస్తే రైతాంగానికి ఏ రక్షణా లేకుండా చేస్తున్నారు. ప్రభుత్వ మార్కెట్టు యార్డులను ప్రైవేటీకరించటంతోపాటు కొత్తగా ప్రైవేటు మార్కెట్టు యార్డులకు అనుమతినిస్తున్నారు. పంటలలో చట్టా వ్యాపారాన్ని ప్రోత్సహించి రైతును దివాళా తీయించి వ్యాపార వర్గాలకు లాభాలు చేకూరుస్తున్నారు.

ఇటీవల అనేక పంటలకు కనీస మద్దతు ధరలను పెంచిన కేంద్ర ప్రభుత్వం, వ్యవసాయాభివృద్ధి కొరకు ఈ పని చేశానని చెప్పుకుంది. వ్యవసాయశాఖామంత్రే వీటిని బహిరంగంగా వ్యతిరేకించాడు.

గత ఏడాది ప్రకటిత ధరలతో పోలిస్తే ఈసారి కనీస మద్దతు ధర గణనీయంగా పెరిగినట్లు కన్పిస్తుంది. కానీ ఈ ధరలు 2005లో రైతాంగం డిమాండు చేసిన ధరల స్థాయిలో ఉన్నాయన్న, ఆనాటినుండి సాగు అవసరాలన్నింటి ధరలూ విపరీతంగా పెరిగాయన్న వాస్తవాన్ని గుర్తిస్తే, పాలకులు సాగిస్తున్న వంచన అర్థమౌతుంది.

ఈ దుర్భర పరిస్థితి రైతాంగంలో ఆగ్రహ జ్వాలలను రగిలిస్తున్నది. ఎన్ని ఆందోళనలు చేసినా ఫలితం లేక విసిగి వేసారిపోతున్నారు. తమ పంటను తామే తగులబెట్టుకునే నిరసన రూపాలను ఎంచుకుంటున్నారంటే వారెంత నిస్సహాయ స్థితిలోకి, అసంఘటిత స్థితిలోకి నెట్టబడ్డారో అర్థమౌతుంది.

రైతాంగపు ఈ అశాంతికి పాలకవర్గ పార్టీల శక్తులే రైతు సంఘాల పేరిట నాయకత్వమొహించి, అంతిమంగా దోపిడీ వర్గాలకు తోడ్పడే విధంగా నడిపిస్తున్నాయి. గత ఏడాది వీరు ప్రకటించిన పంట విరామం ఇలాంటిదే. అలాగే రైతులకు గిట్టుబాటు ధర కొరకు వరి ఎగుమతులు అనుమతించాలంటూ వీరు చేసిన డిమాండు ప్రభుత్వ విధానానికి అనుకూలమైనదే. వరి ఎగుమతులకు అనుమతించినా రైతులకు చేకూరిన లబ్ధి ఏమీ లేదు. రైతాంగ కష్టాలకు, కూలీల సమస్య ముఖ్యమైనదిగా చిత్రిస్తూ వ్యవసాయ పనులకు ఉపాధి హామీపథకం వర్తింపచేయాలన్న వీరి డిమాండు, సమస్య మూలాల నుండి రైతాంగం దృష్టిమరల్చేదే. ఈ ఏడాది వీరు కొత్త నినాదాలు చేపట్టారు. కూలీల సమస్యకు పరిష్కారంగా యంత్రాల వాడకం పెంచుకొమ్మనీ, వరి గిట్టుబాటు కానందున "లాభసాటి" పంటలకు మారమనీ, నూతన సాంకేతిక పరిజ్ఞానం యిముడ్చుకోమనీ రైతాంగానికి ఉద్బోధ యిస్తున్నారు. ప్రభుత్వ వ్యవసాయ విధానంలోని అంశాలనే పరిష్కారాలుగా వల్లెవేస్తున్నారు. విసిగి వేసారిన రైతాంగాన్ని పనికిమాలిన నిరసన రూపాలు చేపట్టేట్లు చేసి, వారిని మరింత నిస్పృహ, నిస్సహాయ స్థితిలోకినెట్టి ప్రభుత్వ విధానాన్ని అంగీకరింపచేసే ఉద్దేశ్యపూరిత వెన్నుపోటు యిది.

వీరిపట్ల విమర్శనాత్మక వైఖరితో రైతాంగ ఆందోళనలకు మనం నాయకత్వం వహించాలి. సమస్యకు అసలు కారణాలను వివరించటంతోపాటుగా, పేద, మధ్యతరగతి రైతాంగ ప్రయోజనాలకనుగుణంగా డిమాండ్లను రూపొందించాలి. ప్రతి పంటనూ లోతుగా పరిశీలించి న్యాయమైన రేటును అంచనావేసి ప్రచారంలో పెట్టాలి. తామడగుతున్నది న్యాయమైన హక్కుగా రైతాంగం విశ్వసించగలిగినప్పుడే, వారు మిలిటెంటు పోరాటాలలోకి వస్తారు. మొత్తం ఖర్చులలో కంపెనీల వాటా, పన్నుల రూపంలో ప్రభుత్వవాటా ఎంత వున్నదో, దీనితో పోల్చినపుడు కూలీవాటా ఎలా తగ్గుతున్నదో కూడా వివరించాలి. తమ కంటికి కనిపించకుండా తాము దోపిడీ కెక్కడగురౌతున్నారో, దానికి మూలమైన విధానాలేమిటో రైతాంగం గుర్తించగలుగుతారు.

## ఏ. భూసేకరణ–పునరావాసం

రోడ్లు, విమానాశ్రయాలు, రేవులు, నీటిపారుదలా ప్రాజెక్టులు, సెజ్‌లు, కారిడార్లు, పరిశ్రమల నిర్మాణాల పేరిట సాగుభూములనుండి, నివాసయోగ్య స్థలాలనుండీ ప్రజలను ఖాళీచేయించి నిర్వాసితులుగాచేయటం ఇటీవల ప్రధాన సమస్యగా ముందుకు వచ్చింది. నిర్వాసితులౌతున్న ప్రజల ప్రతిఘటన కూడా ఉవ్వెత్తున ఎగసింది.

> ***దోపిడీ వర్గ పాలననుండి ప్రస్తుత సమాజ విముక్తి కొరకు కార్మికుల మధ్య విశాల ఐక్యతపై ఆధారపడిన మిలిటెంటు పోరాటాలు తప్పవన్న స్పృహను యావత్తు కార్మికవర్గంలో పెంపొందించాలి.***
>
> ***సమాజ విముక్తి, సాంఘికాభివృద్ధి సాధించటానికి పీడిత వర్గాలన్నింటికీ కార్మికవర్గం చోదకశక్తిగా రూపొందాలన్న అవగాహన, చైతన్యాన్ని కార్మికుల్లో పెంచాలి. పాలకవర్గాల అణచివేత పీడనలకు వ్యతిరేకంగా, సాంఘికవ్యవస్థ కారణంగా ఉత్పన్నమైన వెనుకబాటు తనానికి వ్యతిరేకంగా కార్మికవర్గం నిరంతరం పోరాడాలన్న స్పృహను కార్మికుల్లో కల్గించాలి.***

***కుటుంబ, సామాజిక వ్యవస్థల్లో ఫ్యూడల్, సామ్రాజ్యవాద దోపిడీ సంస్కృతులు, హీన విలువలు చలామణిలో వుంటున్నాయి. పేద, దళిత స్త్రీలకు అనేక హక్కులు నిరాకరించబడుతూనే వున్నాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, వ్యవసాయరంగ సంక్షోభం-ప్రతిదీ మహిళల జీవితాలను ముఖ్యంగా కష్టజీవి మహిళల జీవితాలను- మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి.***

ప్రజాప్రయోజనమంటే ఏమిటో నిర్వచించకుండా వలస పాలకుడు చేసిన నిరంకుశ చట్టాన్నే ఉపయోగించి ప్రజలను నిర్వాసితులను చేసి భూములను దోపిడీ వర్గాలకు కట్టబెట్టడం గతంనుండీ సాగుతూ వస్తున్నదే. నూతన ఆర్థిక విధానాల తర్వాత ఈ క్రమం మరింత తీవ్రమవటంతో దేశవ్యాపితంగానే నిర్వాసితుల సమస్య, దానితోపాటు నిర్వాసితుల ఆందోళనలపై పాశవిక దమనకాండ సాగించటంతో ఇది రాజకీయ అజండాపైకి వచ్చింది. ఈ సమస్యను పాలకులు నష్టపరిహార సమస్యగా కుదించి, మౌలిక విధానాలను చర్చలోకి రాకుండా చేయపూనుకున్నారు. పటాటోపంగా పునరావాస విధానాలను ప్రకటిస్తున్నారు. అయితే సారాంశంలో యివన్నీ నాలుగు డబ్బులు ఎక్కువ పారేస్తే ప్రజలు నోర్మూసుకుంటారన్న దురహంకారంతోనే నిండివున్నాయి.

2009 ఫిబ్రవరిలో రాష్ట్రకమిటీ రాజకీయ తీర్మానాన్ని ఆమోదించిన తర్వాత 2010లోనూ, 2011లోనూ కేంద్రకమిటీ రాజకీయ తీర్మానాలను చేసింది. కేంద్రకమిటీ ఈ సమస్యను చర్చించి తన వైఖరిని స్పష్టపరిచింది. రాష్ట్రకమిటీ తీర్మానంలోని అంశాలను మరింత నిర్దిష్టపరిచింది. 1894 భూసేకరణ చట్టాన్ని రద్దుచేయాలనీ, ప్రైవేటు పెట్టుబడి అవసరాలకు ప్రభుత్వం భూసేకరణ చేయరాదనీ, భూయజమాని అంగీకారంతో అవసరమైన వారు కొనుగోలు చేసుకోవాలనీ, ప్రజాహిత కార్యక్రమాలకు భూసేకరణ తప్పని సరైనప్పుడు, ప్రజామోదం పొందిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణాన్ని తలపెట్టాలనీ, సమగ్ర, శాస్త్రీయ పునరావాసం కల్పించిన తర్వాతే ప్రాజెక్టు నిర్మాణం తలపెట్టాలనీ, బహుళజాతి కంపెనీలను, విదేశీ పెట్టుబడులనూ దేశంలో భూముల కొనుగోలుకు అనుమతించరాదనీ డిమాండు చేసింది.

భూసేకరణకు ప్రజల నుండి ప్రతిఘటన పెరగటంతో కేంద్రప్రభుత్వం పాతచట్టం స్థానంలో 'భూసేకరణ, పునరావాస బిల్లు - 2011'ను ప్రతిపాదించింది. ఇది కొత్త సీసాలో పాత సారాయిగానే వుంది. భూమిని సేకరించే ఏకపక్ష అధికారాన్నీ వదులుకో లేదు; ప్రజాప్రయోజనమన్న దానికీ నిర్వచన మివ్వలేదు. పాతచట్టం ప్రకారం భూసేకరణకు జరుగుతున్న జాప్యాన్ని నివారించాలన్న లక్ష్యంతో కొన్ని సవరణలు చేశారు. పార్లమెంటులో చర్చల తర్వాత దీనిని స్థాయీ సంఘం పరిశీలనకు పంపారు. ప్రైవేటు వారికోసం ప్రభుత్వం భూసేకరణ చేయరాదనీ, ఆదివాసీ ప్రాంతాలలో భూసేకరణ చేయరాదనీ, ప్రజాప్రయోజనమన్న పదానికి నిర్వచనాన్ని కొన్ని నిర్మాణాలకే (ఆస్పత్రులు, రోడ్లు, రైళ్లు, పాఠశాలలు, ఇళ్లనిర్మాణాలు) పరిమితం చేయాలనీ సూచించింది. ఇదికాక కేంద్రం చట్టం చేయరాదనీ, రాష్ట్రాలనే తమ చట్టాలను చేసుకోనివ్వాలనీ, అలా కాకపోతే సమాఖ్య అవగాహనపైనే ఇది దాడి అవుతుందనీ పేర్కొంది. ఈ సూచనలు వివాదాస్పదమై పాలక నేతలు బహిరంగ విమర్శలకు దిగారు. కేంద్ర ప్రభుత్వం ఈ సూచనలను తిరస్కరించాలని నిర్ణయించు కుంది. మరో కొత్త బిల్లును పార్లమెంటులో ప్రవేశ పెడతానని చెబుతున్నది.

పార్లమెంటరీ స్థాయి సంఘం సూచనలు ప్రజలకు అనుకూలంగా వున్నట్లు కన్పిస్తున్నాయి. ప్రజల అశాంతి అదుపు తప్పే శాసనబద్ధ పాలననే ప్రశ్నించే దిశగా సాగుతున్న పరిణామాన్ని గమనించిన పాలకులు ప్రజలలో భ్రమలు కల్పించి ప్రజలను చట్టపరిధిలో ఇరికించేందుకు ఆడుతున్న నాటకమిది. ఏడున్నర లక్షల హెక్టార్లు పరిశ్రమలకూ, రెండున్నర లక్షల హెక్టార్లు సెజ్‌లకు ఇచ్చి ప్రజల జీవనానికి గండి కొట్టారనీ, వ్యవసాయ భూములను కూడా సేకరించటం ఆహారధాన్యాల ఉత్పత్తి దిగజారడానికి ముఖ్యకారణమనీ, దేశ ఆహార భద్రతే ప్రమాదంలో పడిందనీ గ్రామీణాభివృద్ధిశాఖ సర్వేలోనే కరాఖండిగా వెల్లడవగా, ఆ శాఖామంత్రి జయరాం రమేష్ స్థాయి సంఘం సూచనలపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తడమే సమస్యపట్ల పాలకులకు చిత్తశుద్ధి లేదని తెలుపుతున్నది.

ప్రజలు సాగిస్తున్న ఈ పోరాటాలు, పాలకుల వంచనను బయటపెడుతున్నాయి. ప్రజాభిప్రాయసేకరణ తంతునూ ప్రజల కార్యాచరణ బహిర్గతం చేస్తున్నది. ఆర్థిక, సాంస్కృతిక జీవన పునర్నిర్మాణం పునరావాసంలో భాగం కావాలన్న ప్రజల ప్రజాస్వామిక డిమాండును పాలకులు తిరస్కరిస్తున్నారని పోలవరం ప్రాజెక్టు నిర్వాసితుల పోరాటం నిరూపించుతోంది. భూసేకరణను వ్యతిరేకిస్తే బలప్రయోగంతో రక్తం పారించడానికైనా సిద్ధమేనని, విద్యుత్తు కర్మాగారాలు, కాకినాడసెజ్, వాన్‌పిక్ బాధిత రైతాంగంపై సాగించిన నిర్బంధకాండ తెలుపుతున్నది.

కాంగ్రెసుపార్టీలోని ముఠా తగవులతో, రాజశేఖరరెడ్డి హయాంలో భూమినుండి రైతాంగాన్ని బలవంతంగా తొలగించి భూములను దోపిడీ వర్గాలకు అప్పజెప్పి అక్రమార్జనలు గడించిన తీరు బహిర్గతమైంది. ఆనాడూ ఇదంతా తెలిసి చూస్తూ ఊరకున్నవారే నేడు గొంతు చించుకోవటం సంకుచిత ప్రయోజనాల కొరకేతప్ప నిర్వాసిత ప్రజలకు న్యాయం చేసే ఉద్దేశ్యం లవలేశం కూడా లేదని ఉప ఎన్నికల సందడి ముగియగానే కోటిపాం విద్యుత్తు ప్లాంటు నిర్వాసితులపై సాగుతున్న అణచివేత తెలుపుతున్నది. బాక్సైటు గనుల మైనింగ్ లీజులు ఆదివాసుల జీవనాన్ని దుర్భరం చేస్తున్నాయని ఎన్నికల సందర్భంగా విరుచుకుపడిన వారు, ఎన్నికల ముందుగానీ వెనుకగానీ దాని ఊసెత్తుకోలేదు.

కొన్ని శక్తులు ప్రజాందోళనలను పర్యావరణ సమస్యకే పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది చాలదు. అభివృద్ధి ప్రాజెక్టులనే వాటి దోపిడీ లక్ష్యాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. ప్రజా ప్రయోజనాలకు హానికరమైన ప్రాజెక్టులను ఆపివేయాలని డిమాండు చేయాలి. ప్రజాప్రయోజనమంటే ప్రజల ఉమ్మడి ప్రయోజనమనీ, వాటికోసం తప్ప ప్రభుత్వం భూమి సేకరించరాదనీ, భూమి కావాలంటున్న శక్తులు, భూమి హక్కుదారుని అనుమతి మేరకు తామే కొనుగోలు చేసుకోవాలనీ డిమాండు చేయాలి.

## ఐ. ఆదివాసులు

భారతదేశంలో గణనీయ సంఖ్యలో వున్న ఆదివాసులు బ్రిటీష్ పాలనా కాలం నుండీ ఘోరమైన దోపిడీకి, అణచివేతకు గురవుతున్నారు. ఆదివాసుల ప్రధాన ఉత్పత్తి వనరులైన అడవి, భూములపై వారి హక్కులను కాలరాసే అనేక చట్టాలను, బిల్లులను, బ్రిటీష్ పాలకులు ముందుకు తెచ్చారు. భూమి, అడవిపై హక్కు కోసం, బ్రిటీష్ సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా వీరోచిత ఆదివాసీ పోరాటాలు అనేకం వెల్లువెత్తిన సంగతి మనకు తెలిసిందే. అధికార మార్పిడి తర్వాత కూడా ఆదివాసుల భూమి సమస్య అలాగే వుంది. ఇది మరింత పరాయీకరణకు గురయింది. అడవిలోని అటవీ సంపదను; గనులు, ఖనిజసంపదను నేటికీ అనుభవిస్తున్నది దళారీ, దోపిడీశక్తులే. భూమికోసం, జీవించే హక్కు కోసం సాగుతున్న ఆదివాసీ పోరాటాలను అణచివేసేందుకు భూస్వామ్య, దళారీవర్గాలు; నిరంకుశ ప్రభుత్వ యంత్రాంగం నిరంతరం చర్యలు చేపడుతున్నాయి.

ప్రపంచీకరణ విధానాలతో ఆదివాసులపై దాడులు తీవ్రమయ్యాయి. లక్షలాది ఎకరాల అటవీ భూమిని సామ్రాజ్యవాద, బడా బూర్జువా పరిశ్రమలకు అప్పగించి ఆదివాసులను తరిమివేస్తున్నారు. ఇవి వెదురు, కలప వంటి అటవీ ఉత్పత్తులను వినియోగించుకోవటం కోసం అడవిని నాశనం చేసి ప్లాంటేషన్లు పెంచుతున్నాయి. ఆదివాసీ ప్రాంతాల్లో వున్న ఖనిజ వనరులను వినియోగించుకునేందుకు అడవినే కాక మొత్తం భూ, జీవ పర్యావరణాన్ని నాశనం చేస్తున్నాయి. ఇది ఆదివాసుల జీవితాలను ఛిన్నాభిన్నం చేస్తున్నది.

ఆదివాసీ ప్రాంతాల్లో అశాంతి, తిరుగుబాట్ల నేపథ్యంలో ఆదివాసులకు రక్షణ కల్పించే పేరిట 1/70, 7/98 పంచాయితీల విస్తరణ చట్టం, 2005 ఆదివాసీల చట్టం తదితర చట్టాల వంటి అనేక చట్టాలు ఉనికిలోకి వచ్చాయి. పాలకులేనాడూ వీటిని అమలు పరచలేదు. ఈ చట్టాలకు విరుద్ధంగానే ఆదివాసుల భూమి, ఇతర హక్కులు హరించి వేయబడుతున్నా, ప్రభుత్వం ప్రేక్షక పాత్రనే వహించింది. ప్రపంచీకరణ విధానాలతో ఆదివాసీ ప్రాంతాలపై సాగిస్తున్న దాడికి ఈ చట్టాలు పాలకులకు ఆటంకమయ్యాయి. దీనితో కేంద్ర, రాష్ట్రాల ప్రభుత్వాలు మోసపూరిత పద్ధతులతో వీటిని ప్రక్కన పెట్టేందుకు పూనుకొన్నాయి.

అడవిని నాశనం చేసి, ప్లాంటేషను పెంచేందుకు రిలయన్సు కంపెనీకి 75వేల ఎకరాలిచ్చిన ప్రభుత్వం, పోడు వ్యవసాయంతో అడవిని నాశనం చేస్తున్నారంటూ 12 లక్షలమంది ఆదివాసీలను అడవుల నుండి గెంటి వేసేందుకు పూనుకొంది. అస్సాంలో ఆదివాసీల ఇళ్లను ఏనుగులతో త్రొక్కిస్తే, ఆంధ్రప్రదేశ్‌లో గుత్తికోయల గ్రామాలను తగులబెట్టింది. సమతా కేసులో సుప్రీంకోర్టు 'ఏజన్సీ ప్రాంత భూములను గిరిజనేతరుల కివ్వరాద'న్న తీర్పును మాత్రం నిర్వీర్యం చేసే చర్యలు తీసుకొన్నది. ప్రభుత్వమే ఆ భూములను వినియోగిస్తున్నట్లు చూపి, బాక్సైటు తవ్వకాలకోసం జిందాల్ కంపెనీకి యిచ్చింది.

కేంద్ర యుపిఎ ప్రభుత్వం ఒకపక్క ఆదివాసులకు చారిత్రక అన్యాయం జరిగిందని చెపుతూనే అటవీ హక్కుల చట్టాన్ని తెస్తున్నానని ప్రకటించింది. అటవీ హక్కుల చట్టం ముసాయిదాను, దానిపై పార్లమెంటరీ సభాసంఘం, మంత్రివర్గ ఉపసంఘాల సూచనలు, చర్చలు, చివరకు బిల్లు ఆమోదించడం వంటి తతంగాలు జరుగుతున్న సమయంలోనే వన్యప్రాణి రక్షణ ప్రాంతాలుగా ప్రకటిస్తున్నది. దేశంలోని ఏ అటవీ ప్రాంతంలోనైనా పెద్దపులులు, వన్యప్రాణి సంరక్షణ పేర ప్రకటించే అధికారాన్ని, అడవి నుండి గిరిజనులను ఖాళీ చేయించే అధికారాన్ని కట్టబెట్టే చట్టాన్ని కూడా చేపట్టింది. టైగర్ ప్రాజెక్టుల పేరుతో, పాపికొండల అభయారణ్యం, పోలవరం ప్రాజెక్టు నిర్మాణం పేరుతో గిరిజనులను ఆ ప్రాంతం నుండి వెళ్ళగొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తున్నది. పోలవరం ప్రాజెక్టు పేర, ఉభయ గోదావరి, ఖమ్మం జిల్లాల గోదావరి పరివాహక ప్రాంత ఆదివాసీ గ్రామాల ప్రజలను నిర్వాసితులను చేస్తూన్నది.

బొగ్గుగనులు తవ్వకంకోసం ఆదిలాబాద్‌జిల్లాలో రిజర్వు ఫారెస్టును వాడుకునేందుకు ఆదివాసులను ఖాళీ చేయించ చూస్తున్నది. బాక్సైట్ మైనింగ్ పేరిట విశాఖజిల్లా ఆదివాసీ ప్రాంతాలనుంచి ఆదివాసీలను గెంటివేయడానికి రంగం సిద్ధమౌతున్నది. అమెరికా సామ్రాజ్యవాదం కోరుతున్నట్లు మానవరహిత అడవులను ఏర్పరచడానికి పూనుకున్నది.

ఈ దుశ్చర్యలకు వచ్చిన వ్యతిరేకతతో ఆదివాసుల సాంప్రదాయక హక్కులకు గుర్తింపు అన్న పేరుతో బిల్లును తెచ్చింది. ఈ బిల్లుతో ఆదివాసుల హక్కులను కాలరాచే నిరంకుశాధికారాలను ప్రభుత్వం పొందింది. పార్లమెంటరీ కమిటీ, మంత్రిత్వ బృందమంటూ నాటకాలు సాగించి, దీనిపై వచ్చిన సవరణలు వేటినీ ఆమోదించకుండానే చట్టంగా మార్చింది.

ఆదివాసీ ప్రాంతాల్లోకి ఎన్‌జిఓల చొరబాటును పాలకులు ప్రోత్సహిస్తున్నారు. ఆదివాసీలను సంఘటిత పోరాటాలవైపు మరలకుండా, చట్టాలపై భ్రమలు కల్పిస్తూ, వారి తరపున న్యాయపోరాటం చేసేవారిగా ముందుకొచ్చి, జరుగుతున్న పరిణామాల పట్ల ఆదివాసులను ప్రేక్షకులుగా వుంచే పాత్రను ఈ ఎన్‌జీవోలు పోషిస్తున్నాయి.

అయినా ఆదివాసీ ప్రజలు, తమ జీవనోపాధి, జీవన విధానాలపై సాగుతున్న యీ దాడిని ప్రతిఘటించు తున్నారు. జార్ఖండ్, కర్ణాటకల్లోనూ, కేరళలోనూ పాలకుల పాశవిక దమనకాండకు గురయ్యారు. పోలవరం ప్రాజెక్టు ఆదివాసీలకు తెస్తున్న ముప్పుకు వివిధ రూపాలలో నిరసన, ఆందోళనా కార్యక్రమాలు సాగించగా, రాజద్రోహ నేరం మోపి గిరిజన నాయకులను అరెస్టు చేసింది. ప్రజల జీవనంపై తాను సాగిస్తున్న దాడిని ఎదిరించితే సహించేది లేదని హెచ్చరించింది. అడవిపై, అటవీ సంపదపై ఆదివాసులకున్న సాంప్రదాయక హక్కుల వినియోగానికి పీడితుల్లోకెల్లా అధమాధమస్థితిలో ఉన్న గిరిజనుడు నిత్య సంఘర్షణకు గురి అవుతున్నాడు.

## ఓ. దళితులు

పాలకుల విధానాల ఫలితంగా దేశంలో దారిద్ర్యం పెరుగుతున్నది. ఉపాధి అవకాశాలు తరిగిపోతున్నాయి. ఉపాధికి ప్రథమ సోపానమైన విద్యను కొనుక్కోలేక పోవటంతో భవిష్యత్తరాలకు కూడా ఆశలడుగంటి పోతున్నాయి. దళితుల పరిస్థితి నానాటికీ నికృష్టంగా దిగజారుతున్నది.

ప్రత్యమ్నాయ ఉపాధి మార్గాలు మూసుకుపోయి పెత్తందారుల దోపిడీ దౌర్జన్యాలకు గురౌతున్నారు. దేశ వ్యాపితంగా దళితులపై దౌర్జన్యాలు, హింస పెచ్చరిల్లు తున్నాయి. ప్రభుత్వం చూపుతున్న ఏ అభివృద్ధీ, "సాధికారికతా" నినాదాలూ దళితుల స్థితిని మెరుగు పర్చటం లేదు.

రిజర్వేషన్లతో కల్పించిన ఆశలు, విద్యా ఉపాధి రంగాల నుండి ప్రభుత్వం తప్పుకోవటంతో అడుగంటు తున్నాయి. దీనితో ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లు కల్పిస్తామంటూ దళితులలో మళ్లీ ఆశలు కల్పించే ప్రచారం సాగించుతున్నారు. దళితులకు సాధికారికత సాధిస్తా మంటూ పంచాయితీ వ్యవస్థలో రాజకీయ రిజర్వేషన్లు కల్పించారు. విద్యా, ఉద్యోగ రిజర్వేషన్లలో వర్గీకరణ పేరిట ఆంధ్రప్రదేశ్‌లో మాల మాదిగల మధ్య వైషమ్యాలను రగిల్చారు. ఆర్థిక సంస్కరణలు ఉధృతంగా అమలు జరుగుతున్న కాలంలోనే వాటి దుష్ఫలితాలు ఎక్కువగా అనుభవించే దళితుల దృష్టిని, వాటి నుండి మళ్లించే ప్రయత్నాలే యివని అర్థమౌతున్నది.

అయితే దళితులు ఈ పరిణామాలను అనుభవం నుండి గమనిస్తున్నారు. ఆశలు రేకెత్తించే నినాదాలు తప్ప ఉపశమన చర్యలు కూడా దరికి చేరటం లేదనీ, పిల్లల కన్నా మంచి జీవితం ఏర్పడుతుందన్న ఆశతో ఎదురుతెన్నులు చూడటం తప్ప, ఉన్న అవకాశాలు కూడా మూసుకుపోతున్నాయని గమనిస్తున్నారు. "ఆరు నెలలు సాము గారిడీలు చేసి....." అనే సామెతలా అందరూ వున్నత స్థాయి నాయకులే, ప్రైవేటు రంగంలో రిజర్వేషన్లను తగిన నిపుణత్వ సాధనకు శిక్షణతో ముడిపెట్టి తప్పించారే తప్ప, చట్టంతో అమలు జరప పూనుకోలేదు. అన్ని పక్షాలకూ అంగీకారమే అయినా ఎస్సీల వర్గీకరణకు మాత్రం అడుగడుగునా అడ్డంకులే. దళిత శక్తుల మధ్య ఐక్యత రానీయకుండా వారి మధ్య చీలికలను పెంచుతూ వర్గీకరణ సమస్యను జటిలపరుస్తున్నారు. పంచాయితీలకు చట్టబద్ధ హక్కులనూ, నిధులనూ యివ్వకుండా, రోటేషన్‌తో అమలవుతున్న రిజర్వేషన్లు - దళితుల సాధికారితను సాధించకపోగా, దళితులనుండి స్థిరమైన ప్రజాపునాదితో రాజకీయ నేతల ఆవిర్భావాన్ని అడ్డుకుని నిరంతరం పెత్తందారీ వర్గాలకనుసన్నలలోనే మెలగవలసిన స్థితిని కల్పిస్తున్నది.

దీనితో దళితులలో తమ పురోగమనానికి ఆటంకాలేమిటో, వాటి పరిష్కారాలేమిటో గమనింపు పెరిగింది. వారు భూమి సమస్యను, ఉపాధి సమస్యను ముందుకు తెస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా లక్షింపేట దళితులపై ఇటీవల సాగిన దమనకాండకు భూమి కావాలన్న దళితుల డిమాండ్ మూలంగావుంది.

దోపిడీ పాలకవర్గాలు దళితులను మళ్లీ భ్రమల్లో ముంచేందుకు పూనుకుంటున్నాయి. ఉన్నత విద్యా సంస్థల్లో రిజర్వేషన్లను ముందుకు తెచ్చి వారి దృష్టిని మళ్లించే ప్రయత్నం చేశాయి. మత మార్పిడుల సమస్యను సృష్టించి మతోన్మాదాన్ని రేకెత్తించేందుకు పాలకవర్గపు ఒక ముఠా నగ్నమైన ప్రయత్నం చేస్తుండగా, దళిత గోవిందం, హరిజనుల ఆలయ ప్రవేశమంటూ మరొక ముఠా నాజూకైన ప్రయత్నాలు చేస్తున్నది.

పాలకులు విసురుతున్న ఆశల వలలో చిక్కుకు పోకుండా దళితులను చైతన్యపరచి, పేద ప్రజలందరి మధ్య ఐక్యతను సాధించి, వారిని కులవివక్ష, కుల అణచివేత వ్యతిరేక పోరాటాలలో సమీకరించడంతోపాటు వర్గ పోరాటాలలో సంఘటితపరిచే మన కృషిని మరింత తీవ్రం చేయాలి.

## ఔ. మహిళలు

స్త్రీలపై సామాజిక గృహహింసలు నిత్యకృత్య మయ్యాయి. మహిళలపై ఫ్యూడల్ పెత్తనంలో భాగమైన పురుషాధిపత్యం, వేధింపులు, దాడులు నిత్యజీవితంలో భాగమైనాయి. పితృస్వామిక అణచివేత, పేద, దళిత మహిళలపై-ముఖ్యంగా యువతులపై అత్యాచారాలు, దాడులు నిత్యకృత్యంగా వున్నాయి. వివిధ మహిళా సంఘాల ఒత్తిడులవలన వీటి నుంచి రక్షణ కోసమంటూ ప్రభుత్వాలు తెచ్చిన చట్టాలు సమస్యను పరిష్కరించకపోగా మరింత జటిలం చేశాయి.

వ్యవసాయరంగ సంక్షోభం ఫలితంగా కష్టజీవులు పనులు వెతుక్కుంటూ పట్టణాలకు, ఇతర ప్రాంతాలకు వలసపోతున్నారు. వలస కూలీలుగా ఉన్న మహిళలకు కనీసవేతనం, సమాన వేతనాల లభ్యత విషయం ప్రక్కన పెడితే కనీసపాటి భద్రత, సౌకర్యాలు, పని గ్యారంటీ కూడా లేకుండా వుంది. ఆదివాసీ మహిళలు నేటికీ ఎంతో హింసతో కూడిన శ్రమ చేస్తూ జీవిస్తున్నారు. రోజువారీ పనులు వెతుక్కుంటూ లేబర్ మార్కెట్‌కు వచ్చిన అమ్మాయిలను బ్రోకర్లు పని ఇప్పిస్తామని మోసపుచ్చి, ఆశపెట్టి, ప్రలోభపరిచి వ్యభిచారంలోకి దింపుతున్న సంఘటనలు తక్కువగా లేవు. పట్టణాలలో సైతం శ్రామిక మహిళలు, ఎంతో కొంత చదువుకున్న మహిళలు కూడా అసంఘటిత రంగంలో ఏ హక్కులూ, సౌకర్యాలూ లేకుండానే పనిచేస్తున్నారు. పాలకులకు కూడా కావలసింది ఇదే. మార్కెట్‌లో చౌకగా లేబర్‌ను పొందటానికి ఎటువంటి మహిళలు అవసరమో, వారికి ఎంత మేరకు విద్య, నైపుణ్యాలు అవసరమో, అంతమేరకు మాత్రమే పథకాలను అందిస్తున్నారు.

మహిళల్లో చదువుకుంటున్న, ఉద్యోగాలు చేస్తున్న వారి సంఖ్య గతం కంటే గణనీయంగా పెరిగినప్పటికీ స్వతంత్ర వ్యక్తిత్వంతో, సరైన చైతన్యంతో, ఆర్థిక స్వాతంత్ర్యంతో గడపగల జీవితాలకు వారు ఇంకా చాలా దూరంలో వున్నారు. పెరుగుతున్న ఆర్థికావసరాలు, తగ్గుతున్న పని భద్రతల మధ్య మహిళలు, వివిధ వృత్తుల్లో, ఉద్యోగాల్లో ప్రవేశించటం పెరిగింది. అదే సమయంలో, వారిపై వున్న పురుషస్వామ్యం, మూఢనమ్మకాలు అలాగే వున్నాయి. అన్ని స్థాయిల వృత్తుల్లో నిలదొక్కుకోవడానికి మహిళలు ఎన్నో రకాలుగా సంఘర్షణ పడుతున్నారు.

***అధిక ధరలు మధ్యతరగతి ప్రజల జీవనాన్ని దుర్భరం చేస్తున్నది. విద్య, వైద్య రంగాల ప్రైవేటీకరణతో అసలే అందుబాటులో లేని ధరలతో కడుపు కట్టుకుని నిల్వచేసుకున్న ఆదాయాన్ని ప్రైవేటు బడులకూ, ఆస్పత్రులకూ ధారపోస్తున్నారు. అధిక ధరలతో ఏర్పడిన దుర్భరపరిస్థితిని ప్రజాందోళనను నిర్మించే, వాటిని రాజకీయ పోరాటాలుగా మలిచేందుకు కృషిని తీవ్రం చేయాలి.***

వీరి సంఘర్షణకు సమాజం నుండి సరైన, తగిన మద్దతు రావడం లేదు. కుటుంబ, సామాజిక వ్యవస్థల్లో ఫ్యూడల్, సామ్రాజ్యవాద దోపిడీ సంస్కృతులు, హీన విలువలు చలామణిలో వుంటున్నాయి. పేద, దళిత స్త్రీలకు అనేక హక్కులు నిరాకరించబడుతూనే వున్నాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ, వ్యవసాయరంగ సంక్షోభం-ప్రతిదీ మహిళల జీవితాలను, ముఖ్యంగా కష్టజీవి మహిళల జీవితాలను-మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయి.

ఆదివాసీ ప్రాంతాల్లో విప్లవకారుల అణచివేతకై జరుగుతున్న కూంబింగ్ ఆపరేషన్‌లలో ఆదివాసీ మహిళలపై అత్యాచారాలు సర్వసాధారణమైన విషయం. విశాఖ జిల్లా ఏజన్సీ గ్రామం వాకపల్లి గిరిజన మహిళలపై విప్లవకారుల అణచివేతకై కూంబింగ్ ఆపరేషన్‌ల కెళ్లిన పోలీసులు జరిపిన అత్యాచారం నేటి తాజా ఉదాహరణ. ఏ ప్రజా పోరాటంలోనైనా సైనికుల, పోలీసుల దృష్టి మహిళలపైనే. వారిని వేధింపులకు, అత్యాచారాలకు గురిచేయడం అన్నది, పాలకవర్గాలు ప్రజలను అణచివేసే విధానానికి సంబంధించింది. అలాగే వారు నిలబెట్టి పెంచి పోషించుకుంటూ వస్తున్న సంస్కృతి, భావజాలాలే మూలం.

ఇటీవల వీరిపై భౌతిక, లైంగిక దాడులు పెరుగుతున్నాయి. పెచ్చరిల్లుతున్న క్షీణ సంస్కృతి, ప్రభుత్వ యంత్రాంగపు నిర్లక్ష్య వైఖరి వీటికి కారణంగా ఉన్నది. మార్కెట్ మీడియా పోటీలో స్త్రీల శరీరాలను వ్యాపార సరుకుగా మార్చటం విపరీతమైంది. రాజకీయ, ఆర్థిక వ్యవస్థ సంక్షోభపు వ్యక్తీకరణగా ఇది వుంది. ఈ విధంగా స్త్రీలు గురౌతున్న వివక్ష, అణచివేత దాడులకు, దృశ్యమాధ్యమాలపై వారిని అశ్లీలంగా చిత్రీకరించడానికి వ్యతిరేకంగా వారిని ఉద్యమాల్లోకి సంఘటిత పరుస్తూ వారిపై గల ఫ్యూడల్ సంస్కృతి, హీన వాణిజ్య సంస్కృతి ప్రభావాల నిర్మూలనకు ప్రజలందర్నీ చైతన్యపరచాలి.

## 2. పారిశ్రామిక రంగం

రాష్ట్ర పారిశ్రామికాభివృద్ధి అస్తుబిస్తుగానే వుంది. పరిశ్రమాభివృద్ధికి అవసరమైన మౌలిక సదుపాయాలు నిర్మిస్తున్నామంటూ రోడ్లు, రేవులు, విమానాశ్రయాలు, విద్యుత్తు ప్లాంటుల నిర్మాణం, సెజ్‌ల పేరిట భూముల పందేరం, అక్రమ మార్గాల్లో ప్రజాధనాన్ని దిగమింగారు తప్ప, పరిశ్రమల స్థాపన జరుగలేదు. నిరంకుశాధికార పెట్టుబడితో కోట్లకు పడగలెత్తుతున్నారుగానీ పరిశ్రమల స్థాపన లేదు. ప్రభుత్వ కాంట్రాక్టులలోనూ, సారావ్యాపారం లోనూ పోగుపడుతున్న ధనం పరిశ్రమల్లోకి ప్రవహించే ప్రయత్నాలేవీ లేవు. రియలు ఎస్టేట్, పెట్టుబడి మదుపుకు స్థానమయ్యింది. ఫలితంగా భూముల రేట్లు విపరీతంగా పెరిగి సెంటుభూమి కూడా కొని ఇళ్లు కట్టుకునేందుకు మధ్యతరగతులకు కూడా అవకాశం లేకుండా పోయింది.

రాష్ట్రంలో అపార ఖనిజ వనరులను కారుచౌకకు సామ్రాజ్యవాద కంపెనీలకు ధారాదత్తం చేస్తున్నారు. వీటినాధారం చేసుకుని ఒక్క భారీపరిశ్రమ కూడా నెలకొల్పక పోగా కారుచౌకగా వీటిని కొల్లగొడుతున్నారు. ఈ వైఫల్యాన్నంతా అవినీతి సమస్యగా చిత్రిస్తున్నారుగానీ, ఇనుప ఖనిజం ఎగుమతుల కొరకు వాడకుండా ఉక్కుమిల్లు పెట్టివుంటే జరిగే పారిశ్రామికాభివృద్ధితో పోల్చి చూస్తే రాష్ట్ర ప్రజాప్రయోజనాలపట్ల పాలకుల పట్టనితనం ఎంతటి నేరపూరితమో అర్ధమౌతుంది.

సామ్రాజ్యవాద పెట్టుబడులకు పట్టంకట్టడంతో రాష్ట్రంలో ఏర్పడిన పరిశ్రమలు కూడా వారి ఆధీనంలోకి వెళ్లిపోతున్నాయి. రాష్ట్రంలో ఏర్పడిన సిమెంటు పరిశ్రమ బడాబూర్జువా, విదేశీ కంపెనీల గుత్తాధిపత్యంలోకి వెళ్ళింది. విపరీత ధరలకు అమ్మి సూపర్ లాభాలు గడిస్తున్నాయి. వీటిలో మూడు కంపెనీలు గుత్తాధిపత్యంతో ధరలను పెంచివేశాయని, 6307 కోట్ల రూ॥లు కాంపిటీషన్ కమీషన్ ఆఫ్ ఇండియా పెనాల్టీగా విధించవలసి వచ్చిందంటే ఇవి ఎంతగా దోపిడీ సాగిస్తున్నాయో అర్ధమౌతుంది.

కేంద్రం అనుసరిస్తున్న విధానాలతో మరో ముఖ్య పరిశ్రమ ఫార్మా కూడా విదేశాల పరమయ్యేక్రమం మొదలైంది. ఇవి త్వరలోనే వారి చేతుల్లోకి వెళ్లిపోయి మందుల ధరలు విపరీతంగా పెరుగుతాయి. వీటిలో పెద్దదైన రెడ్డిల్యాబ్స్ వంటివి కూడా క్లినికల్ ట్రయల్సు వంటి రంగాలలోకి వెళ్లటం, విదేశీ కంపెనీలకు బంధిత ఉత్పత్తిదారులుగా మార్కెటింగ్ ఏజన్సీలుగా ఉండటానికి సిద్ధపడటం దేశ పారిశ్రామికరంగంపై సామ్రాజ్యవాదుల పట్టునే తెలుపుతున్నది.

మధ్యతరహా పరిశ్రమలు సమస్యలతో మూసివేతల వైపుగా నడుస్తున్నాయి. విద్యుత్తు కొరత దీనిని త్వరితం చేస్తున్నది. సామాన్య ప్రజల వినియోగ సరుకులను చౌకధరలకు అందిస్తున్న చిన్న పరిశ్రమలు గుత్త కంపెనీలనుండి పోటీకి తట్టుకోలేక అనేక సమస్యల పాలవుతుండగా, విద్యుత్తు కొరత వీటి మూసివేతలకు దారితీసింది.

***ఆదివాసీ ప్రాంతాల్లోకి ఎన్‌జిఓ చొరబాటును పాలకులు ప్రోత్సహిస్తున్నారు. ఆదివాసీలను సంఘటిత పోరాటాలవైపు మరలకుండా, చట్టాలపై భ్రమలు కల్పిస్తూ, వారి తరపున న్యాయపోరాటం చేసేవారిగా ముందుకొచ్చి, జరుగుతున్న పరిణామాల పట్ల ఆదివాసులను ప్రేక్షకులుగా వుంచే పాత్రను ఈ ఎన్‌జీవోలు పోషిస్తున్నాయి.***

### అ. మౌలిక నిర్మాణాల రంగం

రోడ్లు, రైల్వేలు, రేవులు, విద్యుత్తువంటి మౌలిక నిర్మాణాల రంగం అభివృద్ధి చెందితేనే ప్రగతి సాధ్యమౌతుందన్నది నిర్వివాదం. అయితే ఈ పేరిట పాలకులు కంటికి కన్పించిన భూమినంతా ఆక్రమించుకునేందుకు పూనుకున్నారు తప్ప, వీటిని అభివృద్ధి చేసింది లేదు.

జాతీయ రహదారులను విస్తరించి మోటారు వాహనాల అమ్మకాలను పెంచారు. టోలుగేటు వసూళ్లతో ప్రజలపై భారాలు మోపి, అవసరం లేకపోయినా విస్తరించిన వాటినే మళ్లీ విస్తరిస్తూ టోలు భారం పెంచుతూ ఆశ్రిత వర్గాలకు ధనం సంచులు పంచుతున్నారు. కాగా మిగిలిన రాష్ట్ర, జిల్లా రహదారులన్నీ అస్తవ్యస్థ స్థితిలోనే వున్నాయి.

కొత్త రేవుల నిర్మాణం పేరిట భూములు పందేరం సాగింది తప్ప, ఆ రేవు అవసరముందా లేదా అన్నది పట్టించుకోలేదు. రేవుల పేరిట రైతాంగం నుండి వేలాది ఎకరాలు గుంజుకుని వీరి కప్పజెప్పారు. నాడా దొరికింది గనుక గుర్రం కొంటానన్న చందంగా రేవుల కోసం విద్యుత్తు ప్రాజెక్టులకు అనుమతులిచ్చారు. ఇనుప ఖనిజం ఎగుమతులు తగ్గేస్థితిలో కృష్ణపట్నం రేవువద్ద 34 పవర్ ప్లాంటులకు అనుమతినిచ్చి నెల్లూరు జిల్లా బూడిదకుప్పగా మారే ప్రమాదాన్ని తెచ్చి పెట్టారు.

దేశంలో బొగ్గు నిక్షేపాలను కారుచౌకగా దోపిడీ వర్గాలకు అప్పజెప్పారు. అయినా బొగ్గును తవ్వి తీయకుండా అధిక ధరలకు విదేశాల నుండి దిగుమతి చేసుకుంటుంటే చూస్తూ వూరకుండి, విద్యుత్తు ప్లాంటులకు సిఏఓఎల్ బొగ్గు సరఫరాలో విఫలమైందని వక్రభాష్యం చెబుతున్నారు. ఈ భారమంతా అధిక ఛార్జీలతో ప్రజలపై మోపుతున్నారు.

చమురు, సహజ వాయువు నిక్షేపాల వెలికితీత రంగాన్ని ప్రైవేటీకరించి, ప్రజల సమష్టి వనరులను ధారాదత్తం చేశారు. సహజవాయువు వెలికి తీయటానికయిన వ్యయాన్ని తప్పుడు లెక్కలతో చూపి రిలయన్సు కంపెనీకి గ్యాసు ధరను 1.80 డాలర్ల నుండి 4.25 డాలర్లకు పెంచారు. అనుకున్న గ్యాసు పడనందున ఖర్చును తిరిగి రాబట్టుకోవాలంటే మళ్లీ ధర 9 డాలర్లకు పెంచాలంటూ రిలయన్సు కంపెనీ వాదిస్తున్నది. రిలయన్సువి తప్పుడు లెక్కలన్న డైరక్టర్ ఆఫ్ హైడ్రో కార్బన్స్‌ను ఆ పదవి నుండి తప్పించింది. రిలయన్సులో వాటాలున్న బ్రిటిషు పెట్రోలియం కంపెనీ దిగుమతి చేసుకుంటే అయ్యే ధరనే (12 డాలర్లు) ఇవ్వాలంటూ వాదించింది. బ్రిటిషు పెట్రోలియం కంపెనీ తనవాటా దారుల జనరల్ బాడీ సమావేశానికిచ్చిన నివేదికలో గ్యాసు ఉత్పత్తి ఖర్చు యూనిటుకు ఒక డాలరు కంటే తక్కువుందని తెలిపింది. ఈ విదేశీ, మిలాఖత్తు కంపెనీలకు ఎంత పెద్ద యెత్తున లాభాలు సమకూర్చి పెడుతున్నారో అర్ధమౌతుంది. యూనిటుకు 9 డాలర్ల రేటునే ఖరారు చేస్తే, దాని నుండి తయారయే యూరియా రేటు సగానికి పైగా పెరుగుతుంది; విద్యుత్తు యూనిటు 9 రూ॥ అవుతుంది. ప్రజల మూలుగులు పిండి దోపిడీ వర్గాలకు లాభాలు కట్టబెట్టడమే లక్ష్యంగా ప్రభుత్వ విధానం వుంది.

ఈ అధిక ధరలు చెల్లించక తప్పదన్న భావనను కలింగించటానికే విద్యుత్తు సంక్షోభాన్ని సృష్టించారు. 'తాటిచెట్టెందుకెక్కావంటే దూడ మేత కోసమ'న్న చందంగా కేజీ బేసిన్ గ్యాసు రాకపోవటమన్న వితండ వాదన చేస్తున్నారు. విద్యుదుత్పత్తి ప్లాంటులకు గ్యాసు సరఫరా గత ఏడాది జరగలేదన్న నిజాన్ని కప్పిపుచ్చారు. అదివచ్చివుంటే లోటు పూడేదనటమే ప్రభుత్వ మోసకారి తనాన్ని తెలుపుతున్నది.

మౌలిక నిర్మాణాలూ, సహజవనరుల రంగంలో ప్రభుత్వం చూపుతున్నానంటున్న శ్రద్ధ అంతా విదేశీ, స్వదేశీ దోపిడీదారులకు లాభాలు కట్టబెట్టేందుకే తప్ప, ప్రజల అవసరాలూ, దేశ ప్రయోజనాలూ నెరవేర్చేందుకు కాదు.

### ఆ. సేవా రంగం

వ్యవసాయ పారిశ్రామిక రంగాల అభివృద్ధి ననుసరించి సేవారంగంలో అభివృద్ధి వుంటుంది. ప్రభుత్వ యంత్రాంగం, ద్రవ్యవ్యవస్థ, హోటళ్లు, రవాణా, ఇటీవలి సాఫ్ట్‌వేర్ ఈ రంగంలోకి వస్తాయి. గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి తగ్గిపోవటం, పారిశ్రామిక ఉపాధి కుచించుకు పోవటంతో సేవారంగమే ఉపాధి మార్గమైంది. రోడ్డు ప్రక్క తినుబండారాల అమ్మకం, రిక్షాలు, ఆటోలు నడపటం, ఇంటిపని మొదలగు రంగాలే పట్టణాలలో పేదలకు ఉపాధి మార్గమయ్యాయి. అయితే ఇదంతా ప్రభుత్వ గణాంకాలలోకి చేరని అసంఘటిత రంగమే.

సంఘటిత సేవారంగంలో పెరుగుదల బ్యాంకులు, ఇన్సూరెన్సులు, స్టార్ హోటళ్లు, సాఫ్ట్‌వేర్ రంగాల్లో జరిగింది. ద్రవ్య పొదుపు రంగం పెరుగుదల, విదేశీ కంపెనీలను అనుమతించటంతో జరిగింది. ఇది కాంట్రాక్టు పద్ధతిన ఉద్యోగాలు కల్పించింది. ప్రజల పొదుపు మొత్తాల పెరుగుదల సగటు స్థాయిలో వున్నది. కాగా యిన్నాళ్లూ ప్రభుత్వ సంస్థలలోకి వెళుతున్న ఈ పొదుపు ద్రవ్యంలో కొంతభాగం విదేశీ ప్రైవేటు కంపెనీలకు మరలి పెరిగినట్లు కన్పిస్తున్నది. అంతేకాక ప్రజల పొదుపు సొమ్ము విదేశీ కంపెనీల వద్ద చేరి, వారి లాభార్జనకు పెట్టుబడిగా వున్నది తప్ప ప్రజల అవసరాలకు పెట్టుబడిగా ఉపయోగపడటం లేదు. ప్రస్తుత సంక్షోభంతో ఇవి ఉద్యోగుల సంఖ్యను తగ్గించే వైపుగా చర్యలు తీసుకుంటున్నాయి.

ఇక స్టార్ హోటళ్లన్నీ విదేశీ పర్యాటకుల పైనే ఆధారపడి వున్నాయి. పర్యాటకులు పెరగటంతో హోటలు మేనేజ్‌మెంటు విద్య నేర్పే కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ప్రస్తుత సంక్షోభం దీన్ని కూడా చుట్టుముట్టింది. పొదుపు చర్యల పేరిట ఉద్యోగాలను, వేతనాలను తగ్గించుతున్నాయి.

ఇక సాఫ్ట్‌వేర్ రంగం. దీనిని సర్వరోగ నివారిణిగా చిత్రించారు. లక్షలు వెచ్చించి, ఏ కాలేజీలో చదువుకున్నా చివరకు సాఫ్ట్‌వేర్ రంగానికే మొగ్గారు. ఈ రంగం నుండి విదేశీ మారక ద్రవ్య ఆర్జన పెరిగింది. ఇదే మొత్తం సమాజాన్ని అభివృద్ధి పథం వైపు తీసుకెళ్తుందని ఊదరగొట్టారు. దేశీయ, పారిశ్రామిక పునాది లేకుండా పూర్తిగా విదేశీ అవసరాలను తీర్చటంపై ఆధారపడ్డ ఈ రంగం భవిష్యత్తులో సంకట స్థితిని తెస్తుందన్న హెచ్చరికలూ పట్టించుకోలేదు. ప్రస్తుత సంక్షోభంతో ఈ రంగం చతికిలబడింది. కంపెనీలు ఉద్యోగాల, వేతనాల తగ్గింపుకు దిగటంతో భద్రజీవన పగటికల బ్రద్దలయింది. మరోవైపు విదేశీ కంపెనీలే స్వయంగా బ్రాంచీలనేర్పాటు చెయ్యటం, లేదా ఇక్కడి కంపెనీలను కొనివేయటానికి పూనుకోవటంతో ఈ రంగం మొత్తంగానే సామ్రాజ్యవాదుల కబంధహస్తాల్లోకి పోయే దిశలో వున్నది.

ఇక రవాణారంగంలో లారీల ద్వారా రవాణా నిరంతరం ఎగుడుదిగుడులకు లోనవుతూ, రెండు మూడు లారీలతో స్వయం ఉపాధి కల్పించుకోలేని స్థితికి చేరుతున్నాయి. ట్రాన్సుపోర్టు కంపెనీలు మాత్రమే ఉండగలిగే స్థితి ఏర్పడుతున్నది. ఇక ఆర్‌టిసి ఉద్యోగుల సంఖ్య తగ్గింపు, అద్దె బస్సుల వినియోగంతో ప్రైవేటు దిశగా నడుస్తున్నది. ప్రైవేటు బస్సుల సిబ్బంది, తక్కువ వేతనాలతో అధిక సమయం పని చేయాల్సి వస్తున్నది. ఇక ఆటోల వంటి స్వయం ఉపాధి కూడా ఫైనాన్సు కంపెనీలకు కిస్తీలు కట్టేందుకే చాలక, రిస్కు తీసుకుని నడపటంతో ప్రమాదాల బారిన కూడా పడుతున్నారు. వాహన తయారీదారులు, ఫైనాన్సు కంపెనీలు బాగుపడుతున్నాయి తప్ప, చిన్న వాహనదారులకు వారి శ్రమ కూడా మిగలటం లేదు.

విద్యుత్తు సరఫరా రంగం కూడా ప్రైవేటీకరణ జరగటంతో ఉద్యోగవకాశాలు పెరిగినట్లు కన్పడినప్పటికీ, కాంట్రాక్టీకరణతో (లైనుమెన్‌లు, మీటరు రీడింగు, బిల్లుల వసూలు) అత్యంత ప్రమాదకర పరిస్థితుల్లో, అతితక్కువ వేతనాలతో మాత్రమే పని చేయాల్సి వస్తున్నది.

దేశీయ వ్యవసాయ, పారిశ్రామిక అభివృద్ధితో సంబంధం లేకుండా, విదేశీ అవసరాలను తీర్చే విధంగా సేవారంగాన్ని మరల్చటంతో, దాన్ని అభివృద్ధి అని చిత్రించినదంతా వాపు తప్ప బలం కాకుండాపోయింది. ఎక్కడ ఏ కారణంతో సంక్షోభం ఏర్పడినా అల్లాడిపోయే పరిస్థితి, దాని నుండి బయటపడవేయటం కోసం ప్రజాధనాన్ని వెచ్చించవలసిన దుస్థితిలో ప్రభుత్వాలు పడటం మన కళ్లముందు కన్పిస్తున్నాయి. ప్రపంచబ్యాంకు నిర్దేశిత అభివృద్ధి పథకం యథాతథంగా అమలు చేసి, సాధించిన ప్రగతి గాలి బుడగ తప్ప మరేమీ కాదన్నది, ఈ సేవారంగం స్పష్టంగా చూపెడుతున్నది.

### ఇ. ఉపాధి కల్పన-నిరుద్యోగం

ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించే చర్యలతో ఉపాధి కల్పనా రంగం నుండి ప్రభుత్వం తప్పుకుంటున్నది. ప్రభుత్వరంగ సంస్థలను మూసివేయటమో, అమ్మి వేయటమో చేసింది. మిగిలిన ప్రభుత్వ పరిశ్రమల్లో (ఆర్టీసీ, జెన్‌కో॥) ఉద్యోగుల సంఖ్యను తగ్గించివేస్తోంది. క్రిందిస్థాయి ప్రభుత్వ ఉద్యోగుల విధులను కాంట్రాక్టు కిస్తున్నది. గ్రూపు 1,2 ఉద్యోగాలకు ప్రకటనలివ్వటం, పరీక్షలు జరపటం, సెలక్షను లిస్టులు తయారుచెయ్యటం, చివరకు నియామకాలు యివ్వక పోవటం, ఏదో వంకతో కోర్టులకెక్కటం, నిరుద్యోగుల పాలిట క్రూర పరిహాసంగా మారింది. ప్రైవేటీకరణను దొడ్డిదారిన ప్రవేశపెడుతున్నారు. అద్దె బస్సులను ఆర్టీసి బస్సులుగా నడుపుతూ మోసం చేస్తున్నారు. ప్రభుత్వం ప్రత్యక్షంగా ఉపాధి కల్పన చెయ్యరాదనీ, ఉపాధి అవకాశాలను పెంచే ఆర్థిక కార్యకలాపాలకు పరిమితం కావాలన్న వాదనతో వ్యవహరిస్తున్నది. ఈ వాదనతో తీసుకుంటున్న చర్యలు-పునాదిరంగ నిర్మాణాలను చేపట్టడం, పరిశ్రమలకు రాయితీలు - వల్ల ఏర్పడిన ఉపాధికన్నా నిర్వాసితుల సంఖ్యే ఎక్కువగా వుంది.

ప్రైవేటు రంగంలో ఆర్గనైజ్డ్ రంగంలో ఉపాధి తగ్గిపోతున్నది. ఈ రంగంలో కార్మిక, ఉద్యోగుల సంఖ్య తగ్గిపోతున్నది. గణాంకాలలో ఉపాధి కల్పన మాత్రము పెరుగుతున్నట్లు కన్పించటానికి, కాంట్రాక్టు కార్మికుల సంఖ్యను పెంచటమే కారణం. ఏ హక్కులూ లేని కాంట్రాక్టు పనులు మాత్రమే పెరుగుతున్నాయి.

2011 మార్చినాటికి సంఘటిత రంగంలోవున్న సంస్థలు 20,867. వీటిలో 13,814 ప్రభుత్వ రంగంలో వుండగా, 7,053 ప్రైవేటు రంగంలో వున్నాయి. మొత్తం 20.6 లక్షలమంది వీటిలో ఉపాధి పొందుతున్నారు. వీరిలో 12.8 లక్షలమంది ప్రభుత్వ రంగంలోనూ 7.8 లక్షలమంది ప్రైవేటు రంగంలోనూ వున్నారు. సంఘటితరంగంలో కల్పించవలసిన సౌకర్యాలన్నింటినీ కార్మికులకు ఎగ్గొట్టేందుకు చట్టఉల్లంఘన ఎంతగా సాగుతున్నదో ఈ అంకెలు తెలుపుతున్నాయి. హైద్రాబాదు నగరంలోవున్న ఏ ఒక్క ఇండస్ట్రియలు ఎస్టేటును తీసుకున్నా ఇంతకన్నా ఎక్కువ ప్రైవేటురంగ సంస్థలుంటాయి.

అలాగే దేశ సగటు కంటే రాష్ట్రంలో నిరుద్యోగిత తగ్గిందన్న ప్రభుత్వం చెప్పిన గణాంకాలు చూడండి. ఎంప్లాయిమెంటు ఎక్స్చేంజీల్లో 2011 సెప్టెంబరు నాటికి 18,33,231 మంది నిరుద్యోగులు రిజిస్టరు అయివున్నారు. (దాదాపు కుటుంబానికొకరు సగటున). 2011-12 ఏడాదిలో 2011 సెప్టెంబరు వరకూ 1,44,553 మంది రిజిస్టరు చేసుకున్నారు. కాగా ఆ ఏడాది అదే కాలానికి 4156 ఖాళీలకు కోరిన అభ్యర్థులను ఎక్స్చేంజీలు పంపగా 816 మందికి నియామకాలు వచ్చాయి. ఇది నిరుద్యోగ సమస్య తీవ్రతను తెలుపుతున్నది.

### కార్మికులు

గత రెండు దశాబ్దాల కాలంగా అమలు జరుపబడుతున్న సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాల పర్యవసానంగా రాష్ట్రంలోని కార్మికులు పలు రూపాల్లో దోపిడీకి గురిచేయబడుతున్నారు. చట్టబద్ధంగా కార్మికులకు సంక్రమించిన హక్కులు నిరాకరింపబడుతున్నాయి. ప్రభుత్వరంగం ప్రైవేటీకరణ, కాంట్రాక్టీకరణ, ఔట్‌సోర్సింగ్ విధానాలను అమలుజరుపుతూ, శాశ్వత ప్రాతిపదికపై కార్మికులు/ఉద్యోగులుగా పనిచేసేవారిని కనీసస్థాయికి కుదించివేయటం జరిగింది. పనులలో ఎక్కువ భాగాన్ని ఔట్‌సోర్సింగ్‌కు, కాంట్రాక్టుకు యివ్వటంతో, ప్రభుత్వ రంగంలో, పనిచేసే ప్రైవేటు (కాంట్రాక్టు) కార్మికుల సంఖ్య గణనీయంగా పెరిగిపోయింది. మొత్తం శ్రామికుల్లో 94శాతం మంది అనియత రంగంలోనే వున్నారు.

మరోవైపు ప్రైవేటురంగంలో కార్మిక చట్టాలు యధేచ్ఛగా ఉల్లంఘింపబడుతూ, కాంట్రాక్టు విధానం ముమ్మరం చేయటం జరిగింది. వీటి పర్యవసానంగా ఎటువంటి చట్టబద్ధమయిన హక్కులూ, సౌకర్యాలూ లేని కాంట్రాక్టు కార్మికుల సంఖ్య అనూహ్య పరిణామాలకు పెరిగిపోయింది. నియత, అనియత రంగాలన్నిటా (సంఘటిత, అసంఘటిత రంగాలు) ఎటువంటి హక్కులూ లేని కార్మికుల సంఖ్య చాలా ఎక్కువ సంఖ్యలో వున్నారు. వీరికి కనీస వేతనాలుగానీ, నిర్దిష్ట పనిగంటలుకానీ, నిర్దిష్ట పనిభారంకానీ, పని ప్రదేశాలల్లో భద్రతకానీ, వారాంతపు శెలవుకానీ, ఉద్యోగభద్రతకానీ లేకుండాపోయింది. ప్రధానంగా పనిప్రదేశాల్లో కార్మికులకు ప్రమాదాలనుండి భద్రత అనేది లేకుండాపోయింది. పని ప్రదేశాల్లో భద్రత కల్పించటానికి అవసరమయిన ఏర్పాట్లకు పెట్టాల్సిన ఖర్చును కూడా మిగుల్చుకొని, లాభాలు పెంచుకోవట మన్నది యజమానులు అవలంబించే విధానం అయింది. ప్రమాదకరమయిన, కష్టమయిన, ఆరోగ్య హానిని కలిగించే పనుల్లో, ఎటువంటి రక్షణ కల్పించకుండా ఎటువంటి శిక్షణా, అనుభవంలేని కాంట్రాక్టు కార్మికులను నియమించి పని చేయించటం అన్నది మామూలైంది. ఇందువలన ఆయాపనుల్లో నియమించబడ్డ కార్మికులు ప్రమాదాలపాలై మరణించటం, అంగవికలురవ్వటం

***పాలకులు విసురుతున్న ఆశల వలలో చిక్కుకు పోకుండా దళితులను చైతన్యపరచి, పేద ప్రజలందరి మధ్య ఐక్యతను సాధించి, వారిని కులవివక్ష, కుల అణచివేత వ్యతిరేక పోరాటాలలో సమీకరించడంతోపాటు వర్గ పోరాటాలలో సంఘటితపరిచే మన కృషిని మరింత తీవ్రం చేయాలి.***

మామూలైపోయింది. ప్రమాదాలు జరుగకుండా నివారణ చర్యలు తీసుకోకపోవటమేకాక, ప్రమాదాల్లో మరణించిన, గాయపడిన కార్మికులకు నష్టపరిహారం చెల్లించకుండా ఎగవేయటం (కాంట్రాక్టు కార్మికులకు చట్టపరంగా నష్టపరిహారం పొందే హక్కులేనందువలన) సాధారణమయి పోయింది.

ప్రభుత్వరంగంలోని పరిశ్రమల్లో (యిటీవలి విశాఖ ఉక్కు కర్మాగారంలాంటి), విద్యుచ్ఛక్తి సరఫరా శాఖల్లో, మున్సిపాల్టీలు - కార్పోరేషన్లకు నిర్వహించే మాన్యువల్ పారిశుధ్య కార్యక్రమాల్లో, ఆఖరికి గ్రామీణ ఉపాధికల్పనా (ఎన్.ఆర్.ఇ.జి.ఎ) పనుల్లో, సింగరేణి గనుల్లో ప్రతిరోజూ ప్రమాదాల బారినపడి కార్మికులు మరణిస్తూనే వున్నారు.

ప్రైవేటురంగంలో ప్రధానంగా రసాయన పరిశ్రమల్లో, నిర్మాణ రంగంలో అనునిత్యం ప్రమాదాలు జరిగి కార్మికులు మరణిస్తూనే వున్నారు. వీరంతా కాంట్రాక్టు కార్మికులు లేదా ఔట్‌సోర్సింగ్ కార్మికులే. నేడు రాష్ట్రంలో ఈ పని ప్రదేశ ప్రమాదాలలో మరణించే కార్మికుల సంఖ్య రోజుకు కనీసం పదిమందిగా వుంటోంది. ఈ ప్రమాదాలు అన్నీ నివారించతగ్గవే. తగు భద్రతా ఏర్పాట్లు ఏర్పాటు చేయటం, భద్రతాచర్యలు చేపట్టడం, భద్రతా ప్రమాణాలను పాటించటంవలన ఈ ప్రమాదాలన్నింటినీ నివారించ వచ్చు. కానీ లాభాలకోసమే పనులను చేపడుతున్న కాంట్రాక్టర్లు వీటిని పాటించక, వాటిపై వెచ్చించాల్సిన ఖర్చులను మిగుల్చుకోవటం, చట్టం-చట్టఅమలు సంస్థలు వారికి అనుకూలంగా వుండటంవలన కార్మికులు ఈరకంగా యజమానుల లాభ యజ్ఞానికి సమిధలు చేయబడుతున్నారు. కార్మికులను ప్రాణమున్న మనుషులుగాకాక, యితర ముడిపదార్థాలమాదిరే, ముడి పదార్థాలుగా, యంత్రాలుగా పరిగణించే అమానవీయ, సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దృక్పథమే యిందుకు ప్రధాన కారణంగా వుంది.

ఇతర కార్మికుల ఆర్థిక సదుపాయాలు, హక్కులు సాధించుకోవటానికి కార్మికులు పోరాడవల్సిన అవసరానికన్నా, ఈ పనిప్రదేశ ప్రమాదాల నివారణకోసం పోరాడవల్సిన అవసరం ప్రధానమయినది. అందుకు ఉద్యమించటంకోసం కార్మికులను సంసిద్ధపరచటం ఆవశ్యకంగావుంది. ప్రమాదానంతరం నష్టపరిహారం కోసం ఆందోళనలు జరపటం-ప్రమాదాల నివారణకు, పనిప్రదేశ భద్రతకు చేపట్టాల్సిన ఉద్యమానికి ఏరకంగానూ ప్రత్యామ్నాయంకాదు. కానేరదు.

ఉపాధి కల్పనలోని విపరిణామాలు కార్మికరంగంపై తీవ్ర ప్రభావాన్ని కలిగిస్తున్నాయి. మూసివేతల బారిన పడకుండా మిగిలివున్న పరిశ్రమల్లో కాంట్రాక్టు కార్మికుల వినియోగం, వేతనాల తగ్గింపు, సౌకర్యాల కుదింపు, ఉద్యోగ విరమణానంతర సౌకర్యాల కుదింపు, వేతనాల ఎగవేత మొదలగు సమస్యలు చుట్టుముడుతున్నాయి.

కార్మిక చట్టాలుగానీ, కార్మికశాఖగానీ కార్మికుల ప్రయోజనాలను కాపాడకపోగా, సంస్కరణలపేరిట వాటిని నిర్వీర్యం చేసివేస్తున్నాయి. సుప్రీంకోర్టు తీర్పులను అడ్డుకొని సమ్మె హక్కును హరించే ప్రయత్నాలు చేస్తున్నాయి. సెజ్ చట్టం తెచ్చి కార్మికుల ఊసే లేకుండా చేస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో బహుళజాతి కంపెనీల, గుత్తపెట్టు బడిదారుల కనుకూలంగా పాలకుల సంస్కరణలకు, మూసివేతలు, తొలగింపులు, ప్రైవేటీకరణ, కాంట్రాక్టీ కరణలకూ వ్యతిరేకంగా నిరంతర ఆందోళనలూ, పోరాటాలూ సాగించటమూ, సాగుతున్న పోరాటాలకు సంఘీభావంగా నిలబడి ప్రభుత్వ విధానాలను బట్టబయలు చేయటమూ, దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా కార్మికవర్గాన్ని రాజకీయంగా సంఘటితపర్చటమూ మన కర్తవ్యం.

రాష్ట్రంలోని ప్రభుత్వ రంగ పరిశ్రమల్లోని కార్మికులపై కాంగ్రెసు పార్టీ ఆధీనంలోని ఐఎన్‌టియుసి ఆధిక్యత కలిగి వుండి, అభివృద్ధి నిరోధక పాత్ర నిర్వహిస్తున్నది. స్వతంత్ర యూనియన్లుగా కొన్ని చోట్ల చెప్పుకున్నా ఇలాంటి పాత్రనే నాయకులు నిర్వహిస్తున్నారు. ప్రైవేటు రంగంలో కూడా దీనికి ఆధిక్యత వుంది. ఆర్‌టిసి, సింగరేణి మొదలగు సంస్థల్లో మూసివేతలు, కార్మికుల సంఖ్య కుదింపు, ప్రైవేటీకరణ వంటి కీలక సమస్యలపై కూడా ఆందోళన నిర్వహించకుండా కార్మికులను నీరుగార్చే పని చేస్తున్నది. ప్రైవేటు రంగంలో కూడా కార్మికులకు పోరాట మార్గం పట్టకుండా, యజమానులతో రాజీపడి కార్మికులను అదుపు చేసే సాధనంగా ఉపయోగపడుతున్నది. ప్రపంచీకరణ దేశాభివృద్ధి కొరకేనని వీరు నిస్సిగ్గుగా సమర్థిస్తున్నారు.

టిడిపి తన వెనుక కార్మికులను సమీకరించే పనిలో వున్నది. టి.ఎన్.టి.యు.సి - ఆర్టీసి, సింగరేణి కార్మికుల్లో స్థానం పొందాలని ప్రయత్నించి విఫలమైంది. టిడిపి నాయకులు అక్కడక్కడా పెద్ద యూనియన్ నాయకులుగా వుండి ఐఎన్‌టియుసి లాగే వ్యవహరిస్తున్నారు. కార్మికులు వర్గ చైతన్యం పొందకుండా, పోరాట మార్గం చేపట్టకుండా నిరోధించే పాత్రను టిఎన్‌టియుసి నిర్వహిస్తున్నది.

***సాగు అవసరాలకూ, సాగు మెరుగుదలకూ యిచ్చే రుణాలనే వ్యవసాయ రుణాలుగా ప్రకటించి, వాటిని ప్రాధాన్యతా రంగ రుణాలుగా గుర్తించి, బ్యాంకుల అడ్వాన్సులలో 30శాతం ప్రాధాన్యతా రంగానికి కేటాయించాలి. వ్యవసాయ రుణాలకు 4 శాతం బారువడ్డీ మాత్రమే విధించాలనీ, తిరిగి చెల్లించిన కిస్తీలను మొదట అసలులో చెల్లింపు వేయాలనీ, రుణాల తిరిగి వసూళ్లకు రైతాంగపు ఉత్పాదక స్థిర, చరాస్తులు జప్తు చేయరాదనీ, తిరిగి చెల్లింపు కాలవ్యవధిని భూఉత్పాదకత ప్రమాణంగా పెంచాలన్న డిమాండ్లతో రైతాంగాన్ని ఆర్గనైజ్ చెయ్యాలి.***

పాలక పార్టీలకు చెందిన నాయకుల ఆధ్వర్యంలో నడుస్తున్నదే హెచ్.ఎం.ఎస్. ఇది సింగరేణి, విశాఖ పోర్టులోనూ, రైల్వేలోనూ పనిచేస్తున్నది. అక్కడక్కడా కొన్ని పెద్ద యూనియన్లను కలిగి వుంది. దీని వైఖరి ఐఎన్‌టియుసి, టిఎన్‌టియుసిలనే పోలి వున్నది. ఇది పాలకవర్గాల సంస్కరణవాద యూనియన్. దీనికి అరుపు లెక్కువ. అలాగే యాజమాన్యాలతో, పాలకులతో రాజీలు కూడా ఎక్కువే. కార్మిక ప్రయోజనాలు బలిపెట్టడంలో మిగిలిన వాటికిది తీసిపోదు.

కార్మికులను సంఘటిత పర్చటంలో, పోరాటాలు నడపటంలో, తోటి శ్రామిక ప్రజల పోరాటాలకు సంఘీభావం తెలపటంలో ఒకప్పుడు ప్రశంసనీయ పాత్ర నిర్వహించిన ఏఐటియుసి పాలక వర్గాల పట్ల మితవాద అవగాహనతో వ్యవహరిస్తున్నందున మిలిటెంటు స్వభావాన్ని కోల్పోయింది. కార్మికుల మధ్య స్థానాన్నీ, గుర్తింపునూ నిలబెట్టుకునేందుకు అనేక కుస్తీలు పడుతున్నది. ప్రభుత్వరంగ సంస్థలనుండి ముఠా కార్మికుల వరకూ దీని వునికి వుంది. సిపిఐ రాజకీయాలకు అనుగుణంగా వ్యవహరిస్తున్నది. కామ్రేడ్ లెనిన్ ఎండగట్టిన ఆర్థికవాదం, ట్రేడ్‌యూనియనిజం దీని నైజం. కార్మికవర్గ చైతన్యాన్ని ఉద్దేశ్యపూరితంగా పక్కన పెడుతున్నది.

కార్మికులకు వర్గ స్పృహను కల్పించాలంటూ, మిలిటెంటు పోరాటాల బాటన నడపాలంటూ ఏర్పడిన సిఐటియు అన్ని రంగాల్లోనూ హంగామా చేస్తున్నది. దీనిని విప్లవకరమైందిగా చూపుకుంటూ పోరాటాలను దారి మళ్లిస్తున్నది. సిపియం నాయకత్వాన నడుస్తూ దోపిడీ వ్యవస్థకు దెబ్బతగలని పోరాట రూపాలకు కార్మికులను పరిమితం చేస్తున్నది.

రాష్ట్రంలో ఐఎఫ్‌టియు, ఎఐఎఫ్‌టియు, సికాస పనిచేస్తున్నాయి. సింగరేణి, జూటు, బీడీ రంగాల్లోనూ, తెలంగాణా ప్రాంతంలోనూ కొంత ప్రభావాన్ని కలిగి వున్నాయి. వివిధ ఎంఎల్ సంస్థల నేతృత్వంలో నడుస్తున్న ఈ సంస్థలలో అధిక భాగం తమ అతివాద పద్ధతుల్లో ఎవరో ఏదో సాధించి పెడతారన్న భావనను వ్యాప్తి చేస్తున్నాయి. అదే సమయంలో ఫక్తు టి.యు.పద్ధతులకూ, రాజీ-రాయబారాలకూ పాల్పడుతున్నాయి. సమాజ పరిణామానికీ, సాంఘిక విప్లవానికీ, ప్రజాతంత్ర విప్లవానికి కార్మికవర్గం నాయకత్వం వహించాల్సిన చారిత్రక కర్తవ్యానికి వ్యతిరేకమైన పద్ధతులు, పోకడలు, ప్రభావాలూ కార్మికరంగంలో, టియులలో ఆధిక్యత వహిస్తున్నాయి.

కార్మికులు తక్షణ డిమాండ్లు సాధించుకోవటానికీ, సాధించుకున్న హక్కులను, ఫలితాలను నిలబెట్టు కొనటానికీ కూడా హానికరమైన పద్ధతుల, పోకడల, ప్రభావాలకు వ్యతిరేకంగా కార్మికవర్గ చైతన్యంతో వర్గపోరాట భావ జాలంతో కార్మికవర్గం వ్యవహరించే విధంగా సంఘటిత పరచుకోవాలి.

దోపిడీ వర్గ పాలననుండి ప్రస్తుత సమాజ విముక్తి కొరకు కార్మికుల మధ్య విశాల ఐక్యతపై ఆధారపడిన మిలిటెంటు పోరాటాలు తప్పవనే స్పృహను యావత్తు కార్మికవర్గంలో పెంపొందించాలి.

సమాజ విముక్తి, సాంఘికాభివృద్ధి సాధించటానికి పీడిత వర్గాలన్నింటికీ కార్మికవర్గం చోదకశక్తిగా రూపొందాలన్న అవగాహన, చైతన్యాన్ని కార్మికుల్లో పెంచాలి. పాలకవర్గాల అణచివేత పీడనలకు వ్యతిరేకంగా, సాంఘికవ్యవస్థ కారణంగా ఉత్పన్నమైన వెనుకబాటు తనానికి వ్యతిరేకంగా కార్మికవర్గం నిరంతరం పోరాడాలన్న స్పృహను కార్మికుల్లో కల్గించాలి.

## సంక్షేమ రంగం

విద్య, వైద్యం, గృహవసతి రంగాలనూ, తరతరాలుగా అణచివేతకు గురౌతున్న ఎస్‌టి, ఎస్‌సి, బిసిలకు చేయూతనిచ్చే కార్యక్రమాలను సంక్షేమ రంగంగా పరిగణిస్తున్నారు. కానీ దీనిలో ప్రజా సంక్షేమమే లేకుండాపోయింది.

గతరాష్ట్ర ప్రభుత్వాలు కనీస సౌకర్యాలు కల్పించ కుండా పాఠశాలలను కునారిల్లజేసి, ఇంగ్లీషు కాన్వెంటుల్లో నేర్పించేదే చదువన్న భ్రమను వ్యాపింపజేసి ప్రాథమిక విద్యను ప్రైవేటీకరించాయి. నిర్బంధ, ఉచిత ప్రాథమిక విద్యనందించవలసిన బాధ్యత నుండి తాను తప్పుకుంటున్న వాస్తవాన్ని కప్పిపుచ్చుకునేందుకు ఆర్భాటపు అక్షరజ్యోతి కార్యక్రమాలతో హడావుడి చేశాయి. దీని కొనసాగింపుగా విద్యాహక్కు చట్టంతో పేద పిల్లలను కాన్వెంటుల్లో చేర్పిస్తానంటూ ఆశల పందిళ్లు వేసింది.

పెరుగుతున్న దేశ అవసరాలకు అనుగుణంగా ఉన్నత విద్యారంగ విస్తరణను చేపట్టకుండా కొరతను సృష్టించి, ప్రవేశపరీక్షలను పెట్టింది. వీటిలో ఉత్తీర్ణత కోసం విద్యార్థులను ప్రైవేటు కోచింగు సెంటర్లకు మళ్లించింది. తానే ప్రారంభించి సత్ఫలితాలనిచ్చిన రెసిడెన్సియలు జూనియరు కాలేజీలను కునారిల్లజేసి, కోచింగు సెంటర్లు ఈ రంగంలోకి ప్రవేశించేందుకు మార్గం చూపింది. ఈ క్రమంలో గుప్పెడు ప్రైవేటు శక్తుల ఆధిపత్యంలోకి మాధ్యమిక విద్య వెళ్లింది. ఇది విద్యార్థులకు విజ్ఞానంతో సమగ్ర అవగాహనను కల్పించవలసిన దశలో బట్టీయం పెట్టే దశకు దిగజార్చింది. దీనితో ఐఐటి సీట్లు పొందిన విద్యార్థులు కూడా ఉన్నత విద్యలో విఫలమవటం, నిరాశతో ఆత్మహత్యలు చేసుకునే దుస్థితి ఏర్పడింది. పేదలకు మాధ్యమిక విద్యనందకుండా చేసిన ఈ విధానాన్ని కప్పిపుచ్చుకుంటూ ప్రైవేటు జూనియర్ కళాశాలల్లో తానే ఫీజు కట్టి పేద విద్యార్థులను చేర్పించుతానంటూ హడావుడి చేసింది.

ఈ క్రింది ప్రభుత్వ లెక్కలే చూడండి : 2010-11 సంవత్సరంలో స్కూలు విద్యలో 1.33 కోట్ల మంది విద్యార్థులు చేరగా, వారిలో దాదాపు సగం మంది (46.2 శాతం) మధ్యలోనే బడిమానివేశారు. దాదాపుగా 60 లక్షల మంది 10వ తరగతి పరీక్షకు హాజరవ్వగా, 50 లక్షల మంది ఉత్తీర్ణులయ్యారు. కాగా వీరిలో మాధ్యమిక విద్యలో చేరింది 9 లక్షలకులోపు మాత్రమే. ఇది పేదలకు చదువు అందుబాటులో లేకుండా చేశారని తెలుపుతున్నది. మధ్యాహ్నభోజనం వంటి పథకాలను ఏకరవుపెట్టిన ఇకనామిక్ అండ్ సోషల్ సర్వే ఆఫ్ ఆంధ్రప్రదేశ్ - 2012 కార్పోరేటు జూనియర్ కాలేజీల్లో ఎంతమందిని ప్రభుత్వం చేర్పించిందో, దాని కెంతఖర్చు చేసిందో మాత్రం చెప్పలేదు.

ఈ క్రమంలో ఉన్నత విద్యారంగాన్ని ప్రైవేటీకరించే చర్యలు చేపట్టింది. తాను కాలేజీలు పెట్టకపోగా, వాటికీ విశ్వవిద్యాలయాలకూ నిధులు తగ్గించివేసింది. అవి స్వయం పోషకంగా వుండాలంటూ అధిక ఫీజులు వసూలు చేసే సెల్ఫ్ ఫైనాన్సు కోర్సులను ప్రారంభించింది. తగినంత మంది విద్యార్థులు లేరంటూ కొన్ని విభాగాలను మూసివేసింది. ఏర్పడిన ఖాళీలను పూరించకుండా అధ్యాపకులు లేకుండా చేసింది. సాంకేతిక విద్యారంగాన్ని మరింత భ్రష్టు పట్టించింది. సాఫ్టువేరు, ఫార్మా కంపెనీలు రావటంతో ఈ రంగంలో ఉపాధి మెరుగయ్యింది. సాఫ్టువేరు నిపుణత్వం పొందేందుకు ఇంటర్మీడియేట్ విద్యచాలు. అభివృద్ధి చెందిన దేశాలన్నింటా అనుసరిస్తున్నదిదే. సాఫ్టువేరు నిపుణత్వాన్ని ఇంజనీరింగు డిగ్రీకి ముడిపెట్టడంతో ఇంజనీరింగు కాలేజీలు వెలిసాయి. కోరినవారికల్లా అనుమతులిచ్చి ప్రైవేటు ఇంజనీరింగు కాలేజీలను ప్రోత్సహించారు. దీనితో 710 ఇంజనీరింగు, 664 ఎంసిఏ, 926 ఎంబిఏ, 290 ఫార్మసీ కాలేజీలు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. ఇంతమంది వృత్తి నిపుణుల అవసరముందా? రాష్ట్ర అవసరాలెంత? వీటికి తగిన వసతులున్నాయా? బోధనా సిబ్బంది ఉన్నారా? వంటి కీలక అంశాలు వేటినీ పట్టించుకోకుండా వదిలి వేశారు. దీనితో ఇదొక వాణిజ్యంగా మారింది. ఎన్‌ఆర్‌ఐ కోటా, యాజమాన్య కోటా, ఎంసెట్ కన్వీనర్ కోటా అంటూ వివిధ రకాల ఫీజులు, వాటిపై వివాదాలు, చివరికి న్యాయస్థానాలు ఫీజు నిర్ణయించటం సాగి, చివరకు ఫ్రీ సీటు అని పిలుస్తున్న ప్రభుత్వ కాలేజీల సీట్లకు కూడా వేల రూపాయల్లో ఫీజులు వసూలు చేస్తున్నారు. (ప్రభుత్వ ఇంజనీరింగు కళాశాలలో సంస్కరణలకు ముందువున్న వార్షిక ఫీజు 250 రూ॥లు కాగా నేడు 35 వేలకు పెరిగింది).

చివరకు పరిస్థితి, ప్రైవేటు కాలేజీల్లో చేరే విద్యార్థులు లేక, ఇంటరు పాస్ అయితే చాలు ఇంజనీరింగు సీటిస్తామంటూ ఈ కాలేజీలు విద్యార్థుల వేటలో మునిగాయి. ఈ కాలేజీలు మూతపడే స్థితిరాగా, రాజశేఖరరెడ్డి ఫీజు రీయింబర్సుమెంటు స్కీమును ప్రవేశపెట్టాడు. ప్రైవేటు వృత్తి కళాశాలల్లో చేరిన విద్యార్థులందరికీ ప్రభుత్వమే ఫీజు కడుతుంది. దీనికోసం ఇప్పటి వరకూ ఖర్చు చేసిన మొత్తాన్ని చూస్తే, దీనిలో సగం ఖర్చుతో సగం కాలేజీలలో అందరికీ ఉచితంగా విద్యను అందించగలిగేదని స్పష్టమౌతుంది. మూతబడే ప్రైవేటు కాలేజీలను లాభాలార్జించే వాణిజ్యంగా చేసేందుకు పెట్టిన స్కీము ఇది. ఇప్పుడు ఈ పథకాన్ని ఉపసంహరించినా, ఇవి మూతపడినా వీటి యాజమాన్యాలకు వచ్చిన నష్టమేమీ వుండదు. కేంద్రం నుండి వచ్చిన ఎస్‌టి, ఎస్‌సి నిధులకు కొంత నిధులను చేర్చి ఈ పథకాన్ని పోషించిన రాజశేఖరరెడ్డి ప్రతిష్ట యిప్పుడు దయ్యమై రాష్ట్ర పాలకులను పీడిస్తున్నది.

***వ్యవసాయరంగాన్ని బడాబూర్జువాల, బడా వ్యాపారుల పరం చేసేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యల పరంపర కొనసాగింపే వ్యవసాయ రుణాల తరలింపు. రైతాంగానికి సంస్థాగత రుణసౌకర్యం అందుబాటులో లేకుండాచేసి దానిని బడా వర్గాలకు తరలించటం రైతాంగాన్ని భూమినుండి తొలగించే చర్యల్లో భాగమే.***

ప్రైవేటు కాలేజీలు ఫీజులు పెంచాలంటూ డిమాండు చేయటంతో ప్రభుత్వం ఇరకాటంలో పడింది. వివాదంపై కోర్టుకు చేరి, తన తీర్పులను తానే ప్రక్కన పెడుతూ కొందరు విద్యార్థులనుండి ఎక్కువ ఫీజు వసూలు తప్పంటూ అందరి నుండీ సమానంగా ఫీజు వసూలు చేయాలని ఆదేశించింది. ప్రైవేటు కాలేజీలతో బేరసారాలాడి, బెదిరించి, బామాలి ప్రభుత్వం 35 వేలు ఫీజుగా నిర్ణయిస్తే, హైకోర్టు 50 వేలుగా నిర్ణయించింది. అన్ని సౌకర్యాలున్న కాలేజీలు ఇంకా ఎక్కువ వసూలుకు అనుమతించింది.

ఈ క్రమంలో మొత్తం విద్యారంగాన్ని ప్రైవేటీకరించి, విద్యను వాణిజ్య సరుకుగా మార్చివేసింది.

వైద్య, ఆరోగ్యరంగ ప్రైవేటీకరణనుకూడా త్వరితం చేశారు. వైద్యబీమా రంగంలో విదేశీ కంపెనీలు రాజ్యమేలుతున్నాయి. ప్రభుత్వ ఉద్యోగులకిస్తున్న వైద్య ఖర్చుల రీయింబర్సుమెంటును కూడా ఆరోగ్యశ్రీ పథకంలాగే బీమా కంపెనీల పరం చేసింది. ఈ పథకాలకవుతున్న ఖర్చులన్నీ కలిపితే ప్రభుత్వమే ఆ నిధులతో ప్రజలందరికీ ఉచిత వైద్యం అందించగలదు. అలా చేయకుండా ప్రజాధనాన్ని విదేశీ, దేశీయ పెట్టుబడిదారులకు ధారపోస్తున్నారు.

తక్కువ ఖర్చుతో వైద్య నిపుణుల సేవలు అందుబాటులో వుండటంతో విదేశాల నుండి చికిత్సకు వస్తున్నారు. హెల్తుటూరిజం పేరిట ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నది. దీనితో బీమా కంపెనీలు, కార్పోరేటు ఆస్పత్రులు విదేశీయులు చెల్లించే దానినే తమరేటుగా మార్చాయి. అది విదేశీయులకు తక్కువేగానీ భారత ప్రజలకు అందుబాటులో లేకుండా పోయింది. మరో వైపున క్లినికల్ ట్రయల్సును ప్రోత్సహిస్తున్నారు. విదేశీ మారక ద్రవ్య ఆర్జనకు మార్గంగా మురిసి పోతున్నారు. కానీ విదేశీ మందుల కంపెనీల ప్రయోగాలకు భారత ప్రజలే బలిపశువులయ్యారు. పల్నాడు, నల్గొండ, హైద్రాబాదు నగరాలలో సాగుతున్న ఈ ప్రయోగాలతో ప్రజల ఆరోగ్య రక్షణను గాలికొదిలేశారు. వాస్తవాలు బయటపడితీవ్ర ఆందోళన జరిగినప్పుడు, అప్పుడే సమస్య వారికి తెలిసినట్లు నియంత్రణా చర్యలు తీసుకుంటామని ప్రకటనలు గుప్పించటమే ప్రభుత్వ ఉద్దేశపూరిత నిర్లక్ష్యాన్ని తెలుపుతున్నది.

ఆదివాసులను, దళితులను ఉద్ధరించటానికంటూ ప్రణాళికల్లోనే ఎస్‌టి, ఎస్‌సి సబ్ ప్లానులను చేర్చి వాటికి నిధులు కేటాయించారు. ఆచరణలో ఈ నిధులను ఇతర వ్యయాలకు మళ్లించి, బడ్జెట్టులో మాత్రం ఈ ఖాతా క్రిందే ఖర్చయినట్లు చూపుతున్నారు. గత 20 ఏళ్లుగా ఈ నిధుల మళ్లింపు సాగుతుండగా పాలకులందరూ పట్టనట్లు కూర్చుని పెరిగిన నిధుల కేటాయింపులను చూపి దళితులను ఆదివాసులను జోకొట్టుతూవచ్చారు. ఈ ఏడాది దీనిపై తీవ్ర ఆందోళన రావటంతో నిధులు మళ్లించబోమనీ, కేటాయించిన రంగానికే వ్యయం చేసే చర్యలు తీసుకుంటామనీ, దీనికి చట్ట బద్ధత కల్పిస్తామనీ మళ్లీ హామీ యిచ్చారు. ఆశల పందిళ్లతో పీడితులను వంచిస్తున్న పాలకుల మోసాన్ని బహిర్గత పరచి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు ప్రజలను పోరాటాలలోకి సమీకరించాలి.

గృహ వసతి కల్పన కూడా పాలకుల వంచనాత్మక కళకు అద్దం పట్టేదిగానేవుంది. పేదలకు గృహవసతి కల్పిస్తామంటూ ప్రారంభించిన ఇందిరా ఆవాస్ యోజన 8 ఏళ్లు గడిచినా లక్ష్యాలలో సగం కూడా సాధించలేదు. నిర్మితమైన ఇళ్లు కూడా కనీస సౌకర్యాలు లేక నివాస యోగ్యంగా లేవు. చౌకగా మధ్యతరగతి ప్రజలకు ఇళ్లు నిర్మించి ఇస్తామంటూ ప్రారంభించిన రాజీవ్ గృహకల్ప పథకం కంట్రాక్టర్లకు వరంగా మారింది. చివరకు ధర ఐదు రెట్లకు పైగా పెరిగి నిర్మించిన గృహాలను కూడా కొనుగోలు చేయలేక, చెల్లించిన డిపాజిట్టు అయినా తిరిగి యిస్తారన్న నమ్మకంపోయి ఆశోపహతులయ్యారు.

గృహవసతి ప్రచారార్భాటం మాటున, ప్రైవేటు రియలు ఎస్టేటు వ్యాపారులకు స్వేచ్ఛనిచ్చారు. గృహ సముదాయం నిర్మించేటప్పుడు వాటిలో అల్పాదాయ, మధ్యఆదాయ వర్గాలకు కూడా అందుబాటులో 50 శాతం

వరకూ గృహాలు వుండాలన్న నిబంధనను సవరించారు. దీనితో మధ్యతరగతి వర్గాలకు స్వంత ఇళ్లు పగటికలగానే మిగిలిపోయింది.

ప్రజలకు కనీస సౌకర్యాలయిన కూడు, గూడు, గుడ్డ కూడా అందుబాటులో లేకుండా చేసి తమది సంక్షేమ ప్రభుత్వమంటూ ఊదరకొడుతున్న పాలకుల నయవంచనను ఎండగట్టి ప్రజలను పోరాటాలలోకి సమీకరించేందుకు కృషి చేయాలి.

## రాష్ట్ర రాజకీయ పరిస్థితి

ఆర్థిక సంక్షోభం తాకిడితో రాజకీయరంగం కల్లోలభరితంగా మారింది. ఆర్థిక సంక్షోభంనుండి బయటపడటానికి అనుసరించవలసిన మార్గాలపట్ల పాలకవర్గాలలో విబేధాలు తీవ్రమౌతున్నాయి. ఆర్థిక సంక్షోభంవల్ల ప్రజల్లో పెరుగుతున్న అశాంతి, పోరాట తత్వాలను చూసి భీతుల్లుతున్న పాలకవర్గాలు వాటిని చల్లార్చేందుకూ, పెడమార్గం పట్టించేందుకూ అనుసరించాల్సిన విధానాలలో మాత్రం కలిసికట్టుగా వ్యవహరిస్తున్నాయి. ఇదే, వాటి రాజకీయ ప్రతినిధులుగా వున్న పార్టీల వైఖరుల్లోనూ, ముఠా తగవుల్లోనూ వ్యక్తమౌతున్నది.

సామ్రాజ్యవాదులు నిర్దేశిస్తున్న విధానాలన్నీ తుచా తప్పక పాటించాలని బడా బూర్జువావర్గం కోరుతుండగా (ప్రభుత్వ వ్యయాన్ని తగ్గించుకోవాలి; గూడ్సు, సర్వీస్ టాక్సును వెంటనే అమలుచేయాలి; బూర్జువాలకు వడ్డీరేట్లు తగ్గించి ద్రవ్య అందుబాటును పెంచాలి; భూసేకరణ బిల్లును సవరణలు లేకుండా ఆమోదించాలి; కిరాణా వ్యాపారం, పౌరవిమాన యానాలలోకి విదేశీ పెట్టుబడి అనుమతించాలి; మొదలగు ఫిక్కి డిమాండ్లు) ఇవి రాష్ట్రాల ఆదాయాన్ని తగ్గించి పరిపాలనలో అస్థిరతను తెస్తాయని రాష్ట్ర స్థాయిలో పాలకవర్గాలు వ్యతిరేకత తెలుపుతున్నాయి. కేంద్రప్రభుత్వం చేతిలో నిరంకుశాధికారాల కేంద్రీకరణకు సంక్షోభం దారితీయటం కూడా దీనికి కారణంగా వుంది. యుపిఏ, ఎన్‌డిఏ కూటముల లోపలా బయటా కూడా ఈ వైరుధ్యం పదేపదే వ్యక్తమౌతున్నది.

రాజశేఖరరెడ్డి హఠాన్మరణంతో పాలక ముఠాల మధ్య అంతవరకూ వున్న "శాంతి" భగ్నమైంది. అధికారదాహంతో ముఠా తగవులు రచ్చకెక్కాయి. అధికారాన్ని అడ్డుపెట్టుకుని నాయకులు గుట్టుచప్పుడు కాకుండా సాగించిన అక్రమార్జనలన్నీ ఒక్కొక్కటిగా బయటపెట్టుకున్నారు. రాజశేఖరరెడ్డి అక్రమార్జనలను బయటపెట్టడంగా మొదలై పాలక, ప్రతిపక్ష పార్టీ నేతలందరి అక్రమార్జనలూ బయటపడి లక్షలకోట్ల ప్రజాధనాన్ని వీరు కైంకర్యం చేసిన తీరు తేటతెల్లమైంది.

ఈ అక్రమార్జనల పరస్పరారోపణల్లో ఏ నేతా తనపై ఆరోపణను తిరస్కరించకపోగా, ఎదుటివారి అక్రమార్జనల గురించే మాట్లాడటం 'త్వంశుంఠ అంటే త్వంశుంఠ' అన్న రీతిలోసాగి సిగ్గూ ఎగ్గూలేని దోపిడీవర్గ సంస్కృతి ప్రదర్శితమైంది. ఈ సందర్భంగా పార్టీల వెనుక అత్యంత సంపన్నవంతమైన కుటుంబాలు వెన్నుదన్నుగా నిలబడటం గతంలో ఎన్నటికంటే కొట్టవచ్చినట్లు కన్పించింది. తమతమ ఆర్థిక బురుజుల అస్థిత్వాన్ని నిలబెట్టుకునేందుకే కుటుంబ, కుల, మత, ప్రాంతీయ అస్థిత్వాలను వీరు ముందుకు తెస్తున్నారు. ఈ అస్థిత్వ సిద్ధాంతాలతో ప్రజలను చీల్చి తమ వెనుక సమీకరించుకుంటున్నారు. వీటి దుష్ప్రభావం కొన్ని సెక్షన్లపై క్రింది వర్గాలపై కూడా వుంది.

రాష్ట్రంలో పాలకవర్గాల రాజకీయ ప్రతినిధులుగా వున్న పార్టీలన్నీ ప్రజల విశ్వాసాన్ని కోల్పోయాయి. ఒక నిర్దిష్ట కార్యక్రమంద్వారా ప్రజలముందుకెళ్లగలిగిన స్థితి ఏ దోపిడీ వర్గ పార్టీకీ లేదు. డబ్బులు కుమ్మరించి పత్రికలనూ, టీవిఛానెళ్లనూ గుప్పిటపెట్టుకుని తామే రాజకీయ అజెండాను కూడబలుక్కునట్లు నిర్ణయించి ప్రజల దృష్టిని అసలు సమస్యలనుండి మళ్లిస్తున్నారు. కొంతకాలం తెలంగాణా ప్రత్యేకరాష్ట్రం డిమాండు, పరస్పర దూషణలస్థాయిలో ఆరోపణతో ఉప ఎన్నికల నిర్వహణతో మరికొంతకాలం గడిపివేస్తూ ప్రజా జీవనాన్ని కల్లోలభరితం చేస్తున్న సమస్యలేవీ చర్చకు రాకుండా చేస్తున్నారు. వివిధ ప్రజాకర్షక పథకాల వర్షంతో ప్రజలను నిత్యం వారి దయాదాక్షిణ్యాల కొరకు ఎదురుచూసే పరిస్థితిలో ప్రజలనుంచుతున్నారు. ఆ పథకాల కర్తలెవరంటూ (ఆరోగ్యశ్రీ, ఫీజురీయింబర్సుమెంటు, రైతులు, స్వయం సహాయక బృందాలకు వడ్డీ తగ్గింపు తదితరాలు) ఆ ప్రతిష్ట ఎవరికి చెందాలంటూ వాదులాడుకుంటున్నారు.

ఈ క్రమంలో మొత్తం ప్రజాస్వామ్యానికి మూలస్థంభాలని చెప్పుకుంటున్న వ్యవస్థలన్నీ (శాసనసభ, న్యాయస్థానాలు, చట్టబద్ధ పాలనాసంస్థలు, పత్రికలు) ఎంతగా అవినీతితో పుచ్చిపోయాయో బట్టబయలయింది. అసెంబ్లీలు బాతాఖానీ షాపుల స్థాయి నుండి వీధి అరుగులమీది కొట్లాటల స్థాయికి దిగజార్చబడ్డాయి. హాస్యాస్పదమైన వివాదాలూ, చర్చలకూ వేదికగా తయారైంది. బెయిలుకోసం ఐదుకోట్ల లంచాన్ని మెక్కిన

> ***కొన్ని శక్తులు ప్రజాందోళనలను పర్యావరణ సమస్యకే పరిమితం చేసేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇది చాలదు. అభివృద్ధి ప్రాజెక్టులనే వాటి దోపిడీ లక్ష్యాలను తీవ్రంగా వ్యతిరేకించాలి. ప్రజా ప్రయోజనాలకు హానికరమైన ప్రాజెక్టులను ఆపివేయాలని డిమాండు చేయాలి. ప్రజాప్రయోజనమంటే ప్రజల ఉమ్మడి ప్రయోజనమనీ, వాటికోసం తప్ప ప్రభుత్వం భూమి సేకరించరాదనీ, భూమి కావాలంటున్న శక్తులు భూమి హక్కుదారుని అనుమతి మేరకు తామే కొనుగోలు చేసుకోవాలనీ డిమాండు చేయాలి.***

కోర్టులు, అక్రమార్జన కేసుల్లో యిరుక్కున్న నాయకులకు సకల సౌకర్యాలు కల్పిస్తూ హోటళ్లలాంటి జైళ్లు, విచారణలో బయటపడ్డాయంటూ ముందుగానే పత్రికలద్వారా సమాచారం వెల్లడించి నేరనిరూపణచేసి, అధికార ముఠా ప్రయోజనాలకు సేవచేస్తున్న పోలీసులు, ఒక ముఠా కొమ్ముకాస్తూ సమాచారంకంటే బురదజల్లడాన్నే వార్తలుగా చేస్తున్న మాధ్యమాలు పాలకవర్గ పాలన చేతిలో పనిముట్లుగా బయటపెట్టుకుంటున్నాయి. కుటుంబ పాలనకు అడుగులకు మడుగులొత్తుతూ పార్టీలలో ప్రజాస్వామ్యం ప్రక్రియ గురించి గొంతు చించుకుంటున్నారు. అసలు ప్రజాస్వామ్యమన్న అవగాహననే అపహాస్యం చేస్తున్నాయి. నిజమైన ప్రజాస్వామిక విలువలు ప్రజల భావాలలోకి చేరకుండా చేస్తున్నాయి.

దోపిడీ వర్గాలలో వైరుధ్యాలూ, రాజ్యాంగ యంత్రంలో వివిధ విభాగాల మధ్య వైరుధ్యాలూ అత్యంత తీవ్రంగా, నగ్నంగా కనబడుతున్నప్పటికీ పాలకవర్గాల అందరి లక్ష్యం దోపిడీ వ్యవస్థను కాపాడటం. తమ దోపిడీని కాపాడుకోవటమే కాబట్టి ఐక్యమవుతున్నాయి. కూటములుగా ఏర్పడి తమ పాలనను నల్లేరుపై బండిలా సాగించుకుంటూ పోగలుగుతున్నాయి. అదే సందర్భంలో ప్రజల అసంతృప్తి, ఆగ్రహాలకూ గురౌతున్నాయి. ప్రజల విశ్వాసాన్ని కోల్పోయి వున్నాయి. ఈ బలహీనతతో వారెప్పటికప్పుడు జాగ్రత్తపడుతూ ప్రజాసమస్యల మూలకారణాలు చర్చల్లోకి రాకుండా, తాము సృష్టించిన సమస్యలనే రాజకీయ అజెండాను చేస్తున్నాయి.

## రాజకీయ పార్టీల విధానాలూ–వాటి ఆచరణ

### కాంగ్రెసు పార్టీ

పాలకవర్గ పార్టీల్లో దీర్ఘచరిత్ర వున్న ఈ పార్టీ ప్రస్తుతం కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అధికారంలో వుంది. వ్యవసాయ కూలీలనుండి చిన్న పెట్టుబడిదారుల వరకూ అన్ని వర్గాలకూ మేలు చేకూరుస్తాననే నినాదాలతో తన వెనుక సమీకరించుకుని, భూస్వామ్య బడాబూర్జువా వర్గాలకూ సామ్రాజ్యవాదులకూ సేవలందించటంలో నైపుణ్యం సాధించిన పార్టీ యిది. నెహ్రూ నుండి, ఇందిరాగాంధీ, తర్వాత రాజీవ్‌గాంధీ, నేటి మన్మోహన్ వరకూ సామ్రాజ్యవాదుల అడుగుజాడల్లో నడుస్తున్న పార్టీ యిది. ప్రస్తుత ప్రపంచీకరణ, నూతన ఆర్థిక విధానాలకు 1985లోనే బీజాలు వేసి 1991లో వాటి అమలుకు గేట్లు తెరిచిన పార్టీ యిది. మతోన్మాదాన్ని పెంచటానికి నాజూకైన పద్ధతులను వాడుతూ సెక్యులర్ పోజుతో అన్ని మతాల్లోని మతోన్మాదశక్తులనూ జిత్తులమారితనంతో వినియోగించుకుంటున్నది. అన్ని మతాల పండుగల సందర్భంగా వాటిలో పాల్గొంటూ, మతాచారాలకు ప్రచారం కల్పిస్తూ అన్నిమతాల వారి అభిమానాల్ని పొందజూస్తున్నది. ప్రాంతీయ పార్టీలను వేర్పాటువాదమని ముద్రవేసిన ఈ పార్టీ తానే ప్రాంతీయ వాదాలను చేస్తూ, ప్రాంతీయ విద్వేషాలు రగిలుస్తున్న ప్రాంతీయ పార్టీలను ప్రోత్సహిస్తూ వాటితో చేతులు కలుపుతున్నది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నినాదంతో ఆ ప్రాంతంలో అధికారాన్ని నిలబెట్టుకోగలనని, ప్రజాకర్షక పథకాలు విజయం తెచ్చిపెడతాయన్న ధీమాతో వున్నది. అందుకనే కొడుకు మాత్రమే అక్రమార్జనపరుడంటూ కొంతకాలమూ, తండ్రిపాలనలో వచ్చిన పథకాలన్నీ సోనియావంటూ ఇటీవల ఉప ఎన్నికల్లోనూ తన ప్రచారమంతా సాగించింది. దాదాపు నాలుగింట మూడువంతుల మండలాల్లో దాదాపు కరవు పరిస్థితులేర్పడినా, తీవ్ర ఎండవేడిమికి 200మంది పేదలు మృతిచెందిన ఎన్నికల సందర్భంలోనైనా ఒక్కమాట కూడా మాట్లాడని పార్టీ యిది.

### తెలుగుదేశం పార్టీ

వర్గ స్వభావరీత్యా ప్రస్తుత కాంగ్రెసుకీ దీనికీ తేడా లేదు. ప్రపంచీకరణ సంస్కరణల కార్యక్రమాన్ని అమలుజరిపి ప్రపంచబ్యాంకు ప్రశంసలు పొందిన పార్టీ యిది. విదేశీ పెట్టుబడిదారీ వర్గాలతో మిలాఖత్తుఅయిన పార్టీ యిది. భూస్వామ్యవర్గ అనుకూలతతో రైతాంగ మౌలిక సమస్యలను తానధికారంలో వున్నంతకాలమూ పట్టించుకోని పార్టీ యిది. 'నన్నడిగి పంటలు వేశారా ఇప్పుడు నన్ను గిట్టుబాటుధర అడుగుతున్నార'ంటూ ఈసడించిన పార్టీయిది. సంస్కరణల్లో భాగంగా నీటి తీరువాను పెంచి ప్రతిఘటించిన రైతుయువకులను బలిగొన్న పార్టీ యిది. విద్యుత్తు సంస్కరణలతో ప్రజలపై భారాలు పెంచే విధానాన్ని ప్రారంభించిన పార్టీ యిది. రాష్ట్రాన్ని తానే అభివృద్ధిలోకి తెచ్చాననీ, నిరుద్యోగాన్ని పారద్రోలాననీ, ప్రజాపోరాటాలకూ కమ్యూనిజానికీ కాలం చెల్లిందనీ ప్రవచించిన పార్టీ యిది. ఎన్నికలు దగ్గరపడినకొద్దీ కాంగ్రెసులోని ముఠా తగవులతో ఆశలుపెరిగి, తాను అమలుజరిపిన, నేడు కాంగ్రెసు ప్రభుత్వం కొనసాగిస్తున్న విధానాలను తానే ఖండించుకుంటూ తనకధికారమిస్తే వరాలు తీరుస్తానంటున్న పార్టీ యిది. దోపిడీ వర్గాలకు శిఖండిలాంటి విధానాలను కనిపెట్టిందీపార్టీ. బాక్సైటు గనులే దీనికుదాహరణ. దీనినే రాజశేఖరరెడ్డి కొనసాగించాడు. దీనిలో అన్ని రకాలుగా ప్రజలను నష్టపరచిన తీరుగురించి మాట్లాడకుండా, ఆశ్రిత పక్షపాతాన్నీ, అవినీతినీ మాత్రమే ఎత్తి చూపుతున్నది. వాస్తవానికి చంద్రబాబు పాలనలో ప్రభుత్వ బడ్జెట్టును కొల్లగొట్టడంద్వారా లబ్ధిపొందిన వర్గాలే, కాంగ్రెసు పాలనలోనూ లబ్ధిపొందుతున్నాయి. రాష్ట్రంలోని ధనాఢ్య వర్గాలు నిరంకుశాధికార పెట్టుబడితో బలుస్తున్నాయి తప్ప వీటికున్న పారిశ్రామిక పునాది తక్కువ.

### భారతీయ జనతాపార్టీ

వర్గ స్వభావరీత్యా కాంగ్రెసుకూ దీనికీ తేడా లేదు. కానీ ఇది పూర్తిగా హిందూత్వ ఫాసిస్టు శక్తుల వేదిక. అనేక కారణాలరీత్యా రాష్ట్రంలో యిది రాజకీయంగా విస్తరించలేకపోతున్నది. కమ్యూనిస్టుల నాయకత్వాన సాగిన వీరోచిత వర్గ పోరాటాల ఫలితంగా ప్రబలిన ప్రగతిశీల భావాల ప్రభావం ఒక కారణంకాగా, దీనినధిగమించేందుకు ఈ పోరాటాల ప్రభావంలేని ఈనాటి పట్టణ యువకులను హిందూత్వశక్తుల నాయకత్వంలోకి తెచ్చేందుకు చాపక్రింద నీరులా ఇది చేసిన ప్రయత్నాలకు వివిధ మతాల కార్యక్రమాలతో రాజశేఖరరెడ్డి పాలన గండికొట్టగలిగింది. చిన్న రాష్ట్రాల నినాదంతో తెలంగాణా ప్రాంతంలో కొంత పట్టుసంపాదించినా టిఆర్‌ఎస్ రంగంమీదకు రావటంతో వెనకపడింది. ప్రత్యేక తెలంగాణా రాష్ట్ర నినాదంతో, విడిపోతే ఆంధ్రరాష్ట్ర అభివృద్ధి బాగా సాగుతుందన్న ప్రచారంతో రాష్ట్రంలో తన వునికిని కాపాడుకునే ప్రయత్నంలో వుంది. అయినా దీని ప్రమాదాన్ని తక్కువ అంచనా వేయరాదు. అఖిల భారత స్థాయిలో కాంగ్రెసు కూటమికి ప్రత్యామ్నాయ కూటమి కలిగివుంది. హిందూమత ప్రజలలో ముస్లిం వ్యతిరేకతను రెచ్చగొట్టడంలో ఇది ముందుంటున్నది. ప్రజలను సంఘటిత పరిచే కృషిలో నిమగ్నమయ్యే మన కార్యకర్తలకు దీని ప్రచార, కార్యక్రమాలు కల్పిస్తున్న ఆటంకం తక్కువగా లేదు. ఏమాత్రం స్థానం దొరికినా మతోన్మాద ఎజండాను అమలుజరపడానికి వెనుకాడదన్నది స్పష్టమే. కాంగ్రెసు వ్యతిరేక ఓటుతో కేంద్రంలో అధికారంలోకి వచ్చేందుకు ప్రాంతీయ పార్టీలపై ఆశలు పెట్టుకుని వ్యవహరిస్తున్న పార్టీ యిది.

### ప్రజారాజ్యంపార్టీ

'పుబ్బలో పుట్టి మఖలో మాడిపోయిన' పార్టీ యిది. రాజకీయ రంగంలో రెడ్డి, కమ్మకులాల ఆధిపత్యంలో అవకాశాలురాని బిసి కులాల ధనాఢ్యవర్గాల వారిని ఆకర్షించే సామాజిక న్యాయనినాదంతో ముందుకొచ్చిన ఈ పార్టీ ఇచ్చిన వాగ్దానాలను నెరవేరుస్తాననే నమ్మకాన్ని కలిగించేందుకు ప్రయత్నించింది. ఒక రాజకీయ పార్టీగా ఆర్థిక, రాజకీయ విధానాన్నీ ప్రకటించలేకపోయింది. భూస్వామ్య దళారీ బూర్జువా వర్గాల ప్రయోజనాలను వ్యతిరేకించే ఏ ఒక్క నినాదాన్ని ఈ పార్టీ యివ్వలేదు. ఎన్నికల్లో అన్ని అక్రమ, ప్రలోభ పద్ధతుల్లో మిగిలిన పార్టీలతో వెనుకబడకుండా గణనీయంగా ఓట్లు పొందగలిగినప్పటికీ, అది ఓట్లను చీల్చడంద్వారా రెండు ప్రధాన పార్టీలలో ఒకరి అభ్యర్థుల ఓటమికి ఉపయోగ పడింది. అనతికాలంలోనే కాంగ్రెసులో కలిసిపోయి ఉనికిని రద్దుచేసుకుంది.

> ***జలాశయాలకు సాగునీటి సరఫరా మొదట ప్రాధాన్యతగా నిర్ణయించాలి; వరదల నివారణ, తాగునీటి సరఫరా రెండవ ప్రాధాన్యతగా నిర్ణయించాలి; ఇవి రెండూ తీరగా మిగిలిన జలాలతోనే విద్యుదుత్పత్తి చేయాలి. అంతర్రాష్ట్ర జలవివాదాలను ప్రాంతీయ విద్వేషాలుగా రెచ్చగొట్టే కుటిలనీతిని మానివేయాలి. ఈ ఏడాది అనుభవంనుంచైనా కళ్లు తెరిచి నదీజలాలను దామాషా పద్ధతిలో కేటాయించాలని ట్రిబ్యునల్ ముందుకు వెళ్లాలి. ఈడిమాండ్లతో రైతాంగాన్ని సమాయత్త పరిచి సంఘటిత పోరాటాలకు సంసిద్ధపరిచే కృషి చేయాలి.***

### వైఎస్‌ఆర్‌సిపి

వారసత్వ రాజకీయాలు కేంద్రంగా ఏర్పడిన పార్టీ ఇది. తండ్రి హఠాన్మరణంతో వచ్చిన సానుభూతిని ఉద్వేగాలుగా మార్చి అధికారానికెగబాకటవే కార్యక్రమంగా కలిగిన పార్టీ యిది. సంక్షేమ రంగంనుండి ప్రభుత్వం తప్పుకునే విధానాన్ని కప్పిపుచ్చి, వాటిని పటిష్టంచేసి ప్రజలలో అశాంతి చెలరేగకుండా చూసేందుకు సామ్రాజ్యవాద ద్రవ్యసంస్థలు రూపొందించిన పథకాలను అమలుచేయటంలో ముందుండి, దానినే తనదిగా చిత్రించుకుని సంక్షేమ చర్యలకర్తగా పేరుపొందటంలో సఫలమైన రాజశేఖరరెడ్డి దెయ్యమై కాంగ్రెసును పీడిస్తున్నాడు. ప్రజాపునాది, విశ్వాసమూ లేని కాంగ్రెసుపార్టీ బలహీనత ఇదే. దీనితో తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని అక్రమార్జనలు సాగించాడంటూ జగన్మోహనరెడ్డిని బలమైన ప్రత్యర్థిగా లేకుండాచేయాలన్న తలంపుతో కాంగ్రెసు పార్టీ తన సర్వశక్తులూ ఒడ్డింది. దీనితో రాజకీయ అధికారగణాలెంతగా అవినీతి అక్రమార్జనల్లో కూరుకుపోయాయో క్రమంగా బహిర్గతమైంది. తండ్రి సంక్షేమ కార్యక్రమాల ప్రతిష్టతోనూ, సానుభూతితోనూ ఉప ఎన్నికల్లో గెలవగలిగాడు. దీనితో రాజకీయ శక్తుల పునస్సమీకరణకు బీజాలు పడ్డాయి.

ఒక రాజకీయ పార్టీగా దేశ, రాష్ట్ర స్థాయి ఆర్థిక, రాజకీయ సమస్యలపై ఒక విధానాన్ని ఈ పార్టీ ప్రకటించలేదు. తాము గెలిస్తే యుపిఏ కూటమికే మద్దతునిస్తామంటూ సూచనప్రాయంగా తమ విధానాలెలా వుండబోతాయో తెలిపింది. కాంగ్రెసు తానులోని ముక్కే గనుక దోపిడీ వర్గాల అనుకూలవిధానాలకే వత్తాసు పలుకుతుందన్నది స్పష్టమే.

పాలకవర్గ ముఠాల మధ్య వైరుధ్యాల ఫలితమే ఈ పార్టీ ఏర్పాటు అన్నది నిర్వివాదమే. ఇక్కడ లోతుగా పరిశీలించవలసిన అంశాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని పాలకవర్గాలు పదేపదే తమిళనాడుతో పోల్చుకోవటం, తరచుగా ఆంధ్రుల ఆత్మగౌరవ నినాదాన్ని గుర్తుచేయటం, అత్యంత సంపన్నవంత కుటుంబ సమూహాలు ఈ పార్టీ వెనుక చేరటం, ఉప ఎన్నికల్లో ఖర్చుపెట్టిన మొత్తాలు, అభ్యర్థులు ఎంత సంపన్నులైనా వ్యక్తులుగా ఖర్చుచేయగల స్థాయికి ఎన్నోరెట్లు ఎక్కువగా వుండటం మొదలగు అంశాలను గమనిస్తే, బడా సంపన్న వర్గాల కుటుంబాలు అభ్యర్థుల వెనుకచేరటం గతంలోకన్నా చాలా ఎక్కువ బహిరంగంగా సాగుతున్నదని అర్థమౌతున్నది. ఈ పరిణామాలు రాష్ట్రంలో మరో ప్రాంతీయ పార్టీని ముందుకు తేవాలని పాలకవర్గాలు భావిస్తున్నాయని సూచిస్తున్నాయి. యుపిఏ కూటమిని అధికారంలో కొనసాగించటానికి ఉత్తరప్రదేశ్‌పై పెట్టుకున్న ఆశలు కూలిపోవటంతో ఆంధ్రప్రదేశ్ సీట్లు పార్టీగా కాంగ్రెసుకు కీలకమవటంతో వైఎస్‌ఆర్‌సిపిని పూర్తిగా వ్యతిరేకించే విధానాన్ని కాంగ్రెసు చేపట్టింది.

ప్రాంతీయ పార్టీలూ, కూటములే దీర్ఘకాలంగా అధికారంలో వుంటున్న రాష్ట్రాలనే గమనిస్తే, అవి దోపిడీ పాలక వర్గాలకు సాపేక్ష స్థిరత్వాన్నిచ్చి వాటి ప్రయోజనాలకు ఆటంకం కలగకుండా చూస్తున్నాయి. ప్రజాదృక్కోణంనుండి చూసినప్పుడు, ఇవి అభివృద్ధి నిరోధక పాత్రనే నిర్వహిస్తున్నాయి. ప్రజాఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగించటంలోనూ, ప్రజాకర్షక పథకాలతో ప్రజల సంఘటితశక్తిని దెబ్బతీయటంలోనూ ముందుంటున్నాయి.

పాలకవర్గాల మధ్య వైరుధ్యాలను సరిగ్గా అంచనా వేసుకోవాలి. అవి ముందుకు తెస్తున్న పక్కదారులు పట్టించే నినాదాలకు ప్రజలు లోను కాకుండా వర్గ స్పృహను పెంచాలి.

### తెలంగాణా రాష్ట్ర సమితి

భారత అర్ధభూస్వామ్య–అర్ధవలస సమాజ ఫలితంగా సాగుతున్న అసమానాభివృద్ధి దేశవ్యాపితంగా ప్రాంతాల మధ్య అసమానతలు, వివక్షతలకు దారితీస్తున్నది. దీనికి మూలమైన ఆర్థిక, రాజకీయ విధానాలను అమలుజరుపుతున్న దోపిడీ పాలకవర్గాలు, తెలంగాణా ప్రాంత వెనుకబాటు సమస్యను తీసుకుని ముందుకు వచ్చాయి. తెలంగాణా వెనుకబాటుతనానికి తెలుగు ప్రాంతాన్నంతా కలిపి ఆంధ్రప్రదేశ్‌ను ఏర్పాటుచెయ్యటమే కారణమనీ, కోస్తా వలసశక్తులు అధికారంలో వుండటం మూలంగా తెలంగాణా అభివృద్ధి సాగలేదనీ, కోస్తా వలసవాదులు తెలంగాణా ప్రాంతం వచ్చి సౌభాగ్యవంతులయ్యారనే విశ్లేషణలతో తెలంగాణా రాష్ట్రసమితి ఏర్పడింది. తమ సాగుభూమికి నీరు, పంటకు న్యాయమైన ధర, తమ బిడ్డలకు ఉపాధి సౌకర్యాలు

మెరుగుపడాలని కోరుతున్న తెలంగాణా ప్రజల న్యాయమైన డిమాండ్లు, ఆకాంక్షలను ప్రాంతీయ విబేధాలు, విద్వేషాలుగా మరల్చేందుకు పూనుకుంది. తెలంగాణా ప్రజల న్యాయమైన డిమాండ్లలోవున్న ప్రజాస్వామిక స్వభావాన్ని మరుగుపర్చి, మనోఉద్వేగాలుగా రూపొందించేందుకు కరడుగట్టిన అభివృద్ధి నిరోధకశక్తి అయిన నిజామును కీర్తించటమూ, నెహ్రూ సైన్యాలు రైతాంగంపై క్రూరహింసాకాండ సాగించటానికి నాంది పలికిన రోజును తెలంగాణా విమోచన దినంగా పాటించటం చేసింది. మిగిలిన పాలకవర్గ పార్టీలు కూడా ఈ పోటీలోకి దిగాయి. ప్రాంతీయ అసమానతలను ఇరుప్రాంతాల ప్రజల మధ్య విద్వేషాలుగా రెచ్చగొట్టేందుకు పూనుకున్నాయి.

రాజకీయ ప్రక్రియగా తెలంగాణా సాధిస్తామంటూనే పాలక పార్టీల మధ్య పోటీ రాజకీయ ప్రక్రియగా మార్చాయి. విడతలవారీ ఉప ఎన్నికలతో ఉద్వేగాలను పెంచాయి. ప్రత్యేక తెలంగాణా డిమాండును బలపర్చని పాలక పార్టీలేదు. కానీ తెలంగాణా ఏర్పాటు మాత్రం జరగటం లేదు. ఈ స్థితి ప్రజలలో నిరాశవహ వాతావరణానికి చేరి వందలాది యువకుల ఆత్మహత్యలకు దారితీసింది. మరోవైపున పాలనలోవున్న కాంగ్రెసు పార్టీ ప్రజావ్యతిరేక విధానాలను అమలుజరుపుకుంటూ పోయింది. వీటిని ప్రశ్నించకుండా మిగిలిన పాలకపార్టీలు వాటి అమలుకే తోడ్పడ్డాయి. తాము గీసిన గిరిలోనే తెలంగాణా ప్రజల ఆందోళన ఉన్నంతవరకూ పట్టించుకోని పాలకులు, ఆ గిరి దాటి ప్రజలు ఏమాత్రం మిలిటెన్సీని ప్రదర్శించినా తీవ్ర నిర్బంధాన్ని అమలుజరిపాయి. మరే ప్రజాసమస్యపైన ప్రజలు కదలినా దానిపై నిర్బంధానికి పూనుకోవటంతో పాటు, ప్రాంతీయ తేడాలు చూపి వాటిని చీల్చేందుకు చూశాయి. చిదంబరం ప్రకటన నాటినుండి సకల జనుల సమ్మెవరకూ పరిణామాలు పాలకపార్టీ నిజవర్గ స్వభావాన్ని తెలిపాయి.

## సిపిఐ–సిపియం

'ఈ రివిజనిస్టు పార్టీలు, పాలకవర్గాల రైలుబండి ఆగినప్పుడు దాన్ని నెడతాయి, పరుగులు పెడుతున్నప్పుడు శాపనార్థాలు పెడతాయ'ని కా॥టి.ఎన్ అన్న మాటలు సిపిఐ, సిపియంలకు ఈనాటికీ వర్తిస్తాయి. నాటికంటే నేడింకా దిగజారి ఏదో ఒక పాలకవర్గ పార్టీకి సత్రగాయలుగా ఉండే స్థితికి చేరాయి.

రాష్ట్రంలో ఆర్థిక సంస్కరణల కార్యక్రమాన్ని ప్రారంభించి అమలు జరిపే దశలో టిడిపి పాలన వున్న కాలంలో టిడిపికి వత్తాసుగా నిలిచాయి. సంస్కరణల కార్యక్రమాన్ని పట్టాల మీదకెక్కించాయి. సంస్కరణల రథచక్రాల క్రిందపడి ప్రజల జీవితాలు ధ్వంస మౌతున్నప్పుడు శాపనార్థాలు పెట్టాయి. 2004లో కాంగ్రెస్ నాయకత్వాన ఏర్పడిన యుపిఏ కూటమిలో చేరటానికి, వత్తాసు పలకటానికి వెనుకాడలేదు. దీనికి కూడా హిందూమతోన్మాదాన్ని అధికారంలోకి రాకుండా చూడవలసిన అవసరాన్నే కారణంగా చూపెట్టాయి.

మన రాష్ట్రంలో సంస్కరణల పట్ల ప్రజల్లో వ్యతిరేకత పెరుగుతున్నప్పుడు గొణుక్కుంటూ కాంగ్రెస్ పంచన చేరాయి. టిడిపి విధానాలనే కాంగ్రెసు కొనసాగిస్తుండగా వూరుకొని మళ్లీ టిడిపి పంచన చేరాయి. నాలుగు ఓట్లు రెండు సీట్ల కోసమే ఇటువంటి పాట్లన్నీ పడుతున్నాయి.

సంస్కరణలను వ్యతిరేకిస్తున్నామంటూ తాటాకు చప్పుళ్ళు చేయటం వీటి విధానంగా వున్నది. ఆర్థిక సంస్కరణల్లోని అన్ని పార్శ్వాలకు తాము వ్యతిరేకం కాదనీ, వాటి అమలు పద్ధతిని మాత్రమే తాము వ్యతిరేకిస్తున్నామనీ పదే పదే చెప్పుకుంటున్నాయి. ఇప్పుడు సంస్కరణల సమస్యనంతా అవినీతి, ఆశ్రిత పక్షపాతాలకు కుదించి వేస్తున్నాయి. తామధికారంలో వున్న రాష్ట్రాలలో ఈ సంస్కరణల కార్యక్రమాన్ని అమలు జరిపాయి; జరుపుతున్నాయి. ప్రజలు ప్రతిఘటిస్తే రక్తపుటేరుల్లో ముంచటానికీ, దాన్ని సమర్థించుకునేందుకు ఫాసిస్టు ప్రచార పద్ధతుల వినియోగానికీ వెనుకాడటం లేదు. ఆ విధంగా బడా బూర్జువా వర్గాల ప్రయోజనాలను కాపాడే శక్తి సామర్థ్యాలు గల పార్టీలుగా వారి విశ్వాసాన్ని పొందేందుకు అన్ని రకాలుగా ప్రయత్నాలు చేస్తున్నాయి.

ప్రజల్లో పెల్లుబుకుతున్న అశాంతిని వ్యవస్థకు వ్యతిరేకంగా బ్రద్దలు కాకుండా, పాలకుల నుండి కొద్ది రాయితీలు పొంది, సంతృప్తి చెందే విధంగా దానిని మలిచే ఎత్తుగడలను అనుసరిస్తూ, ఎన్నికల్లో లబ్ధికి లోబర్చే స్థాయికి కుదించి వేస్తున్నాయి.

బూర్జువా పార్టీలతో నేస్తం చేస్తూనే మార్క్సిజాన్ని పరిరక్షించవచ్చుననే భ్రమలను వారి శ్రేణులకు కల్పిస్తున్నాయి. నిజమే, తమ తమ పార్టీల స్వతంత్ర భూమిక మీద ఆ వైఖరితో వ్యవహరిస్తున్నాయా? అంటే అదేం లేదు. భూస్వామ్య పెత్తందారీ వ్యతిరేక భూమిక, దళారీ బూర్జువా, సామ్రాజ్యవాద వ్యతిరేక భూమికపై

***సామ్రాజ్యవాదుల సంక్షోభం కమ్ముకురావటం, నగరాలలో సేవారంగంలో ఉపాధి కల్పన తగ్గుముఖం పట్టడంతో రాగల రోజులలో వీరికి ఉపాధి అవకాశాలు మరింతగా కుదించుకు పోతాయి. ఈ పరిస్థితినుండి బయటపడే మార్గ మెంచుకునే దిశగా వ్యవసాయ కూలీలు సంఘటిత పడకుండా తాత్కాలిక ఉపశమనంవైపు ఎదురు చూసే నిస్సహాయులుగా వారినుంచే పథకాలను అమలుచేస్తున్నారు.***

ప్రజాపునాది కలిగిన స్థానమెంత అన్న దానితో సంబంధంలేని వీరి వ్యవహారం మార్క్సిజం–లెనినిజాలకు దూరమయినదే. అవినీతి కుడ్యాలపైకి కాగితపు బాణాలను విసిరే కార్యక్రమంలో తలమునకలైపోయాయి. మొన్నటిదాకా లోక్‌సత్తా జయప్రకాశ్‌నారాయణ పని అదే. ఆయన పనిని వీరెత్తుకోవడం, ఆయనేమో పార్టీ రహిత ప్రజాస్వామ్యం నుంచి పార్టీ పెట్టే దాకా రావడం, ఎన్నికలలో నిలబడటం; నీతి, నిజాయితీ, పారదర్శకతను కాపాడే లక్ష్యంతో అధికారంలోకి రావాలనుకోవడం, వీరు వారవుతారు, వారు వీరవుతారనేందుకు సిపిఐ, సిపిఐ (ఎం)ల పిల్లిమొగ్గలు గమనిస్తే అర్థమౌతున్నది. వీటికి అధికారంలోకి రావడం ముఖ్యం. వచ్చాక తగిన బలం సమకూరిన తర్వాత అందులోనే ప్రజాస్వామ్యాన్ని, సోషలిజాన్ని నెలకొల్పగలమనే భ్రమలు వారి శ్రేణులకు కలిగించుతున్నాయి. తాత్విక, సైద్ధాంతిక రాజకీయ దిగజారుడును నేడు అత్యంత నగ్నంగా ప్రదర్శిస్తున్నాయి. పాలకవర్గాల అప్రజాస్వామిక అవినీతి ఊబిలోకి పార్టీ నిర్మాణాన్ని దించుతున్నాయి.

## దళిత సంస్థలు–పార్టీలు

దళిత సంస్థలు–పార్టీలు ప్రధానంగా సాంఘిక అణచివేతకు వ్యతిరేకంగా; రిజర్వేషన్ అమలు కోసం పనిచేసేవిగా ఉంటున్నాయి. ఇవి ప్రధానంగా పార్లమెంటరీ మార్గంలో దళిత, వెనుకబడిన కులాల అధికారాన్ని నెలకొల్పాలనే లక్ష్యంతో పనిచేస్తున్నాయి. ప్రస్తుత రాజ్యాంగానికి లోబడి తమ హక్కులను సాధించు కోవడానికి కృషి చేస్తున్నాయి. దళితులపై అగ్రకుల దోపిడీశక్తుల దాడులకు వ్యతిరేకంగానేగాక; ఉపాధి, భూమి, నివాసం తదితర డిమాండ్లతో దళిత ప్రజలలో ఇవి పనిచేస్తున్నాయి. అగ్రకుల భూస్వామ్య శక్తులకు బంట్లుగా, వారి చేతిలో కర్రలుగా ఉపయోగపడే అగ్రకుల పేదలకూ; వర్గరీత్యా భూస్వామ్య వర్గాన్ని వ్యతిరేకిస్తూ సంప్రదాయ భూస్వామ్య సంస్కృతి ప్రభావంలో వుండి, అంటరానితనం, కుల వివక్ష పాటించే అగ్రకుల పేదలకూ మధ్య తేడాను చూడలేకపోతున్నాయి. వర్గ పోరాట దృష్టి నుండి వ్యవహరించలేకపోతున్నాయి. అంతేగాక వివిధ దళిత కులాల పేరుతో, బి.సి. కులాల పేరుతో సంఘాలు నిర్మించుతున్నాయి. వాటి మధ్య పోటీ, ఒకే సంఘంలోనే విభేదాల మూలంగా అవి చీలికల ఊబిలోకి దిగి పోతున్నాయి. ఇది బాధాకరమైన విషయం. ఏనాటికైనా ఈ పీడిత దళిత కులసంస్థలు వర్గ పోరాట శక్తులతో భుజం భుజం కలిపి పోరాడుతాయనే ఆశతో ఉన్న కమ్యూనిస్టు విప్లవకారులు, దళిత ఉద్యమ శక్తులలోని చీలికలను నిరుత్సాహపరచవలసిఉంది. అదే సందర్భంలో అందులో ఉన్న కొన్ని కమ్యూనిస్టు వ్యతిరేకశక్తుల, వర్గపోరాట వ్యతిరేకశక్తుల వాదనలతో సంఘర్షించవలసి వుంది. మార్క్సిజం–లెనినిజం పట్ల, వర్గ పోరాట సూత్రం పట్ల వారు సుముఖులు కావడానికి మనం ఓపికగా కృషి చేయవలసి ఉంది. అగ్రకులాల పేదలలో దళితుల పట్ల కలిగి ఉన్న కులాధిక్య ధోరణి నుంచి బయట పడవేయాలి. దానికోసం వారిలో వర్గ చైతన్యాన్ని పెంపొందించాలి. ప్రజాతంత్ర విప్లవంలో భాగస్వాములు కావలసిన రైతుకూలీలు ప్రధానంగా దళిత వెనుకబడిన వర్గాలయినప్పుడు, వారిని వర్గ పోరాటంలో సంఘటితం చేయడంలో మనం విఫలం కాకూడదు. వారు సమీకృతమై ఉన్న సంస్థల పట్ల కూడా మనం మిత్రపూర్వకంగానే ఉండాలి. రాష్ట్ర వ్యాపితంగా వివిధ దళిత సంస్థలు, శక్తుల పట్ల మన రైతుకూలీ, కార్మిక, విద్యార్థి, యువజన సంస్థలు సంఘీభావంతో, ఐక్యవేదికల ద్వారానూ సంబంధ బాంధవ్యాలను కలిగి వున్నాయి. వీటిని మరింతగా పెంపొందించుకోవడమే కాక దృఢపరుచుకోవాలి.

## అసంఘటితవాదులు

అలాగే రాజకీయ పార్టీల గొడుగుల కింద పనిచేయ కూడదనీ స్వతంత్రంగా ఏ ఒక్కరైనా అనేక విధాలుగా సమాజ పురోగతి కోసం పనిచేయవచ్చుననే అసంఘటిత వాదులు ఏదో ఒక ఎజెండాని ముందుకు తెచ్చి 'ఈ విషయాలను చర్చించరా? అధ్యయనం చేయరా? మీ దగ్గర దీనికి సమాధానం ఉందా?' అనే రూపంలో నిలకడగా, నిక్కచ్చిగా పనిచేసే నిర్మాణం చుట్టూ తిరుగుతూ ప్రశ్నల వర్షం కురిపిస్తూ 'వదరబోతు'తనంతో నిర్మాణశక్తులను బలహీనపరిచే పనిలో నిమగ్నమై ఉన్నారు. విప్లవోద్యమం గత దశాబ్దాలలో వీరి బెడద నుంచి తప్పించుకుంటూ పని చేయవలసి వస్తున్నది.

ఇలాంటి "అసంఘటితవాదులు, వదరుబోతులు" ఆశ్రయించిన తమ సిద్ధాంతం–సమాజ పురోగమనానికి మార్క్సిజం కంటే చాలా మంచి సిద్ధాంతం అంటారు. దానిని మీరెందుకు పట్టించుకోరని అంటారు. కాలం చెల్లిన సంప్రదాయ విధానాలని మార్క్సిజాన్ని అవహేళన చేసేవారు, మార్క్సిజం పేరుతోనే మార్క్సిజాన్ని తొలచి వేసేవారు, పీడిత ప్రజల ఉద్యమాలను, వాటి పురోభివృద్ధిని సహించలేకపోతున్నారు. వారు గుర్రై ఉన్న నిస్పృహలోకి, నిష్క్రియా ధోరణిలోకి ఉద్యమ కార్యకర్తలను మళ్లించే ప్రయత్నంలో వున్నారు. ఇలాంటి ధోరణులను కనిపెట్టుకొని నడవవలసిన అవసరం ఉంది. ఇలాంటి శక్తులు అనేక అవతారాలు ఎత్తి విప్లవోద్యమం చుట్టూ తిరుగుతున్నాయి. వీరికి రాజకీయ సిద్ధాంతం, కార్యక్రమ రూపకల్పన, ఆర్థికం ఎక్కడ నుండో సప్లయి చేయబడుతూ వుంది. ఉద్యోగులను నియమించుకొని అభ్యుదయ పురోగమన ముసుగులో విప్లవ కార్యక్రమాలకు హాని చేస్తున్నాయి. వీరిపట్ల మనం నిష్కర్షగా వ్యవహరించవలసి ఉంది. శ్రామికవర్గ పార్టీ అగ్రగామి శక్తిగా ఈ పెటీబూర్జువా విప్లవ వాదాలను తుత్తునియలు చేయవలసి ఉంది. వాటిలో తమ వ్యక్తిగత అవసరాలు తీర్చుకోవచ్చు-అనుకునేవారు లేక ప్రజాసేవ చేయవచ్చునని భ్రమలకు లోనయిన వారు ఉన్నారు. వీరిలో నిజాయితీపరులకు సరైన సిద్ధాంత, రాజకీయ దృక్పథాన్ని అందించే కృషి చేయాలి. మన వుద్యమాల వైపుకు ఆకర్షించాలి.

## లోక్‌సత్తా పార్టీ

అవినీతి, ఆశ్రిత పక్షపాతం, చేసిన వాగ్దానాలు నెరవేర్చకపోవటం, సిద్ధాంత నిబద్ధత లేమి, పదవీ వ్యామోహం, క్షీణ విలువలతో మూర్తిభవించిన రాజకీయ నేతలను చూసి రాజకీయ వ్యవస్థనే ఏవగించుకునే స్థితికి మధ్యతరగతి వర్గాలు వస్తున్నాయి. దానిని కొంతకాలం ప్రచార సాధనాల ద్వారా పాలకవర్గాలు ప్రోత్స హించాయి. ప్రజాతంత్ర ఉద్యమం చీలికలు, బలహీనతలు కూడా మధ్యతరగతుల్లో నిస్పృహకు దారితీస్తున్నది. ఇది మొత్తం వ్యవస్థనే మార్చాలనే వైపుగా, అంటే విప్లవోద్యమం వైపుగా మలిచే అవకాశాలను కల్పిస్తున్నది. దీనిని పాలకులు తమ ప్రభావంలో వుంచుకునేందుకు పూనుకున్నారు. సమాచార చట్టం, కొన్ని చిట్టిపొట్టి సంస్కరణలు వగైరా చేపట్టారు. ఎన్‌జిఓలు రాజకీయ వ్యవస్థకు బయట కొంతవరకు మధ్యతరగతి వర్గాలను సమీకరిస్తున్నాయి. రాజకీయ రంగంలో మధ్యతరగతులను, మిగతా మేధావులను సమీకరించేందుకు పూనుకున్నాయి. అలాంటి పాత్ర నిర్వహించటానికే లోక్‌సత్తా పార్టీని ఏర్పాటు చేస్తున్నామని దాని నిర్మాతలు ప్రకటించారు.

ఈ వ్యవస్థ ఉత్కృష్టమైనదనీ, ఈ రాజ్యాంగం వున్నతమైనదనీ, దేశ సమగ్రాభివృద్ధికి ఇది అన్ని అవకాశాలనూ కల్పిస్తున్నదనీ, ప్రశంసలు కురిపిస్తున్నారు. కానీ రాజకీయ నాయకుల స్వార్థం, పదవీ వ్యామోహం, అవినీతి వంటి జాడ్యాలు మాత్రమే సమాజాన్ని పట్టిపీడిస్తున్నాయని, వీటిని నిర్మూలిస్తే ఈ వ్యవస్థ ప్రజలకు ఒక నూతన జీవితాన్నిస్తుందనీ లోక్‌సత్తా పార్టీ చెపుతోంది. భూస్వామ్య, బడా బూర్జువా దోపిడీ, సామ్రాజ్యవాద ఆధిపత్యంతోనూ, వాటికి అనుకూలంగా అమలవుతున్న విధానాలతోనూ ఈ పార్టీకి ఎలాంటి విబేధమూ లేదు. ఇది చెప్పే ప్రత్యామ్నాయాలు ఆర్థిక సంస్కరణల పరిధిలో వుండటమే కాక, అవినీతి లేకుండా వాటిని సమర్థ వంతంగా అమలు జరపాలని కోరేవిగా వుంటాయి. విద్యుత్తు రేట్ల పెంపుదల వ్యతిరేక ఉద్యమం సందర్భంగా దాని వైఖరి దీనినే తెలుపుతుంది. కాగా ఎన్నికల్లో డబ్బు, నేరస్తుల ప్రాబల్యం తగ్గాలి వంటి మిగిలిన నినాదాలు మధ్యతరగతి భద్రజీవుల క్రియారహిత అహానికి మలాముపట్టి వేసి జోకొట్టే చందంగా వుంటుంది. ఇటీవలి కాలంలో ఇది ధనికరైతు, భూస్వామ్య అనుకూల వ్యవసాయరంగ నినాదాలతో ముందుకు వస్తున్నది. విదేశీ పెట్టుబడిని సూత్రరీత్యా వ్యతిరేకించకపోగా కొన్ని సమయాల్లో ప్రపంచబ్యాంకు నిర్దేశిత విధానాల సమర్థకుడిగా నిలుస్తున్నది.

***కమ్యూనిజంపైనా, సోషలిస్టు భావాలపైన సామ్రాజ్యవాదులు సైద్ధాంతిక, రాజకీయ దాడిని తీవ్రం చేశారు. పెట్టుబడిదారీ విధానం తప్ప మరో ప్రత్యామ్నాయం మానవాళికి లేదన్న, సామ్రాజ్యవాదుల సహాయ సహకారాలు లేకుండా వెనుకబడిన దేశాలలో "ప్రజాస్వామ్యం" పరిఢవిల్లదన్న భావనను వ్యాప్తి చేస్తున్నారు. గత ఏడాది ఆరబ్బు దేశాలలో వచ్చిన ప్రజావెల్లువ ఈ వాదనను తుత్తినియలు చేసింది.***

## సంస్కృతి

నూతన ఆర్థిక సంస్కరణల తర్వాత పత్రికలూ, టి.వీలు, రేడియో, సినిమాలు సంస్కృతిని రూపొందించే పాత్రను పుచ్చుకున్నాయి. వ్యాపార ప్రకటనల ద్వారా పాలకవర్గాలే ఈ పాత్రను వాటికి నిర్దేశించాయి అనటం సరిగ్గా వుంటుంది. తమకు వ్యాపార ప్రకటనలు యిస్తున్న వారి వాణిజ్య అవసరాలను తీర్చే విధంగా తమ ఉత్పత్తులను అవి మలుచుకుంటున్నాయి. వసుంధర, చెలి వంటి ప్రత్యేక పేజీలు, సఖీ వంటి ప్రత్యేక కార్యక్రమాల ద్వారా వినియోగ సరుకుల అమ్మకాలను ప్రోత్సహిస్తున్నాయి. పొదుపుగా వుండటంలోనే సౌఖ్యముందన్న పాత సంస్కృతిని ధ్వంసంచేసి, ఎంత ఎక్కువగా వినియోగసరుకులు కలిగివుండటాన్ని ప్రదర్శించటమే జీవన సంస్కృతిగా మార్చివేస్తున్నాయి. వీటిని పొందటంలోనే ఆనంద ముందన్న భావనను వ్యాప్తి చేస్తున్నాయి. దీనితో ఎలాగైనా వాటిని అనుభవించటమే ముఖ్యమన్న కోర్కెలను వ్యాపిస్తున్నాయి. పగలంతా శ్రమించిన కార్మికుడు 4 రూ. మజ్జిగ ప్యాకెట్టు బదులు 9.రూ పెప్సీ తాగి దాహం తీరిందని భ్రమించేటంతగా వీటి ప్రభావం వుంటున్నది. వ్యష్టివాదాన్ని పరాకాష్టకు తీసుకువెళుతూ సమష్టి జీవన విలువలన్నింటినీ యిది ధ్వంసం చేస్తున్నది. కన్స్యూమర్ ఎడ్యుకేషన్ పేరిట గుత్త కంపెనీల బ్రాండెడ్ సరుకులపై విశ్వసనీయతను పెంచుతున్నాయి. పర్సనల్ కౌన్సిలింగ్ పేరిట, నైతిక, కుటుంబ ప్రవర్తనావళిని వ్యష్టివాదం వైపు మరలిస్తున్నాయి. ఒకనాడు అందాల పోటీలను నిరసించిన ఆంధ్రావనిలో నేడవి డ్రాయింగు రూముల్లోకి, కళాశాలల వేదికలపైకి చొప్పించగలిగాయి.

సారా, బ్రాందీ సంస్కృతి సారా దుకాణాలనుండి బార్‌లనుండీ, వీధుల్లోకి, విశాల ఆఫీసుల్లోకి ప్రవేశించింది. విద్యార్థులలో సిగరెట్లు కాల్చేవారి సంఖ్య తగ్గి బ్రాందీ తాగే వారి సంఖ్య పెరిగింది. ఈ విధంగా యువతను నిర్వీర్యపరిచే సంస్కృతి వ్యాపించింది.

సంస్కృతిలో ప్రధాన భాగమైన కళలు ఈ వినియోగ సంస్కృతి దాడికి లోనవుతున్నాయి. కళ కళ కోసమని వాదించే వారి సంఖ్య కూడా తగ్గిపోతూ, కళ గుర్తింపు పొంది నాలుగు డబ్బులు సంపాదించుకునేందుకు అనే వారి సంఖ్య పెరిగిపోతూ వుంది. దీనికి సినిమాలు, టీ.వీ.లే అంతిమ గమ్యమయ్యాయి. ప్రభుత్వంకానీ, పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్న సాంస్కృతిక సంస్థలనేవిగానీ యిచ్చే అవార్డులన్నీ వీటి చుట్టూనే పరిభ్రమిస్తున్నాయి. ఫలితంగా సృజనాత్మకతను కోల్పోతున్న కళారంగానికి 'అనుకరణే' మనుగడ అవుతున్నది. దాన్ని అల్లుకునే నీచ వాణిజ్య భూస్వామ్య సంస్కృతుల ప్రచార వేదికగా కళారంగం సాగుతున్నది.

ఈ సంక్షోభాన్నే సాహిత్యరంగం కూడా ఎదుర్కొంటున్నది. సజీవ కాల్పనిక సాహిత్య సృజన వెనక్కు నెట్టబడింది. జరుగుతున్న సాహిత్య సృజనలో కూడా కెరీరిజం ప్రధాన పాత్ర వహిస్తున్నది. ప్రాచుర్యం పొందిన రచయితలు నేడు కెరీర్ గైడెన్సు, "వ్యక్తిగత వికాస" మనే పుస్తకాల రచనలో మునిగి సొమ్ము చేసుకుంటున్నారు. ఫలితంగా చదివే అలవాటు అన్నదే పోగొట్టుకొంటున్నారు. ఇంగ్లీషు భాషా ప్రభావంతో నూతన తరాలలో అధ్యయన అలవాటు సాంతం పోతున్నది. దీనికి టీ.వీల ప్రభావం కూడా తోడయ్యింది.

ప్రజల భాషలో విద్య, పరిపాలన కొరకు కొన్ని దశాబ్దాలుగా సాగుతున్న ఉద్యమాన్ని, పాలక వర్గాలు ప్రాచీన భాషా గుర్తింపు నినాదంతో ప్రక్కతోవ పట్టించాయి. జిల్లా రచయితల సంఘాలను, స్థానిక సాహిత్య సంఘాలను వెనుకనుండి నడిపిస్తున్నాయి. కనీసం ప్రాథమిక స్థాయిలోనైనా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలన్నింటిలో మాతృభాషను బోధనా మాధ్యమంగా చేర్చే చర్యల గురించి ప్రభుత్వాలు పట్టించుకోవడంలేదు. పైపెచ్చు ప్రభుత్వ పాఠశాలల్లో 'సక్సెస్' పేరుతో ఇంగ్లీష్ మాధ్యమాన్ని ప్రాథమిక స్థాయిలో ప్రవేశపెట్టిన ఘనత మన రాష్ట్ర ప్రభుత్వానిదే.

నూతన ఆర్థిక సంస్కరణలు, విద్య, వైద్యరంగాల నుండి ప్రభుత్వం తప్పుకొనటం ప్రతీపశక్తులకు ఊపిరిపోసింది. వైద్యం కోసం ప్రజలు బాబాలను ఆశ్రయించవలసిన దుస్థితిలోకి నెట్టబడ్డారు. దొంగ బాబాల మోసాలను బయటపెట్టి, ప్రజల అజ్ఞానాన్ని పారద్రోలే సామాజిక కర్తవ్యాన్ని నిర్వహిస్తున్నామన్న ఫోజుపెట్టి, మీడియా ప్రజలను మూఢులుగా చిత్రిస్తున్నాయి. అదే సమయంలో సర్వపాపాలకు నిలయమైన సత్యసాయి బాబా లీలలను ప్రత్యక్ష ప్రసారాలు చేస్తున్నాయి. మధ్యతరగతి భద్రజీవుల అహాన్ని సంతృప్తిపరచి సొమ్ము చేసుకుంటున్నాయి.

మతోన్మాద రాజకీయాల మరో పార్శ్వం చాపక్రింద నీరులా మత ప్రచారాన్ని విస్తృతం చేయటం వ్యవస్థీకృతం

చేయటం, క్రిస్టియన్ మతం ఇప్పటికే "స్వతంత్ర" వ్యవస్థగా సాగుతుండగా, హిందూ, ముస్లిం మతాలను కూడా వ్యవస్థీకృతం చేసే ప్రయత్నాలు సాగుతున్నాయి. విచిత్రమేమంటే గ్రామీణ మార్కెట్టులుగా పాతకాలపు సంతలుగా బడా వాణిజ్య వాహకాలుగా ఈ మత ప్రచార సభలు మారటం. మతమూ, వాణిజ్యం సహకరించుకుంటూ పరస్పర ప్రయోజనాలు నెరవేర్చుకుంటున్నాయి. ఈ మార్గాన్ని క్రిస్టియన్ మతమే చూపింది. నెమ్మదిగా హిందూ, ముస్లిం మతాలు అనుసరిస్తున్నాయి. ఈ మార్పు వెనుక పాలకవర్గాల ప్రత్యక్ష పాత్ర వుంది. దేవాలయాల పునరుద్ధరణ, వాటికి తిరునాళ్ల నిర్వహణ, విస్తృత ప్రచారము, ఆర్టీసీతో ప్రత్యేక బస్సుల నిర్వహణ రూపంలో దీనిని ప్రోత్సహిస్తున్నాయి.

పాత వ్యవస్థ, దాని విలువలూ, నాశనమై, కొత్త వ్యవస్థ, కొత్త విలువలూ నెలకొనవలసిన తరుణంలో, పాతది కొనసాగుతూనే కొత్త దోపిడీ విలువలు వచ్చి పడటంతో సమాజం అత్యంత హీన సంస్కృతి బారిన పడి గిలగిల్లాడుతున్నది. హీన సంస్కృతికి అత్యంత దారుణంగా బలవుతున్న వారు స్త్రీలు. ఈ హీనవస్తు, వ్యామోహ సంస్కృతి తిరస్కరణ ఉద్యమాన్ని నిర్మించాలి.

## రగులుతున్న అసంతృప్తి-ప్రజాపోరాటాలు

నానాటికీ తీవ్రమౌతున్న సర్వవ్యాపిత సంక్షోభం ప్రజలలో అశాంతిని పెంచుతున్నది. జీవన, పని పరిస్థితులు మెరుగుపడాలనీ, ఉపాధి అవకాశాలు పెరగాలనీ, మెరుగైన జీవితాన్ని గడపాలన్న వారి కనీస ఆకాంక్షలు కనుచూపు మేరలో నెరవేరే దారి కన్పించటం లేదు. నిరాశా, నిస్పృహల్లో కూరుకుపోతున్నారు. కొద్దిపాటి సహాయాన్ని కూడా చీకటిలో ఆశాకిరణంలా చూస్తున్నారు.

ఈ దుర్భర పరిస్థితి ప్రజలలో చైతన్యాన్ని రగుల్చుతున్నది. కార్యాచరణకు పురికొల్పుతున్నది. భూమికోసం, ఇంటికి చారెడు నేల కోసం వారు ఆందోళనలు సాగిస్తున్నారు. పాలకుల దోపిడీ విధానాలకు నిరసనలు తెలుపుతున్నారు. మెరుగైన వేతనాల కొరకు, పనిభద్రత కొరకూ పోరాటాలు సాగిస్తున్నారు. తమ జీవన విధానం, జీవనోపాధి, సాంప్రదాయక హక్కుల కొరకు ఆదివాసీలు ఉద్యమిస్తున్నారు. ఆత్మగౌరవం కోసం, కులవివక్ష, అణచివేతలకు వ్యతిరేకంగా దళితులు ప్రతిఘటనలోకి వస్తున్నారు. ఉపాధి అవకాశాల కొరకు, మెరుగైన వేతనాలకూ, పని ప్రదేశాల్లో రక్షణకూ, తమపై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా మహిళలు సంఘటితపడుతున్నారు. ఇవి దోపిడీ పాలకవర్గాల పాలనకు సవాలుగా నిలుస్తున్నాయి.

దోపిడీ వర్గాలు తమ పాలనను సాగించుకునేందుకు నిర్బంధంపైనా, నిర్బంధ యంత్రాంగంపైనా ఆధారపడటం నానాటికీ పెరిగిపోతున్నది. ప్రదర్శనకు అనుమతులు, ఎక్కడ ఎంతసేపు ఏ విధంగా నిర్వహించాలో పోలీసు అధికారులే నిర్ణయిస్తున్నారు. ప్రజల సమష్టి కార్యాచరణలో పోరాట రూపాలుగా ముందుకొచ్చిన బంద్‌లు, ధర్నాలు, సమ్మెలను చట్టవిరుద్ధ చర్యలుగా, నేరాలుగా ప్రకటిస్తున్నారు. కార్యనిర్వాహక వర్గ నిరంకుశ పోకడలను అదుపు చేస్తుందని చెప్పుకున్న న్యాయవ్యవస్థ, ఆ నిరంకుశత్వానికే చట్టబద్ధత అన్న ముసుగు తొడుగుతున్నది. తమ కోర్కెలకు న్యాయమైన పరిష్కారాన్ని కోరుతూ అత్యంత శాంతియుతంగా నిరసన తెలుపుతున్న వివిధ సెక్షన్ల ప్రజల మీద లాఠీఛార్జీలూ, తుపాకీ కాల్పులకు పాల్పడటం నానాటికీ పెరిగిపోతున్నది. విచారణ లేకుండా ఏళ్ల తరబడి జైళ్లలో కుక్కేందుకు పాత చట్టాలకు కోరలు తగలించటంతోపాటు పాశవిక నిర్బంధకాండకు పాల్పడటం, ప్రజా నాయకులను హత్య చేయటం సామాన్య విషయమైంది. టెర్రరిస్టుల పేరిట ఎవరినైనా చంపే హక్కును పోలీసు యంత్రాంగానికీ, సైన్యానికీ దఖలు పరిచింది. బూటకపు ఎన్‌కౌంటర్లను పథకం ప్రకారం సాగిస్తున్నాయి.

ప్రజల సమష్టి కార్యాచరణను దెబ్బతీసేందుకు ప్రజల మధ్య వైషమ్యాలను రెచ్చగొడుతున్నది. కుల, మత, ప్రాంతీయ ఉపశ్రేణుల నడుమ విద్వేషాలను కల్పించి పెంచి పోషించే కృషిలో వున్నది. తన స్వార్థ, సంకుచిత అవసరాల మేరకు తరతమ మోతాదుల్లో ఈ మూటిని ఆంధ్రప్రదేశ్‌లో వినియోగించటంలో పాలకులు ఆరితేరారు. వర్గీకరణ పేరిట దళితుల మధ్య చిచ్చు పెట్టారు. వెనుకబాటుతనం, ప్రాంతీయ అసమానతలు పెంచుతూనే, ప్రాంతీయతత్వాన్నీ, వైషమ్యాలను పెంచారు. హిందూ మతోన్మాదాన్నీ, మైనారిటీ మతస్తులపై వ్యతిరేకతనూ నగ్నంగానూ, నాజూకుగానూ పెంచి పోషిస్తున్నారు. దేశంలో ఎక్కడ "టెర్రరిస్టు"ను అరెస్టు చేసినా దాని ముస్లిం మూలాలు హైద్రాబాద్‌కు ముడిపెట్టడం ద్వారా ముస్లింలను నిరంతరం అభద్రతా భావంలోనే ఉంచటంలో కాంగ్రెసు పాత్ర తక్కువగా లేదు. ఇవన్నీ ప్రజలను చీల్చి వారి ఐక్యతను నాశనం చేసి తమ పాలనను సాగించుకునే కుటిలయత్నాలే.

***జీవన సమస్యల పరిష్కారాన్ని కోరుతూ అన్నివర్గాల ప్రజలూ పోరాట పథాన్ని చేపడుతున్నారు. మారుతీ - సుజుకీ కంపెనీలో సాగిన కార్మిక సమ్మె, ప్రస్తుతం అరవింద్ మిల్లులో సాగుతున్న సమ్మె దీనినే తెలుపు తున్నాయి. రైతాంగం నీటికొరకూ, ఎరువుల కొరకూ, విత్తనాల కొరకూ, తమ పంటలకు న్యాయమైన ధరకొరకూ పోరాటాలు ఆందోళనలూ సాగిస్తున్నారు. ఉద్యోగులూ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పోరాటాలలోకి దూకుతున్నారు. అగ్రకులాల భూస్వాముల దాడులకు దళితుల నుండి ప్రతిఘటన పెరుగుతున్నది. మహిళా సమస్యపట్ల చైతన్యం పెరుగుతున్నది.***

ప్రజలు పోరాట పథం చేపట్టకుండా, తమ ప్రభావంలోనే వుంచుకునేందుకు పాలకవర్గాలు సంస్కరణల నినాదాలు యిచ్చేవి. ప్రజల పోరాటాలపై నీళ్లు చల్లేందుకు చట్టాలు చేసేవి. అయినా అవి ఏనాడూ వాటిని అమలు జరపలేదు. 80ల వరకూ సాగిన ఈ ప్రహసనాన్ని అపివేశారు. ప్రజాకర్షక పథకాల పేరుతో తక్షణ సహాయమందించాలన్న ఆర్భాటంతో, ప్రజలను సహాయం కోసం నిరంతరం ఆఫీసుల చుట్టూ తిప్పుకునే పథకాలను ముందుకు తెచ్చారు. విద్యారంగం నుండి తప్పుకుంటూ అక్షరజ్యోతి కార్యక్రమాలను, వైద్యరంగం నుండి తప్పుకుంటూ తాత్కాలిక వైద్య శిబిరాల నిర్వహణ, ఆరోగ్యశ్రీ వంటి ఆకర్షణీయ పథకాల నుండి వృద్ధాప్య పింఛన్లు, ఆడపిల్లల పెళ్లికి డిపాజిట్లు, చంటి పిల్లలకు ఆహారం, ఉయ్యాల పథకం, మధ్యాహ్న భోజన పథకం లాంటి ఉపశమన కార్యక్రమాలు అందులో భాగమే.

పాశవిక నిర్బంధం, విభజించి-పాలించటం, ప్రజాకర్షక పథకాలు, క్షీణ సంస్కృతి వ్యాప్తి అనే జమిలి వ్యూహంతోనే పాలకులు ప్రజలను అణచి వుంచుతున్నారు.. అయినా వివిధ వర్గాల సెక్షన్ల ప్రజలు ఆందోళనలు, పోరాటాలలోకి వస్తున్నారు. సంఘటితంగానూ, అసంఘటితంగానూ సాగుతున్నారు. సరైన దిశలో తమను నడిపించే నాయకత్వం కొరకు వెతుకుతున్నారు. అలాంటి నాయకత్వం అందినచోట అడ్డంకులనధిగమించి కృతనిశ్చయంతో పోరాడుతున్నారు. మితవాద, అతివాద శక్తులు ప్రజల చొరవనూ, శక్తినీ వృథా పరుస్తున్నారు. వారిని నిర్మాణయుతంగావించటం లేదు. తత్పర్యవసానంగా ఆశించిన ఫలితాలందక ప్రజలు నిరాశకు గురౌతున్నారు. ఈ క్లిష్ట పరిస్థితిలో ప్రజలకు నాయకత్వమందించవలసిన బాధ్యత విప్లవ కమ్యూనిస్టులపైన వుంది. ప్రజాపోరాటాలతో ఆటలాడకుండా, అత్యంత బాధ్యతాయుతంగా ప్రజాపంథాలో సమస్త ప్రజాఉద్యమాలను పట్టువిడుపులతో కూడిన పోరాట పద్ధతుల్లో నడుపవలసి వుంది. వాటిని సంఘటిత ప్రజాఉద్యమాలుగా రూపొందించి పురోగమింపచేయాలి.

**ఈ క్రింది మౌలిక కర్తవ్యాల సాధనకు ప్రజానీకాన్ని <u>చైతన్యయుతులను గావించుతూ తక్షణ డిమాండ్ల సాధనకై</u> ప్రజలను సన్నద్ధులను చేసి పోరాటాలకుపక్రమించాలి.**

## కర్తవ్యాలు

1. 'దున్నేవానికే భూమి' ప్రాతిపదికన విప్లవ భూ సంస్కరణల అమలు కోసం రైతుకూలీ పేదలంతా సంఘటిత శక్తిగా నిలబడి పోరాడాలి.
2. విదేశీ పెట్టుబడులను జాతీయం చేయాలి.
3. జాతీయ పరిశ్రమలను అభివృద్ధి చేయాలి.
4. భూమి, నీరు, అడవిపై ఆదివాసుల హక్కుల పరిరక్షణకై పోరాడాలి.
5. నీటి వనరుల ప్రైవేటీకరణను వ్యతిరేకించాలి. జలవనరులపై రైతాంగ హక్కును పరిరక్షించుకోవాలి.
6. జల వనరుల వినియోగంలో సాగు భూములకు నీరివ్వడానికి ప్రాధాన్యతనివ్వాలి.
7. వ్యవసాయరంగంలో కార్పోరేటీకరణ, సామ్రాజ్యవాదీకరణను తిప్పికొట్టడానికై ఉద్యమించాలి.
8. ద్రవ్యరూపంలో విదేశీ పెట్టుబడుల చొరబాటును నిరోధించాలి

## డిమాండ్లు

### 1. రైతాంగం

అ. పంటఖర్చుల ప్రాతిపదికన, స్వామినాథన్ కమీషన్ సిఫార్సుల ప్రాతిపదికగానైనా పంటలకు న్యాయమైన ధరలను ప్రకటించాలి.

ఆ. మార్కెట్ యార్డులను రైతుకమిటీల అధీనంలో ఉంచాలి.

ఇ. రైతులకు సాధారణ వడ్డీ, వ్యవసాయరంగానికి అవసరమైన రుణసౌకర్యాలు కల్పించాలి.

ఈ. నీటిపారుదల సౌకర్యాల కల్పన, రైతాంగ హక్కులు పరిరక్షించాలి.

ఉ. వ్యవసాయ రంగంలో భవిష్య వ్యాపారం, చట్టా వ్యాపారాలను నిషేధించాలి.

ఊ. విద్యుత్తు, ఎరువులు, విత్తనాల రంగంలో స్వావలంబన విధానం అమలు చేయాలి.

ఎ. పంటల ధరల నిర్ణయంలో మార్కెట్టు శక్తుల ప్రమేయం ఉండరాదు.

### 2. వ్యవసాయకూలీలు

అ. వ్యవసాయకూలీలకి కనీస వేతనాల చట్టాన్ని సవరించి సక్రమంగా అమలు జరిపే యంత్రాంగాన్ని ఏర్పరచాలి.

ఆ. కౌలుదార్లను అందరినీ రిజిస్టరు చేసి 1/3 వంతు కౌలు రేటు నిర్ణయించి, కౌలుదార్లకి రుణసౌకర్యం కల్పించాలి.

ఇ. గ్రామీణ చేతి వృత్తులను పరిరక్షించేందుకు అన్ని చర్యలు చేపట్టాలి.

### 3. గిరిజనులు

అ. 1/70 రెగ్యులేషన్ను, 7/2004 పంచాయితీరాజ్ సవరణ చట్టాన్ని అమలు చేసి గ్రామసభలు ద్వారా ఆదివాసీ ప్రాంతాల భూమి సమస్యలు పరిష్కరించాలి.

ఆ. 1/70 రెగ్యులేషన్ అమలు జరిపి ఆదివాసులకు భూమిని తిరిగి అప్పగించాలి.

ఇ. 4/2005 చట్టాన్ని అమలు జరిపి గ్రామసభలకు అధికారాలు అప్పగించాలి.

ఈ. గ్రామసభల ఆమోదం లేకుండా భూములను, అడవులను అభివృద్ధి సాకుతో వినియోగించరాదు.

ఉ. 2006 ఆదివాసీ హక్కుల చట్టంపై కోర్టు స్టేలను తొలగించి, వన్యప్రాణి సంరక్షణ పేరిట తరతరాలుగా అడవులలో నివశిస్తున్న ఆదివాసులను తొలగించరాదు. ప్రాజెక్టులు, మైనింగు పేరిట ఆదివాసుల గెంటివేతను నిలిపివేయాలి.

### 4. ప్రాజెక్టులు-నిర్వాసితులు

అ. విస్తృతమైన నిష్పాక్షిక ప్రజాభిప్రాయ సేకరణ ఆమోదం తర్వాతే ఏ ప్రాజెక్టునైనా తలపెట్టాలి.

ఆ. సమగ్ర, శాస్త్రీయ పునరావాసం ముందు కల్పించిన తర్వాతే ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి.

ఇ. 1894 నిర్బంధ భూసేకరణ చట్టాన్ని రద్దు చేయాలి.

ఈ. భూమికి భూమి, అడవికి అడవితో సమగ్ర పునరావాసాన్ని కల్పించిన తర్వాతే ప్రాజెక్టులు నిర్మించాలి.

ఉ. జలవనరుల పంపకంలో ప్రాంతాల అసమానతలకి తావు లేకుండా జలవనరుల పంపిణీ జరగాలి.

### 5. ఖనిజాలు

అ. ఇనుము, బాక్సైట్ తదితర ఖనిజాల తవ్వకంలో సామ్రాజ్యవాదుల దోపిడీకి అవకాశం ఇవ్వడాన్ని ప్రతిఘటించాలి.

ఆ. ప్రజా ఖనిజ విధానం, దేశ భవిష్యత్తు అవసరాల ప్రాతిపదికన ఖనిజాల విధానం అమలు జరపాలి.

ఇ. దేశ సహజ వనరులను కారుచౌకగా విదేశీ మార్కెట్ శక్తులకి దోచిపెట్టడాన్ని ప్రతిఘటించాలి.

ఈ. లభ్యమయ్యే ఖనిజాల ఆధారంగా దేశీయ పరిశ్రమలను అభివృద్ధి చేయాలి. రాయలసీమ, రాయదుర్గం జిల్లాలలో వెంటనే ఇనుము, ఉక్కు కర్మాగారాలను నిర్మించాలి.

ఉ. ఖనిజ వనరులను కారుచౌకకు ఎగుమతి చేయటం మరియు విదేశీ గుత్త కంపెనీలపరం చేయటం ఆపాలి, ప్రజల అవసరాలను తీర్చటం లక్ష్యంగా సహజ, ఖనిజ వనరుల వినియోగం జరగాలి.

### 6. పరిశ్రమలు-కార్మికరంగం

అ. ఎగుమతి ఆధారిత అభివృద్ధి అన్న విధానాన్ని రద్దు చేయాలి. సెజ్‌లు, కారిడార్‌లు వంటి పథకాలను రద్దు చేయాలి.

ఆ. ద్రవ్యరంగంలో విదేశీ కంపెనీలకు అనుమతిని రద్దుచేయాలి.

ఇ. ఫ్యాక్టరీల మూసివేతలను, కార్మికుల తీసివేతలను నిలుపుచేయాలి.

ఈ. ప్రైవేటీకరణ, కంట్రాక్టీకరణ ఆపివేయాలి.

ఉ. 180 రోజులు పనిచేసిన వారందరినీ పర్మనెంటు చేయాలి.

ఊ. ఎగుమతుల ఆధారిత అభివృద్ధి అన్న విధానం రద్దు చేయాలి. సెజ్‌లు, కారిడార్‌ల వంటి పథకాలను రద్దు చేయాలి.

ఎ. ఉపాధిరహిత అభివృద్ధి నమూనాను తిరస్కరించి శ్రమఆధారిత పారిశ్రామికీకరణను ప్రోత్సహించాలి.

ఏ. చిన్న పరిశ్రమలకు రక్షణ కల్పించాలి.

ఐ. ప్రజల అవసరాలను తీర్చే పరిశ్రమలను ప్రోత్సహించాలి.

ఒ. విదేశీ పెట్టుబడులను అనుమతించరాదు.వాటిని జాతీయం చేయాలి.

ఓ. వ్యవసాయ, పారిశ్రామికాభివృద్ధికి స్వతంత్ర, స్వావలంబిత విధానాన్ని అమలు చేయాలి. దాని కొరకు సేవారంగాన్ని అభివృద్ధి పరచాలి.

ఔ. వ్యవసాయ రంగంతో జోడించిన పారిశ్రామికాభివృద్ధిని సాగించాలి. దీనికి ప్రజావసరాలను తీర్చటం లక్ష్యంగా వుండాలి.

### 7. విద్య-సంస్కృతి

అ. సార్వజనీన ప్రాథమిక విద్యను ఉచితంగా అందించాలి.

ఆ. సార్వజనీన మాధ్యమిక విద్యను, సామాజిక ఉత్పత్తితో జోడించి శాస్త్రీయ అభినివేశం సాధించాలి. ఈ స్థాయి విద్య ముగిసేసరికి ఉపాధి పొందే నైపుణ్యాన్ని గరపాలి.

ఇ. విద్యా బోధన-పాలన అన్ని స్థాయిల్లో మాతృభాషలో సాగించాలి.

ఈ. ఉన్నత విద్యారంగం ప్రభుత్వ ఆధీనంలో వుండాలి.

ఉ. విదేశీ యూనివర్సిటీలను రద్దు చేయాలి.

ఊ. ఉన్నత విద్య సామాజిక అభివృద్ధికి తోడ్పడే దిశగా శాస్త్రీయత, ప్రజాస్వామికత ప్రాతిపదికగా సాగాలి.

ఎ. మైనారిటీలపై దాడులను ఆపాలి.

ఏ. ముస్లింలను దేశద్రోహులుగా చిత్రించే, మతోన్మాద చర్యలను అణచివేయాలి.

ఐ. హిందూవుల ఆచారాలనే భారతీయతగా, భారత సంస్కృతిగా సాగిస్తున్న చర్యలను నిరసించాలి, అరికట్టాలి.

ఒ. రాజ్య వ్యవహారాలలో మతాన్ని జొప్పించరాదు.

### 8. ప్రజా హక్కులు

అ. వైద్యం, ఆరోగ్య రక్షణ ప్రభుత్వ రంగంలో వుండాలి.

ఆ. సార్వజనీన ఉచిత ఆరోగ్య సేవలు ప్రభుత్వం నిర్వహించాలి.

ఇ. ప్రజల పొదుపుకు అన్ని రక్షణలూ కల్పించి, వాటిని ప్రజా జీవితాలను మెరుగుపర్చేందుకు పెట్టుబడిగా వాడాలి. ప్రజాధనాన్ని దిగమింగే అవినీతిని అరికట్టాలి.

ఈ. ప్రజల వాక్, సభా, స్వాతంత్ర్యాలనూ, నిరసన తెలిపే హక్కును కాలరాచే చట్టాలను రద్దు చేయాలి.

ఉ. ప్రజా ఉద్యమాలపై తుపాకీ కాల్పులూ, లాఠీఛార్జీలనూ సాగించరాదు.

ఊ. రాజకీయ ఉద్యమకారులపైన పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలి, విడుదలచేయాలి.

ఋ. రాజకీయ ఉద్యమంలో పాల్గొన్న కారణంగా అరెస్టు చేసిన వారందర్నీ రాజకీయ ఖైదీలుగా గుర్తించాలి.

***సరైన డిమాండ్ల ప్రాతిపదికగా, సరైన నాయకత్వాన్ని అందిస్తే ప్రజలను పోరాటాలలోకి సమీకరించేందుకు అపరిమిత అవకాశాలున్నాయని పరిస్థితీ, మన నిర్మాణ అనుభవాలూ తెలుపుతున్నాయి. వీటిని వినియోగించుకుని ప్రజలను ఆర్థిక, రాజకీయ పోరాటాలలోకి సమీకరించి, వాటిని విప్లవోద్యమంలో భాగం చేయాలి.***

**ఆగస్టు, 2012**

**ఆంధ్రప్రదేశ్ రాష్ట్రకమిటీ**

**సి.పి.ఐ (ఎం.ఎల్.)**

## గుంటూరుజిల్లా ... (చివరి పేజీ నుండి)

కదిలారు. ప్రభుత్వ రెవిన్యూ అధికారులను కలిసి ఇండ్ల స్థలాలు పంపిణీ చేయవలసినదిగా అనేక మార్లు విజ్ఞప్తి చేశారు. 'రెంటచింతల రెవిన్యూ పరిధిలో ప్రభుత్వ భూమి సెంటుకూడా లేదు, ప్రభుత్వం, ప్రైవేటు భూమిని కొనుగోలు చేసి యిచ్చే పరిస్థితిలో లేదు, మమ్ములను ఏం చేయమంటారు' అని ప్రభుత్వ రెవిన్యు అధికారులు ప్రజలకు, ప్రజాసంఘాలకు సమాధానం చెపుతూ వచ్చారు, దాటవేస్తూ వచ్చారు.

రెంటచింతలగ్రామంలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) జరిపిన సర్వేలో పోరంబోకు, బంజర్లు, అన్యాక్రాంతం కాబడిన అసైన్డ్ భూములు అనేకం వెలుగులోకి వచ్చాయి. అలా వెలుగులోకి వచ్చి, గ్రామానికి దగ్గరగా, ప్రజల నివాసానికి అనుకూలంగా ఉన్నభూమి–పుల్లారెడ్డికుంట సర్వేనంబరు 300 లోని భూమి. ఇది పేదల నుండి పెత్తందారీ భూస్వాములకు బదలాయింపుకాబడిన అసైన్‌మెంట్ భూమి. ఈ భూమిలో ప్రజలకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేస్తూ రైతుకూలీ సంఘం (ఆం.ప్ర.) ఆందోళనాకార్యక్రమాలు ప్రారంభించి కొనసాగిస్తూవస్తున్నది.

2012 జనవరి 23 నుండి జూన్ 24 వరకు పలుదఫాలుగా స్థానిక, జిల్లా స్థాయి రెవెన్యూ అధికారులకు వివిధ ప్రజాఆందోళనల ద్వారా మహజర్లు అందజేశారు. ధనిక భూస్వామ్య, పెత్తందార్ల చేతులలో ఉన్న పేదల అసైన్డ్ భూమిని నిరుపేదలకు ఇండ్ల స్థలాలుగా కేటాయించాలని డిమాండ్స్ చేస్తూ కరపత్రాలు వేసి ప్రచారం చేశారు. అయినప్పటికీ 'సంక్షేమ' ప్రభుత్వం, నిరుపేద ప్రజల మొరనాలకించలేదు. సభలు, సమావేశాలు ఆందోళనల రూపాలలో ప్రజలను సంఘటితపరుస్తూ – భూస్వాముల అదిరింపులు, బెదిరింపులను–ప్రజలమధ్య చీలికలుపెట్టే కుయుక్తులను–ఆందోళనలను నీరుగార్చే వాదనలను– భయకంపితులను చేసే మాటలను– రెచ్చగొట్టి గొడవలకు దించాలనే కుట్రలన్నింటినీ అధిగమిస్తూ ఎప్పటికప్పుడు ప్రతిమాట వద్ద, ప్రతి మలుపులో ప్రజలను వెన్నుతట్టి నిలబెడుతూ, సంఘటితపరుస్తూ– పటిష్టం చేసుకుంటూ– 'ఇండ్లస్థలాల సాధన పోరాట కమిటీ'ని ఏర్పాటు చేసుకుని 24-6-12న ఆ భూములలోకి వందలాది మంది ప్రజలు కదిలి, ఎర్రజెండాలు పాతి, గుడిసెలు వేసుకున్నారు.

### గుడిసెలు కూల్చివేతకు భూస్వామ్య పెత్తందార్ల ప్రయత్నాలు–ప్రజలపై వేధింపు, అణచివేత చర్యలు

గుడిసెలు వేసిన రోజు రాత్రి భూస్వామ్య పెత్తందారులు– స్థానిక ఎస్ఐ, గురజాల సిఐ ఇతర పోలీసు సిబ్బంది 20 మందితో వచ్చి "మీకేమి హక్కు ఉందని రాత్రిపూట గుడిసెలు వేస్తున్నారు? ఇవి అసైన్డ్ భూములే అని రెవిన్యూ అధికారులు మీకేమన్నా వ్రాసియిచ్చారా? మీరు ఈ రకంగా చేస్తే శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమౌతుంది. మర్యాదగా భూముల నుండి బయటకురండి. లేకుంటే మీపై కేసులు నమోదుచేయాల్సి ఉంటుంది" అంటూ ప్రజలను బెదిరించాలని చూశారు. కొందరిని అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. అయినప్పటికీ ఏమాత్రం బెదరకుండా, ఒకప్రక్క జోరున వర్షం కురుస్తున్న ఆ రాత్రివేళ మహిళలు, పురుషులు, కుటుంబాలుగా తరలివచ్చి గుడిసెలను వేసుకున్నారు.

పోలీసుల ఈ చర్యలను ప్రజలందరూ, ముఖ్యంగా మహిళలు పెద్దపెట్టున నినాదాలు చేస్తూ తీవ్రంగా వ్యతిరేకించారు. '1977 అసైన్డ్ భూముల బదలాయింపు నిషేధచట్టం' గురించి పోలీసులతో చర్చిస్తూ, ఈ భూమిని అమ్మడం, కొనడం చెల్లుబాటుకాదని, చట్టరీత్యా ఈ భూమిని కొనుగోలు చేయడం నేరమని, అందుకు 6 నెలల వరకు జైలు మరియు 2000 రూ॥ జరిమానా ఉందని, అందువల్ల ఈ భూములు కొనుగోలు చేసిన సదరు పెత్తందారులు, భూస్వాములే నేరస్తులని, నేరస్తుల తరఫున మీరెలావచ్చారని, మొదట వారిపై కేసులు పెట్టి అరెస్టు చేయాలని, ఈ భూమి అసైన్డ్ భూమి కనుక తమకు చెందాల్సినదేనంటూ మహిళలు పోలీసుల వాదనను తిప్పికొట్టి, పోలీసుస్టేషన్‌ను దిగ్బంధనం చేశారు. 'మేము కేసులకైనా, అరెస్టులకైనా సిద్ధమే. అందర్నీ అరెస్టు చేసుకోండి' అంటూ ఒక్క ఉదుటున స్టేషన్‌లోకి జొరబడగానే ప్రజల ఆగ్రహాన్ని, సంఘటిత శక్తిని గమనించిన పోలీసు అధికారులు, అరెస్టుచేసిన వారందరినీ అప్పటికప్పుడే వదిలిపెట్టారు.

సంఘనాయకత్వాన నిరుపేదప్రజలు ఎర్రజెండాలు పాతి గుడిసెలు వేసుకోవడంతో, ఎలాగైనా ఆ గుడిసెలను తొలగించి ఆ భూమిలో పైరు వేయాలని భూస్వామ్య పెత్తందారులు అన్నిరకాల ప్రయత్నాలూ ప్రారంభించారు. వారికున్న రాజకీయ, ఆర్థిక, సాంఘిక బలాన్ని, పలుకుబడిని ఉపయోగించి తహశీల్దార్‌పై వత్తిడిచేసి, రెవెన్యూ రికార్డులను తమకు అనుకూలంగా తయారు చేయించుకోవాలని; దీనిపై హక్కు తమదే అని చెప్పించుకోవాలని శతవిధాల ప్రయత్నం చేశారు.

అక్రమ పద్ధతులలో పుట్టించుకున్న పాసుపుస్తకాలు, శిస్తురశీదులు, రిజిస్ట్రేషన్ పేపర్లను ఆర్‌డిఓ, కలెక్టర్లకు అందించి, వీటి ప్రకారం ఆ భూమి తమ కష్టార్జితమని, దానిపై హక్కు తమకే ఉందని, రైతుకూలీసంఘం వాళ్ళు ప్రజలను రెచ్చగొట్టి భూముల్లోకి దించుతున్నారని, అమాయకులైన ప్రజలు వారి మాయమాటలు విని స్థలం వస్తుందనే ఆశతో మంచి చెడ్డలు ఆలోచించకుండా సంఘంవాళ్ళు చెప్పినట్టు చేస్తున్నారని, వాళ్ళకి మావోయిస్టు పార్టీతో సంబంధాలు ఉన్నాయని, వారు మావోయిస్టు పార్టీ సానుభూతిపరులనీ జిల్లా ఎస్‌పి గారికి నివేదించుకున్నారు.

సంఘ నాయకత్వ కామ్రేడ్స్‌తోపాటు మరికొందరిపై కోర్టులో దావా పిటీషన్‌వేసి, కోర్టు కమీషన్‌ని కోరుతూ నోటీసులు కూడా పంపించారు.

భూస్వాములు చేస్తున్న ఈ దుష్ప్రచారాన్ని ఖండిస్తూ సంఘ నాయకత్వం, ప్రజలు వెంటనే పెద్దఎత్తున కదలి, నిరసన కార్యక్రమం నిర్వహించి మావోయిస్టులమని తమపై ముద్రలు వేస్తున్న భూస్వామ్య పెత్తందార్లపై చర్యలు తీసుకొనవలసినదిగా తహశీల్దార్ గారిని, స్థానిక ఎస్ఐ గారిని కోరారు. అదే రోజు ప్రదర్శనగా వందలాది మందితో వెళ్ళి, పడిపోయిన గుడిసెలను నిలబెట్టుకొని గట్టిగా వేసుకున్నారు.

లక్ష్మింపేట దళితుల ఊచకోతను ఖండిస్తూ బాధిత దళితులకు మద్దతుగా హైదరాబాదులో రైతుకూలీసంఘం ఆధ్వర్యంలో జరిగిన సభకు సంఘ నాయకత్వం, ప్రజలు వెళ్ళిన సందర్భాన్ని అనువుగా చేసుకుని భూస్వామ్య పెత్తందారులు గుడిసెలను పూర్తిగా పీకివేసి –ట్రాక్టర్‌తో దున్ని ఆ భూమిలో ప్రత్తి విత్తనాలను ఎదపెట్టారు. ఆరోజు స్థానికంగాఉన్న కొద్దిమంది ఆర్‌ఐని, ఎస్ఐని కలిసి గుడిసెలు పీకివేసిన సంఘటనపై, విత్తనాలు ఎదపెట్టే విషయమై తెలియచేసి, విత్తనాలు ఎదపెట్టడాన్ని ఆపాలని డిమాండ్ చేశారు. ఆ మేరకు ఆర్.ఐ., ఎస్.ఐ. గార్లు కదలి వెళ్ళి విత్తనాల ఎదను అడ్డుకుని అరకలను వెనకకు పంపించారు.

15-7-12 ఉదయాన్నే ప్రజలందరూ కదిలివెళ్ళి పీకి వేసిన గుడిసెలను తిరిగి మళ్ళీ ఇంకా గట్టిగా వేసుకున్నారు. ఎదపెట్టిన విత్తనాలను సాళ్ళుపట్టి ఏరి పారవేశారు. ప్రజలు గుడిసెలు వేసుకునే సమయంలో పోలీసులు, రెవెన్యూ సిబ్బంది వచ్చి గుడిసెలు వేయడానికి వీలులేదని ప్రజలను అటకాయించారు. అయినా, ప్రజలు వారిని నిలువరించి గుడిసెలు తిరిగి వేసుకున్నారు.

పేదల గుడిసెలు కూల్చిన వారిని అరెస్టు చేయకుండా, తమను గుడిసెలు వేయవద్దంటారేంటని పోలీసు, రెవెన్యూ అధికారులను మహిళలు నిలదీశారు. ఇప్పటికైనా తమ గుడిసెలు పీకి ధ్వంసం చేసిన భూస్వామ్య పెత్తందారులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఎస్సీ, ఎస్టీ ప్రజల ఆస్తులను ధ్వంసం చేసిన నేరానికి వారిపై ఎస్సీ, ఎస్టీ అత్యాచారాల నిరోధక చట్టం ప్రకారం కేసు నమోదు చేసి, అరెస్టు చేయాలని, భూస్వాముల వద్దనుండి నిరుపేదలకు నష్టపరిహారం యిప్పించాలని డిమాండ్ చేస్తూ ఆందోళన కార్యక్రమం నిర్వహించారు.

చిన్నపాటి ఇంటి స్థలంకూడా లేక, అద్దె ఇండ్లలో ఉంటూ, అద్దెలు చెల్లించలేక నానా అవస్థలు పడుతున్న 'రెడ్డి'కులస్థులైన కొందరు పేదలు ఈ ఆందోళనలో చురుగ్గా పాల్గొంటున్నారని, వారిని అద్దెఇళ్ల నుండి గ్రామంలోని పెత్తందారులు ఉన్నపళంగా ఖాళీ చేయించారు. అప్పులున్న పేదలను వెంటనే అప్పు చెల్లించి తీరాలని తీవ్రంగా ఒత్తిడి చేశారు. కూలి పనులకు పిలవడం ఆపివేశారు. ఇండ్లలో పాచిపనులకు రావద్దన్నారు. తమ పొలంగట్లపై నడవవద్దన్నారు. పురుగు, ఎరువు, విత్తనాల కొట్లలో అప్పులు పెట్టడం ఆపివేశారు. వడ్డీకైనా అప్పులు యివ్వడం మానివేశారు. సంఘం వాళ్ళ మీటింగుకి కర్రలు యివ్వవద్దని అడితీలవారిని బెదిరించారు. వివిధ వేడుకల సందర్భంగా ఆనవాయితీగా దళితులు భోజనాలకి వెళ్లితే 'మా ఇండ్లకు వచ్చి భోజనాలు తినడానకి సిగ్గులేదా, ఎవరు రమ్మన్నారు మిమ్మల్ని!' అని బంతిమీద కూర్చున్న వారిని లేపి పంపి అవమానించారు. కొందరిని తాగబోయించి సంఘ సభ్యులను తిట్టించి, రెచ్చగొట్టి గొడవలు పెట్టించడానికి కుట్రలు, కుతంత్రాలు పన్నుతూ వేధింపు చర్యలకు పాల్పడుతూ, అవమానాలు సాగిస్తూ ఉద్యమాన్ని బలహీనపర్చడానికీ, విచ్ఛిన్నం చేయడానికీ పడరాని పాట్లు పడుతున్నారు.

ప్రజలు వీటన్నింటినీ ఎదుర్కొంటూ అధిగమిస్తూ భూమిని దక్కించుకోవాలనే తపనతో నిలబడివున్నారు. ప్రజలకు వస్తున్న ఈ యిబ్బందులన్నిటిని సమష్టిగా ఎదుర్కొని, అధిగమించే విధంగా సంఘం ప్రజలను చైతన్యపరుస్తూ ఆందోళనను ముందుకు సాగిస్తోంది.

ఈ క్రమంలోనే, భూస్వామ్య పెత్తందార్ల వేధింపులను, కులం పేరుతో దళితులను అవమానించటాన్ని, సాంఘిక బహిష్కరణకు గురిచేసే ప్రయత్నాలను, అణచివేత చర్యలను ఖండించాలని, వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ స్థానిక రెవెన్యూ, పోలీసు అధికారులను, జిల్లా కలెక్టరు, ఎస్‌పిగార్లను కలిసి విజ్ఞప్తి చేశారు.

మాచర్ల నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెసుపార్టీ ఎంఎల్‌ఏ పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని 300మంది ప్రజలతో కలిసి వెళ్ళి పరిస్థితిని వివరించి, ప్రజల న్యాయమైన డిమాండ్ వైపు నిలబడమని చెప్పి మెమోరాండం ఇచ్చి మాచర్ల పట్టణంలో ప్రదర్శన నిర్వహించారు.

రెంటచింతల గ్రామంలో నిరుపేదలు ఇండ్లస్థలాల కొరకు చేస్తున్న పోరాటం పల్నాడులో ఒక చర్చనీయాంశంగా మారింది. ఈ భూమిపై హక్కు ఎవరిది? ఈ భూమి ఎవరికి చెందుతుంది? ప్రభుత్వం ఈ భూములపట్ల ఏ నిర్ణయం తీసుకుంటుంది? చివరికి ఇది ఎటుతేలుతుందోనని ఈ పరిస్థితిని గమనిస్తున్నవారి ఆలోచనలు, భావనలు మెదులుతూఉన్నాయి.

ఈ భూములపై తమకు అన్ని హక్కులూ ఉన్నాయనీ, ఈ భూములపైకి వచ్చే వాడెవడనే అహంతో యథేచ్ఛగా పేదల భూమిని అక్రమంగా స్వాధీనంలో ఉంచుకుని, దర్జాగా భూస్వాములు అనుభవిస్తున్న సమయంలో రైతుకూలీసంఘం (ఆం.ప్ర.) ప్రజలను కదిలించి ఆ భూములలో గుడిసెలు వేయించటం ఆ వర్గానికి కంటగింపైంది.

### భూములపై 145 సెక్షన్ అమలు

ప్రజలు గుడిసెలు వేయడం, భూస్వాములు వాటిని పీకివేసి విత్తనాలు వేయడం, ప్రజలు తిరిగి గుడిసెలు వేసుకొని భూస్వాములు వేసిన విత్తనాలను ఏరివేయడం, ఇలా ప్రజలతో భూస్వాములు తలపడుతూ వుండడంతో నరసరావుపేట ఆర్‌డిఓ ఉత్తర్వుల మేరకు ఆ భూమిలోకి ఎవరూ వెళ్ళకుండా 145 సెక్షన్‌ని అమలు పరుస్తున్నట్లు తహశీల్దార్ ప్రకటించారు. అప్పటికి గుడిసెలు వేసుకొని పొసెషన్‌లో ప్రజలేఉన్నారు కనుక, ఆ భూమిపై ఐపిసి 145 అమలు జరపడం అంటే భూస్వాములు పేదల గుడిసెలు పీకకుండాను, పైరు వేసే అవకాశం లేకుండానూ కట్టడి చేయాల్సి ఉంటుంది.

ఈ 145 సెక్షన్ అమలుతో ప్రజలలో, పెత్తందారులలో ఒక చర్చ ప్రారంభం అయింది. భూస్వాములకు పట్టాలు, పాసుపుస్తకాలు అన్ని హక్కులూఉంటే వారిని కూడా భూమిలోకి వెళ్ళవద్దని ప్రభుత్వం ఎందుకు చెపుతుంది? 'మాకు హక్కులుంటే మా భూములపై 145 సెక్షన్ అమలు జరుపుతారేంటి? ఇది మా భూమి అనీ ప్రకటించకుండా వివాదస్పదమైన భూమి అని రికార్డులు పరిశీలించాలనీ చెపుతారేంటి?' అని భూస్వామ్య పెత్తందారులు ప్రభుత్వ రెవెన్యూ అధికారులను ప్రశ్నించలేకపోతున్నారెందుకని? ఈ భూములపై పరిశీలనకొరకు ఆర్‌డిఓ గారు వచ్చి "మీకున్న హక్కు పత్రాలను చూపించమంటే చూపించలేక పోయారేమిటి? వారి వద్దఉంటే చూపించేవారేకదా?" అనే చర్చలు సర్వత్రా జరిగాయి. ఏమైనా, భూస్వాములను ఆ భూములలోకి వెళ్ళకుండా ప్రజాందోళనతో అప్పటికి అడ్డుకట్ట వేయగలిగారు.

ప్రజలశక్తి మీద, రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) కార్యాచరణ మీద నమ్మకం, విశ్వాసం ఉన్నవారందరికీ ఈ భూమి ప్రజలకే చెందుతుందని, అంతిమ విజయం ప్రజలదనే ధృఢనమ్మకం ఏర్పడింది.

ఈ భూమిపై హక్కు నిరుపేద ప్రజలదే– భూస్వాములదికాదు, అని ప్రకటిస్తూ– భూస్వాముల అధీనంలో నుండి ఈ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, పేదలకు ఇండ్లస్థలాలు పంపిణీ చేయాలనే ప్రజల డిమాండ్‌ను విస్తృతంగా ప్రచారంలో పెడుతూ, పోరాటానికి బయటఉన్న ప్రజల నుండి, ఆలోచనాపరుల నుండి, నిరుపేద ప్రజలకు ఇండ్ల స్థలాలు దక్కాలి అని కోరుకునే వారి నుండి, ఇతర రాజకీయ పక్షాల నుండి, దళిత, బహుజన, పీడిత కుల, వృత్తి సంఘాలు, సంస్థల నుండి నైతిక మద్దతును, మాట సహాయాన్ని సంపాదించు కుంటూ, ఆందోళనోద్యమం ముందుకు సాగుతోంది.

ఈ పోరాటం–ఒకవైపు భూస్వామ్య పెత్తందారీ చెరలోఉన్న భూమిని విడిపించే దిశగా భూస్వామ్య పెత్తందారీ శక్తులతోను, మరోవైపు ప్రభుత్వం యొక్క సాచివేత, నాన్చివేత ధోరణులతోను, ప్రజల సమస్యలను పట్టించుకుని పరిష్కారం చేయకుండా మొద్దునిద్ర నటిస్తున్న అధికార, పాలకవర్గాల విధానాలతోను, దోపిడీ వర్గాలకు కొమ్ముకాసే ప్రభుత్వాల ఆచరణతోను– ఏకకాలంలో రెండు వైరివర్గాలతో తలపడుతూ ముందుకు సాగుతోంది.

ఒకవైపు న్యాయస్థానంలో పేదలపై పెత్తందారులు వేసిన దావాకి సమాధానంయిస్తూ దానికి కావలసిన సమాచారాన్ని, పత్రాలను సంపాదించుకుంటూ ఇటు న్యాయస్థానంలోనూ, మరోవైపు భూస్వామ్య, పెత్తందార్ల వేధింపు, అణచివేతలకు వ్యతిరేకంగాను; వేసిన గుడిసెలను నిరంతరం కాపాడుకుంటూ, ఆ నివాస స్థలాలు నిరుపేద ప్రజలకు దక్కేవిధంగానూ నిరంతరం ఉద్యమంలో సంఘటిత చైతన్యయుత ప్రజల పాత్ర ద్వారా ఆందోళనోద్యమం ముందుకు సాగుతోంది.

### సంఘీభావ సభ–సన్నాహక కృషి

ఇప్పటివరకు జరిగిన ఉద్యమాన్ని సమీక్షించుకుని, ఈ ఉద్యమానికి జిల్లా వ్యాపితంగా–ప్రధానంగా, పల్నాడు ప్రాంతంలోని వివిధ దళిత, బహుజన, కుల, వృత్తి సంఘాల, సంస్థల సంఘీభావాన్ని కూడగట్టడం కొరకు 26-8-12న సంఘీభావ సభ జరపాలని నిర్ణయించు కున్నారు. ఈ సభకు వివిధ పీడిత కుల, వృత్తి, దళిత, బహుజన సంఘాలను, సంస్థలను, ఎంసిపిఐ(యు), ఎంసిపిఐ పార్టీలను ఆహ్వానించారు. అలానే పౌర, ప్రజాస్వామిక హక్కుల సంఘాలను, ప్రజాస్వామిక న్యాయవాదులను ఆహ్వానించారు. మొత్తంగా 24 సంస్థలు, సంఘాలు, పార్టీల ప్రతినిధులు ఈ సంఘీభావ సభకు హాజరై మద్దతు ప్రకటించడానికి అంగీకరించారు.

పల్నాడు ప్రాంతంలో–రాజుపాలెం, పిడుగురాళ్ళ, మాచవరం, కారంపూడి, సత్తెనపల్లి, దుర్గి, మాచర్ల, వెల్దుర్తి, రెంటచింతల, గురజాల, దాచేపల్లి మండలాలలోను; జిల్లాలో కాకాని, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, రేపల్లె, నిజాంపట్నం తదితర ప్రాంతాలలో సంఘీభావ సభగురించి, కరపత్రాల పంపిణీ తదితర రూపాలలో విస్తృత ప్రచారం సాగింది.

రెంటచింతల మండలంలో రెంటచింతల, పాలువాయి, తుమ్మకోట, కొత్తగంగరాజుపల్లి, పశర్లపాడు, జెట్టిపాలెం, మల్లవరం, రెంటాల, మంచికల్లు గ్రామాలలో మైకుద్వారా రెండురోజులపాటు ప్రచారం జరిగింది. అలానే దుర్గి, వనంపల్లె, మంగాపురం తండా, ముటుకూరు గ్రామాలలో మైకుద్వారా 10 మందితో దళప్రచారం, కరపత్రాల పంపిణీ జరిగింది. మాచర్ల మండలం కంభంపాడులోను, వెల్దుర్తి మండలం మండాదిలోను జనరల్ బాడీ సమావేశాలు, కరపత్రాల పంపిణీ జరిగింది.

మంచికల్లు కోలాట బృందం, లంబాడీఅక్కల పాటలు, నృత్యం, డప్పులు, బ్యాండువాయిద్యాల కళాకారుల బృందం, బాలకళాకారుల నృత్య బృందం, ప్రజల పాటలు పాడే కళాకారుల బృందం–ప్రదర్శనలు యివ్వడానికి తర్ఫీదు పొందారు.

### సభముందురోజు రెవెన్యూ, పోలీసు యంత్రాంగం కలిసి సృష్టించిన భయోత్పాత వాతావరణం–పేదల గుడిసెల కూల్చివేత

సంఘీభావ సభకు సరిగ్గా ముందు రోజు, అనగా 25-8-12న, రెవెన్యూ అధికారులు, పోలీసు అధికారులు కలసి పేదలు వేసుకున్న గుడిసెలను అర్ధరాత్రి 2 గంటల నుండి ఉదయం 5 గంటల మధ్య కాలంలో పీకివేసి ఒక భయానక వాతావరణాన్ని సృష్టించారు. 50 మంది మహిళా పోలీసులు, 100 మంది సివిల్ పోలీసులు, 50 మంది స్పెషల్ పార్టీ పోలీసులు– లాఠీలు, తుపాకులు, ప్లాస్టిక్ డాళ్ళు తీసుకొని రెంటచింతల రోడ్లపై కవాతు తొక్కి ఒక పెద్ద యుద్ధ వాతావరణాన్ని సృష్టించారు. 25-8-12 ఉదయం తెల్లవారే సరికి వీధుల నిండా పోలీసులే! గుడిసెలు పీకివేశారనే విషయం, వందలమంది పోలీసులు దిగారనే సమాచారం గ్రామమంతా దావానంలా వ్యాపించింది. గుంపులు గుంపులుగా జనం...ఎక్కడ చూసినా ఒకటే అలజడి! "ఇంకేముంది, జనం వేసుకున్న గుడిసెలను పీకి సామాను తహశీల్దార్ కార్యలయానికి ట్రాక్టర్లలో తోలుతున్నారు. సంఘం వాళ్ళని చితకబాదడానికే ఇంతమంది పోలీసులు వచ్చారు. బొచ్చెల పోలీసులు (రిజర్వ్) కూడా వచ్చారు. రెడ్లంటే సామాన్యపోళ్ళా. వాళ్ళకి ముఖ్యమంత్రి స్థాయిలో పలుకుబడిఉంది. డబ్బు కలిగినోళ్ళు, ఏమైనా చేస్తారు. వాళ్ళు తలుచుకుంటే ఊచకోత కోపిస్తారు. 10 లక్షల డబ్బులు పోలీసులకు యిచ్చి, దగ్గరుండి గుడిసెలను పీకించారు. ఇక సంఘం వాళ్ళపని అయిపోయినట్టే. గుడిసెలు పీకించినట్టే ఇంకో 10 లక్షలు ఖర్చుపెట్టి ముఖ్యమైన వాళ్ళని ముగ్గురుని ఏపిస్తారంట. ఇక ఎవడు కదలాడిన వాడికి మూడినట్టే. ముందునుండీ మేమనుకున్నట్టే జరిగింది. పోలీసులు, రెవెన్యూ వాళ్ళు కలిసి గుడిసెలు పీకి భూస్వాములకే ఆ భూములను అప్పచెప్పారు. వాళ్ళు రేపు అరకలు కట్టి విత్తనాలు వేస్తారంట. సంఘం వాళ్ళు రోడ్లమీద కనపడితే లాఠీచార్జీ చేస్తారు. అరెస్టులు చేస్తారు, ఇక రేపు మీటింగు కూడా అనుమానమే!, మీటింగుని ఆపడానికే ఇంతమంది పోలీసులు వచ్చింది. మీటింగుకి వెళ్ళినవారిని వెళ్ళినట్టు కుళ్ళబొడుస్తారు. అవసరమైతే కాల్పులు కూడా జరుపుతారు. ఇక మీటింగు ఆగినట్టే. ఈ పరిస్థితులలో ఇంతమంది పోలీసుల మధ్య సభను నిర్వహించాలంటే

# గుంటూరుజిల్లా పల్నాడు ప్రాంతంలో నివాస స్థలాల కొరకు భూస్వామ్య పెత్తందారీశక్తులను రెవిన్యూ, పోలీసు యంత్రాంగాన్ని-నిలవేసి ప్రశ్నించుతున్న నిరుపేద, దళిత ప్రజాఆందోళన





రెంటచింతలగ్రామంలో, నివాసస్థలాలకొరకు నిరుపేద, దళిత ప్రజానీకం సాగిస్తున్న ఆందోళనకు సంఘీభావంగా 26-8-2012న జరిగిన సభకు అధ్యక్షవర్గం : (ఎడమనుండి వరుసగా) పాటిబండ్ల కోటేశ్వరరావు; సురభి అమరలింగం; పాలకుర్తి సత్తయ్య




సంఘీభావ సభలో ప్రసంగిస్తున్న కా॥ ఎస్. ఝాన్సి; సభకు హాజరైన ప్రజానీకం

**గుంటూరు జిల్లా** పల్నాడు ప్రాంతంలోని మండల కేంద్రమైన రెంటచింతల గ్రామంలో ప్రభుత్వం పేదలకు పంపిణీ చేసిన, డికె పట్టాలిచ్చిన అసైన్‌మెంట్ భూమి మరియు రాజకీయ బాధితుల పేరుతో ప్రభుత్వం యిచ్చిన అసైన్‌మెంట్ భూమి వెరసి మొత్తం 10.70 సెంట్లు వుంది. ఇది సర్వే నంబరు 300లో పల్లెర్ల చినపుల్లారెడ్డి కుంటభూమిగా ప్రజలనానుడిలో ఉంటూ రెవెన్యూ రికార్డులలో ప్రభుత్వ కుంటపోరంబోకు భూమిగా నమోదై ఉంది.

రెంటచింతల గ్రామంలోని ఎస్సీ, బిసీలకు షుమారు 15 మందికి ఆ సర్వే నెంబరులోని 6.50 సెంట్ల భూమిని తలా 10,15,20,30,40 సెంట్ల చొప్పున పంపిణీచేసి ప్రభుత్వం గతంలో డికె పట్టాలను యిచ్చి ఉంది. 1961 సం॥లో చనిపోయిన, రెంటచింతల గ్రామానికే చెందిన, నాళం మట్టపల్లి స్వాతంత్ర్య సమరంలో పాల్గొన్నాడని అతని కుమారుడైన నాళం నరసింహారావుకి రాజకీయ బాధితుడనే పేరు పెట్టి 1967 సం॥లో 4.22 సెంట్ల భూమిని ప్రభుత్వం కేటాయించింది. వీరికి పలు వ్యాపారాలు, నాపరాయి క్వారీలు ఉన్నాయి. కాగా, 1979 సం॥లో ఈ 4.22 సెంట్ల భూమిలో సానికొమ్ము చిన్నపరెడ్డి అనే వడ్డీవ్యాపారస్తునికి 2.11 సెంట్ల భూమిని, 2000సం॥లో ఏరువ థామసురెడ్డి అనే 100 ఎకరాల భూస్వామికి 2.11 సెంట్లభూమిని నాళం నరసింహారావు అమ్ముకొన్నాడు. ఎస్సీ, బిసీలకు యిచ్చిన భూములన్నింటినీ తుమ్మా మర్రెడ్డి అనే ధనిక పెత్తందారు, పేదలకు వడ్డీలకు డబ్బులిచ్చి చక్రవడ్డీలు, బారువడ్డీలు కట్టి అదిరించి బెదిరించి బాకీల కింద స్వాహా చేశాడు.

ఈ తరహాలోనే పేదలకు పంపిణీ చేసిన వందలాది ఎకరాల అసైన్‌మెంటు భూములు, రెంటచింతల గ్రామంతోపాటు పల్నాడు ప్రాంతంలో అన్యాక్రాంతమై ధనిక భూస్వామ్య, పెత్తందార్ల ఆధీనంలో ఉన్నాయి.

## ఇండ్ల స్థలాల కొరకు ప్రజాందోళనలు

పల్నాడు ప్రాంతంలో పిడుగురాళ్ళ మొదలుకొని మాచర్ల వరకు ఉన్న అన్ని మండల కేంద్రాలలో ఇండ్ల స్థలాల కొరకు గత కొంత కాలంగా పలుసంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు జరుగుతూ వస్తున్నాయి.

రెంటచింతల మండలంలో జెట్టిపాలెం, తుమృకోట, గోలి, మిట్టిగుడిపాడు, మంచికల్లు, రెంటచింతల తదితర గ్రామాలలో ఇండ్లస్థలాల కొరకు గత 2 సం॥గా పలు ఆందోళనలు జరుగుతూ మంచికల్లు, జెట్టిపాలెం గ్రామాలలో రైతుకూలీసంఘం(ఆం.ప్ర.) నాయకత్వాన, భూస్వామ్య పెత్తందారులను ఎదిరించి నిరుపేదలు కాలనీలను ఏర్పాటు చేసుకున్నారు.

ఈ క్రమంలోనే రెంటచింతల గ్రామంలో కూడా ఇండ్లస్థలాలు లేని నిరుపేదలంతా సంఘం పిలుపు నందుకుని పెద్దఎత్తున **(తరువాయి 14వ పేజీలో)**











***సంఘీభావ సభలో వక్తలు :*** పై వరుసలో : (ఎడమ నుండి) ఎస్. లక్ష్మారెడ్డి, ఉల్లిగడ్డల నాగేశ్వరరావు, డివిఎన్ స్వామి, ఎస్. లలిత, మామిడి సామియేలు, ఉల్లిందల వరప్రసాదు, బుట్టి మరియదాసు, వేల్పుల జక్రయ్య, బక్కమూడి ప్రసాదు
క్రిందవరుసలో : (ఎడమ నుండి) తూమాటి శివయ్య, ఎస్. వెంకటేశ్వరరెడ్డి, బి. శ్రీనివాసబాబు, పురిమెల నాగేశ్వరరావు, జెట్టిపాలెం వెంకటేశ్వర్లు, సూరేపల్లి కోటేశ్వరరావు, తురిమెళ్ళ బ్రహ్మయ్య, రేపూడి అంబన్న, పోలేపల్లి అబ్రహాంలింకన్











# 'ఆగస్టు 9-'క్విట్ఇండియా' ఉద్యమ స్ఫూర్తితో సామ్రాజ్యవాద వ్యతిరేకపోరాటాలకు కార్మికవర్గం నాయకత్వం వహించాలి'

## ఎఐఎఫ్‌టియు(న్యూ) అఖిలభారత పిలుపులో భాగంగా సభలలో వక్తల పిలుపు

*(జాతీయోద్యమంలో సామ్రాజ్యవాద, వలసపాలనకు వ్యతిరేకంగా ప్రజలు ప్రదర్శించిన సాహసాలకు, త్యాగాలకు ప్రతీక అయిన ఆగస్టు 9-క్విట్ ఇండియా ఉద్యమాన్ని స్ఫూర్తిగా తీసుకొని సామ్రాజ్యవాద దోపిడీకి, పీడనలకు వ్యతిరేకంగా కార్మికవర్గం, దేశభక్తియుత శక్తులు, ప్రజాస్వామిక వాదులు, ఇతర అన్ని వర్గాల ప్రజానీకం ఉద్యమించాలని ఎఐఎఫ్‌టియు(న్యూ) పిలుపునిచ్చింది. ఆ పిలుపుననుసరించి జరిగిన కార్యక్రమాలను అందిన మేరకు ప్రచురిస్తున్నాం -సంపాదకుడు)*

**బందరు, 9-8-12, :**

**ఎఐఎఫ్‌టియు(న్యూ)** పిలుపు మేరకు కృష్ణాజిల్లా మచిలీపట్నంలో ప్రదర్శన, బహిరంగసభ జరిగాయి. ఎఐఎఫ్‌టియు(న్యూ) పట్టణ కమిటి కార్యదర్శి కా॥ బెల్లంకొండ రవి ఈ సభకు అధ్యక్షత వహించారు. ఎఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర కార్యదర్శి కా॥ యద్దనపూడి సోని ప్రసంగిస్తూ దేశంలో 80కోట్ల మందిపైగా రోజుకు 20రూ॥లు కూడా ఖర్చుపెట్టలేని స్థితిలో దుర్భరమైన దారిద్రాన్ని అనుభవిస్తున్నారనీ, మరో 35 కోట్ల మంది చాలీచాలని వేతనాలతో చావలేక బ్రతకలేక, భద్రతలేని జీవితాలు గడుపుతున్నారనీ, ఉద్యోగ అభద్రత, చట్టం యొక్క రక్షణలేని కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులు మొత్తం కార్మికుల్లో 93% మందిగా ఉన్నారనీ, ఆనాటి బ్రిటీష్ వలసపాలనలో ప్రజల బ్రతుకుల కన్నా నేడు మరింత అధోగతిలో వున్నాయనీ, ఆనాడు జాతీయోద్యమంలో ప్రజలు ప్రదర్శించిన త్యాగాలకు సాహసాలకు, పోరాట చైతన్యానికి నేటి పాలకులు ద్రోహంచేసి సామ్రాజ్యవాదంతో రాజీ పడ్డారనీ, సామ్రాజ్యవాద ప్రయోజనాలకు రక్షకులైన భూస్వాములు, బడా పెట్టుబడిదారులు, దళారీలపై పోరాటాన్ని కొనసాగించటమే ముఖ్యంగా కార్మికవర్గం ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు.

అనంతరం సిపిఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి కా॥ ముప్పాళ్ళ భార్గవశ్రీ మాట్లాడుతూ సామ్రాజ్యవాదం పెంచిపోషిస్తున్న ప్రైవేటీకరణ, సరళీకరణకు వ్యతిరేకంగా కార్మిక, కర్షకవర్గాలు పోరాటం చేయాలనీ, భూస్వామ్య, పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద దోపిడి, పీడనలు అంతం కావాలంటే కార్మికవర్గం నాయకత్వం వహించాలనీ పిలుపునిచ్చారు. ఇంకా ఎఐఎఫ్‌టియు బందరు పట్టణ అధ్యక్షులు కా॥ ముచ్చు సుధాకరరావు, రైతుకూలీసంఘ (ఆం.ప్ర) జిల్లా నాయకులు కా॥ పామర్తి అంజమ్మ, జె.జగన్‌లు సామ్రాజ్యవాద దోపిడీ తీవ్రతను వివరిస్తూ ప్రసంగించారు. ప్రజాకళాకారులు సభావేదికపై ప్రదర్శించిన, "ధరలు బాబోయ్ ధరలు", కార్మికుల, రైతులనుద్దేశించి పాడిన జనంపాటలు ఆకట్టుకున్నాయి.

బహిరంగసభకు ముందు స్థానిక టౌన్‌హాలు నుండి రామనాయుడు పేట, రేవతిసెంటర్, మెయిన్‌రోడ్డు మీదుగా కోనేరుసెంటర్ వరకు సామ్రాజ్యవాద వ్యతిరేక నినాదాలతో ప్రదర్శన ఉత్తేజకరంగా జరిగింది. ప్రదర్శనలో ఆటోకార్మికులు, ముఠాకార్మికులు, రైతులు, కూలీలు, శ్రామిక మహిళలు 150 మందికి పైగా పాల్గొన్నారు. ఆటోడ్రైవర్లు ఆటోలతో ప్రదర్శనలో పాల్గొన్నారు.

పై కార్యక్రమాన్ని పురస్కరించుకొని మచిలీపట్నం ఆటోవర్కర్స్ యూనియన్, తాళ్ళపాలెం (మంగినపూడి) ఫోటోగ్రాఫర్స్ లేబర్ అసోసియేషన్, టూటౌన్ ముఠా యూనియన్, రైతుబజారు ముఠాయూనియన్‌ల జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించారు.




'క్విట్ ఇండియా' స్ఫూర్తినందుకోవాలని పిలుపునిస్తూ అనంతపురంలో జరిగిన సభలో ప్రసంగిస్తున్న కా॥ సి. పెద్దన్న; బందరులో జరిగన సభలో ప్రసంగిస్తున్న కా॥ భార్గవశ్రీ

**అనంతపురం,10-8-12:**

'క్విట్ ఇండియా' నినాదాన్ని గుర్తుచేస్తూ, కార్మికవర్గాన్ని సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాలకు సమాయత్తం చేయవలసిందిగా పిలుపునిస్తూ ఏఐఎఫ్‌టియు(న్యూ) పిలుపు మేరకు స్థానిక ఎన్.జి.ఓ. హోమ్ నందు సభ నిర్వహించారు. ఏఐఎఫ్‌టియు(న్యూ) రాష్ట్ర అధ్యక్షులు కా॥ సి.పెద్దన్న ఈ సభకు అధ్యక్షత వహించి మాట్లాడుతూ, క్విట్ఇండియా ఉద్యమ అమరులకు **(తరువాయి 15వ పేజీలో)**

***Printed, Published and Owned by P.Jaswantha Rao 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010 and Printed at Chaitanya Printers, Gora Veedhi, Suryaraopet Vijayawada-2***
***Editor: P. Jaswantha Rao, 32-13-26/1, B.M.Rao Road, Moghalrajapuram, Vijayawada-520 010***